
'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 325

గురువారం 15-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేటి నుంచి మూడో టెస్టు

రాజ్‌కోట్ మైదానంలో తలపడనున్న భారత్, ఇంగ్లండ్ జట్లు -12లో



నష్టాల్లోంచి.. లాభాల్లోకి!

రాణించిన ఇంధన, మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు -13లో



సివిల్స్ నోటిఫికేషన్ విడుదల

అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి యూపీఎస్సీ 2024కుగాను బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

- వివరాలు 6లో



పాక్ ప్రధానిగా షెహబాజ్!

పాక్ నూతన ప్రధానిగా పీఎంఎల్–ఎన్ అధినేత, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ తమ్ముడు షెహబాజ్ షరీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

- వివరాలు 6లో



సోనియా రాజ్యసభ నామినేషన్

కాంగ్రెస్ అగ్రనేత, ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ బుధవారం రాజస్తాన్ నుంచి రాజ్యసభకు నామినేషన్ వేశారు.

- వివరాలు 6లో



'కణా'కష్టం!

ప్రపంచవ్యాప్తంగా పురుషుల్లో పునరుత్పత్తి సామర్థ్యం క్షీణిస్తోందా? అంటే అంతర్జాతీయ అధ్యయనాలు అవుననే అంటున్నాయి.

- వివరాలు 14లో

న్యూస్‌రీల్

తెలంగాణ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు

సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు


జస్టిస్ సుజయ్ పాల్


జస్టిస్ మౌసమీ

న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు రానున్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమీ భట్టాచార్యలను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాల్సిందిగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. అలాగే కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామన్‌ను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలని కూడా కేంద్రానికి సూచించింది. మంగళవారం సమావేశమైన సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని కొలీజియం సదరు న్యాయమూర్తుల అభ్యర్థన మేరకు నిర్ణయం తీసుకుంది.


బీజేఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



భారతీయ జనతా పార్టీ శాసన సభాపక్షనేతగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే శాసనమండలిలో బీజేపీ పక్షనేతగా ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఒక లేఖ ద్వారా తెలిపారు.

- వివరాలు 2లో

ఏపీపీఎస్సీ.. మరో ఐదు



నిరుద్యోగ యువతకు శుభవార్త! ఇప్పటికే గ్రూప్– 1, 2 పోస్టులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చిన ఏపీపీఎస్సీ త్వరలో అటవీ శాఖలో పలు ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వడంతో ఈమేరకు వివిధ కేటగిరీల్లో 861 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల జారీకి చర్యలు చేపట్టింది.

- వివరాలు 10లో

ఇదంజ్జగత్



ఆ ఒక్కటి ఇవ్వకున్నా మనం చేసేది ఏమీ లేదు! తొందరగా తీసేసుకుందాం సార్!


బుధవారం అబుదాబిలో 'బాప్స్' ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా అర్చకులతో ప్రధాని మోదీ

మానవ చరిత్రలోనే సువర్ణాధ్యాయం

- అబుదాబిలో ఆలయ నిర్మాణంపై ప్రధాని మోదీ ప్రశంసలు
- గుడిని లాంఛనంగా ప్రారంభించిన ప్రధాని
- యూఏఈ అధ్యక్షునికి కృతజ్ఞతలు
- భారతీయుల మది గెలిచిన యూఏఈ

- వివరాలు 6లో


పంజాబ్–హరియాణా శంభు సరిహద్దు వద్ద బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

రెండో రోజూ అదే ఉద్రిక్తత

- పంజాబ్–హరియాణా శంభు బోర్డర్ వద్ద యుద్ధ వాతావరణం
- రైతులు, పోలీసుల మధ్య ఘర్షణ
- డ్రోన్లతో బాష్ప వాయువు గోళాలు ప్రయోగించిన పోలీసులు
- వెనక్కి తగ్గబోమన్న నిరసనకారులు

6 లో

పదేళ్లు నేనే ముఖ్యమంత్రి

వెంటనే అధికారంలోకి వస్తామని కేసీఆర్ అంటున్నాడు.. ఎట్లొస్తడో ఆయన సంగతి చూస్తా



ప్రజలు ఆశీర్వదిస్తే మరో పదేళ్లూ ఇందిరమ్మ రాజ్యమే: రేవంత్

- కేసీఆర్ సవాల్ విసురుతున్నా..ఈ పదేళ్లలో నా ఒక్క వెంట్రుకకైనా పీకుతావేమో చూడు
- కంచర గాడిదలను ఇంటికి పంపి రేస్ గుర్రాలను తెచ్చామని ప్రజలు అంటున్నరు
- వీల్‌చైర్‌లో నల్లగొండకెళ్లి సెంటిమెంట్ డ్రామాలకు తెర తీశారు
- సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకే కేసీఆర్ నీళ్ల దారి పట్టారన్న ముఖ్యమంత్రి
- ఎల్బీ స్టేడియంలో 13,445 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల తానే సీఎంగా ఉంటానని, ప్రజలు ఆశీర్వదిస్తే ఇంకో పదేళ్ల ఇందిరమ్మ రాజ్యమే ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వెంటనే అధికారంలోకి వస్తామని కేసీఆర్ అంటున్నాడని, కేసీఆర్ ఎట్లా వస్తడో ఆయన సంగతేందో చూస్తానని అన్నారు. 'చంద్రశేఖర్‌రావు.. నీకు సూటిగా సవాలు విసురుతున్నా..ఈ పదేళ్లలో నా ఒక్క వెంట్రుకనైనా పీకుతావేమో చూడు..' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఖేల్ ఖతం..దుకాణ్ బంద్ అయ్యిందని అన్నారు. శాసనసభకు రావడానికి చేతకాని కేసీఆర్ వీల్ చైర్లలో నల్లగొండ సభకు వెళ్లి సెంటిమెంట్ డ్రామాలకు తెర తీస్తున్నారని విమర్శించారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ మాయలో పడవద్దని అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. పోలీసు, జైళ్లు, అగ్నిమాపక, ఎక్సైజ్, రవాణా శాఖల్లో కానిస్టేబుళ్లుగా ఎంపికైన మొత్తం 13,445 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను సీఎం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. 'కేసీఆర్ 3,565 రోజులు అధికారంలో ఉన్నారు. అప్పుడే మా ప్రభుత్వం ఏమీ చేయలేదని విమర్శలు

మిగతా 2వ పేజీలో ▶

సచ్చిన పామును మళ్లీ చంపుతారా?

- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- సీఎంను పట్టుకుని ఏం పీకడానికి మేడిగడ్డకు వెళ్లారని అంటారా?
- మేడిగడ్డ మేడిపండు మాదిరిగా కుంగిపోతే, అక్కడ నీళ్లు నింపే అవకాశముందా?
- కేసీఆర్, హరీశ్‌రావులకే బాధ్యతలు అప్పగిస్తామన్న ముఖ్యమంత్రి
- మేడిగడ్డలో నీళ్లు నింపి అన్నారం, సుందిళ్లలో పోసే బాధ్యత తీసుకోవాలని వ్యాఖ్య

3 లో

రూ.2.15 లక్షల కోట్లు కావాలి

6 గ్యారంటీలు, 5 డిక్లరేషన్లు, 300 హామీలెలా అమలు చేస్తారు?



గ్యారంటీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- నిధులు ఎలా సమకూరుస్తారో చెప్పాలి
- హామీల అమలుపై చర్చ జరగాలి
- పాతబస్తీలో రంజాన్‌కు నీరు ఇవ్వాలి
- శాసనసభలో ఎంఐఎం నేత అక్బరుద్దీన్

సాక్షి, హైదరాబాద్: 'ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పథకాల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ఈ పథకాలకు నిధులు ఏ విధంగా సమకూరుస్తారో ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉంది'అని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై శాసనసభలో బుధవారం జరిగిన చర్చలో అక్బరుద్దీన్ మాట్లాడుతూ ఇప్పటికే రెండు పథకాలు అమలు చేయడం అభినందనీయమన్నారు. మిగతా నాలుగు పథకాలు వందరోజుల్లో అమలు చేయాలని చెప్పారు. ఈ ఆరు పథకాలకు బడ్జెట్‌లో రూ.53,196 కోట్లు కేటాయించారు..రాష్ట్ర ఆర్థిక రాబడి రూ. 2,74,185.7 కోట్లు, ఖర్చు 2,75,890.69 కోట్లుగా బడ్జెట్‌లో అంచనా వేశారు. రాష్ట్ర రాబడులు, అప్పులకు చెల్లించే వడ్డీలు, నెలవారీ చెల్లింపులకు మధ్య పొంతన కుదరడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆరు గ్యారంటీలు,

మిగతా 2వ పేజీలో ▶



ఇది డొల్ల బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వంపై అసెంబ్లీలో కడియం శ్రీహరి ధ్వజం

- 6 గ్యారంటీలను నమ్మి గెలిపించిన జనం నెత్తిన భస్మాసుర హస్తమే
- గ్యారంటీలకు చూపిన కేటాయింపులు చాలవు

2 లో

నీకు చేతకాకపోతే తప్పుకో...

నేను చేసి చూపిస్తా

కాళేశ్వరం పునరుద్ధరణపై సీఎంను ఉద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్య

- ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బురద రాజకీయాలు చేస్తోంది
- ఎంత తక్కువ చేసి మాట్లాడినా కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయని
- ఇందులో మేమెలాంటి తప్పు చేయలేదు.. ఎలాంటి విచారణకైనా సిద్ధం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించడం చేతకాకపోతే తప్పుకొని ప్రభుత్వాన్ని తమకు అప్పగించాలని, రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తే తాను సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి ప్రాజెక్టును పునరుద్ధరిస్తానని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ చేశారు. 'నాకు చేత కాదు.. నువ్వు చేసి చూపించమని రేవంత్ అడిగితే నేను సిద్ధం.. నాకు బాధ్యత అప్పగిస్తే చేసి చూపిస్తా' అని అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'శాసనసభ పవిత్రత, సంప్రదాయాలను సీఎం రేవంత్ మంట గలుపుతున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 3వ పేజీలో ▶

ఇది కంచెల రాజ్యం

- సభలో మాట్లాడనివ్వరు.. బయట కూడా అంతేనా?
- మీకు చెప్పినా ఒక్కటే.. గోడకు చెప్పినా ఒక్కటే
- మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాషను ఖండిస్తున్నాం
- మీడియా పాయింట్‌లో మాట్లాడొద్దని ఏమైనా నిబంధనలు ఉన్నాయా?
- అసెంబ్లీ బయట నేలపై కూర్చుని నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు
- మీడియా పాయింట్‌కు వెళ్లే దారిలో ఉద్రిక్తత

- వివరాలు 3లో

రాజ్యసభ అభ్యర్థులుగా

రేణుక, అనిల్ యాదవ్

కాంగ్రెస్ 'సర్దుబాటు'

- లోక్‌సభ టికెట్ల ఖరారును దృష్టిలో ఉంచుకొని అనూహ్య ఎంపిక
- ఖమ్మం, సికింద్రాబాద్ స్థానాల్లో ఇతర ఆశావహులకు లైన్ క్లియర్
- సామాజిక సమీకరణలు, యువతకు ప్రాధాన్యతలో భాగంగా చాన్స్
- సోనియా రాజస్తాన్‌కు వెళ్లడంతో రెండో నేతకు లభించిన అవకాశం


రేణుకాచౌదరి


అనిల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి సంబంధించిన రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ పార్టీ 'లోక్‌సభ సర్దుబాటు'ను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకుంది. కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్‌లను పెద్దల సభకు ఎంపిక చేసింది. పార్టీ అధ్యక్షుడు

మిగతా 2వ పేజీలో ▶


వద్దిరాజుకు బీ–ఫాం అందజేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

రాజ్యసభకు మళ్లీ వద్దిరాజు

- వరుసగా రెండోసారి అవకాశం ఇచ్చిన బీఆర్‌ఎస్ అధినేత
- నేడు నామినేషన్ వేయనున్న రవిచంద్ర

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేరును పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో భాగంగా

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

బీజేఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ శాసన సభాపక్షనేత (బీజేఎల్పీ)గా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాసనమండలిలో బీజేపీ పక్షనేతగా ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఒక లేఖ ద్వారా తెలిపారు. బీజేఎల్పీ డిప్యూటీ లీడర్లుగా పాయల్ శంకర్, కాటిపల్లి వెంకటరమణారెడ్డిలను, కార్యదర్శిగా రామారావుపటేల్‌ను, చీఫ్‌విప్‌గా డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, విప్‌గా ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, కోశాధికారిగా పైడి రాకేశ్‌రెడ్డిలను ఎన్నుకున్నట్టు తెలియజేశారు. మహేశ్వర్‌రెడ్డి 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున నిర్మల్ నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి మళ్లీ నిర్మల్ నుంచి గెలుపొందారు.అయితే, వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది బీజేఎల్పీ నేత పదవిని ఆశించిన టి.రాజాసింగ్‌కు ఏ పదవి లేదా హోదా అప్పగించకపోవడం పార్టీలో చర్చనీయాంశమైంది. ఆయనకు జాతీయస్థాయిలో ఏదైనా పదవిపై తరుణ్‌చుగ్ హామీ ఇచ్చినట్టు తెలిసింది.

మహేశ్వర్‌రెడ్డికి కిషన్‌రెడ్డి అభినందన

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌లను కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్‌లు బుధవారం రాత్రి శాలువాలతో సన్మానించారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

రసకందాయంలో కొత్తగూడెం మున్సిపాలిటీ రాజకీయం

కొత్తగూడెం అర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 19న బల పరీక్ష జరగనున్న నేపథ్యంలో రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ఎనిమిది మంది కౌన్సిలర్ల భర్తలు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేర్చారు. త్వరలోనే మరో పదిమంది కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్‌లో చేరతారని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. కాగా, బీఆర్‌ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిపై అదేపార్టీకి చెందిన కౌన్సిలర్ భీమా శ్రీవల్లి నాయకత్వంలో 22 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన నోటీస్‌ను కలెక్టర్‌కు అందజేయగా, ఈనెల 19న బల పరీక్షకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే బుధ వారం నాటి తాజా చేరికలతో కొత్తగూడెం మున్సిపాలిటీ రాజకీయాలు మరింత రసకందాయంలో పడ్డాయి. 36 మంది కౌన్సిలర్లు ఉండగా.. ఒక కాంగ్రెస్ కౌన్సిలర్ సహా 22 మంది అవిశ్వాస తీర్మాన నోటీస్‌పై సంతకాలు చేశారు. 14 మంది చైర్‌పర్సన్ వెంట ఉన్నారు. వీరంతా మంగళవారం నుంచే క్యాంపులోనే ఉండగా... బలపరీక్ష నాటికి ఎవరు ఎటువైపు మొగ్గుచూపుతారో తెలియని పరిస్థితి నెలకొంది.

పదేళ్లు నేనే ముఖ్యమంత్రి

▶ మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు పదవులు లేకపోతే నెలల సమయం కూడా ఆగకుండా తన కూతురు కవితతో సహా అందరికీ పదవులు ఇచ్చారు. జూన్ 2, 2014న తెలంగాణ ఏర్పడిన గంటల వ్యవధిలోనే తన కుటుంబ సభ్యులకు మంత్రి పదవులు ఇచ్చుకున్నారు. 2019లో కూతురు కవిత ఓడిపోతే కేసీఆర్‌కు ఎంతో దుఃఖం వచ్చింది. ఆరు నెలలు తిరగకముందే ఎమ్మెల్సీ చేశాడు. ఇలా కుటుంబ సభ్యులు, బంధువులకు రాజకీయ పదవులు లేకపోతే వంద రోజులు కూడా ఆగని కేసీఆర్...నిరుద్యోగుల్ని మాత్రం పట్టించుకోలేదు. దాదాపు పదేళ్లుగా 30 లక్షల మంది యువత ఉద్యోగాలకు కోసం ఎదురు చూసేలా చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రయత్నం చేస్తుంటే..కాళ్లలో కట్టె పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం తిరస్కరించింది. కామారెడ్డిలో కేసీఆర్‌ను అక్కడి ప్రజలు బండకేసి కొట్టి ఓడించారు. తెలంగాణను కుటుంబం కోసం బలి ఇచ్చిన కేసీఆర్‌కు తెలంగాణ యువ పోలీసులు తగిన బుద్ధి చెబుతారు. గత ప్రభుత్వంలోని కంచర గాడిదలను ఇంటికి పంపించి, రేస్ గుర్రాలను ప్రభుత్వంలోకి తెచ్చుకున్నామని ప్రజలు అనుకుంటున్నారు..' అని రేవంత్ అన్నారు.



ఎంపికైన అభ్యర్థికి నియామక పత్రాన్ని అందిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొన్నం, తుమ్మల, జూపల్లి తదితరులు

నేను రేవంత్ అన్నలా అండగా ఉంటా..

'కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే ఉద్యోగ నియామకాలకు సంబంధించిన కోర్టు సమస్యలు పరిష్కరిస్తూ ఒక్కో విభాగంలో ఉద్యోగ నియామక పత్రాలు ఇస్తోంది. నిరుద్యోగులతో సంతోషం పంచుకోవాలనే ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు ఇస్తున్నాం. ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రిగా నేను పదవీ స్వీకారం చేసినప్పుడు ఎంత సంతోషం కల్గిందో..అంతే ఆనందం పోలీస్ కానిస్టేబుల్ నియామక పత్రాలు ఇస్తున్నప్పుడు కల్గుతోంది. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు రేవంత్ అన్నగా అండగా ఉంటా. అధైర్యం వద్దు. యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి. రాష్ట్రాన్ని సాధించుకున్న యువతకు ప్రభుత్వంలో, ప్రైవేటులో ఉద్యోగాలు, ఉపాధి కల్పించే బాధ్యత సీఎంగా నేను తీసుకుంటా.

ఆ సంతకం రైతులకు మరణ శాసనం

'కృష్ణా నీటిని ఏపీకి కేటాయిస్తూ కేసీఆర్ పెట్టిన ఆ సంతకం ఇప్పుడు తెలంగాణకు గుదిబండగా.. ఇక్కడి రైతులకు మరణశాసనంగా మారింది. ఈ పరిస్థితుల్లో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకే కేసీఆర్ నీళ్ల దారి పట్టిండు. మేడిగడ్డ అనే మేడిపండులోని అవినీతి పురుగులు బయటపడతాయన్న భయంతోనే కృష్ణానదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చారు. నీళ్లు, నిధులు, నియామకాలపై చర్చ కోసం అసెంబ్లీకి రమ్మంటే.. నల్లగొండకు వెళ్లి కేసీఆర్ బీరాలు పలుకుతున్నాడు. 'కంచర గాడిదలను ఇంటికి పంపించి రేస్ గుర్రాలను తెలంగాణ ప్రజలు తెచ్చుకున్నారని, ఆ కంచర గాడిద మళ్లీ అధికారం రావడం కలలో మాట' అని శాసనసభలో ఒక అటెండర్ నాతో అన్నాడు..' అని రేవంత్ చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి తెల్ల ఏనుగులా మారిందని అన్నారు. ప్రజల తీర్పు గౌరవించలేని స్థితిలో కేసీఆర్ ఉన్నారని, అధికారం పోయినా ఆయన భాష మారలేదని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో బానిస భవన్‌గా మారిన ప్రగతి భవన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాభవన్‌గా మార్చామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం

ఉద్యోగ నియామకాలలో తప్పిదాలకు తావు లేకుండా, ఎవరికీ నష్టం లేకుండా చర్యలు తీసుకుంటాం. రాబోయే రోజుల్లో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తాం. టీఎస్‌పీఎస్సీలో గతంలో జరిగిన అక్రమాలను నిలువరిస్తాం. పదేళ్లుగా గ్రూప్–1 పరీక్ష నిర్వహించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 567 పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలుపెట్టాం. నిరుద్యోగులకు నష్టం జరగకుండా వయో పరిమితిని 44 ఏళ్ల నుంచి 46 ఏళ్లకు పెంచాం. అయితే పంజాబ్‌లో యువత గంజాయి, డ్రగ్స్‌తో నిర్వీర్యమైంది. ఆ పరిస్థితి తెలంగాణలో రాకుండా టీఎస్ న్యాబ్ విభాగాన్ని ఏర్పాటు చేసి పటిష్టం చేస్తున్నాం. పోలీస్ శాఖలో కొత్తగా భర్తీ అవుతున్న వారు కూడా తెలంగాణను గంజాయి, మత్తుపదార్థాలు లేని రాష్ట్రంగా మార్చుతామని ప్రతిన బూనాలి. రాష్ట్రంలో డ్రగ్స్ వాడాలంటే వణుకు పుట్టే పరిస్థితి రావాలి..' అని సీఎం అన్నారు.

ముహూర్తం చూసుకుని.. సీట్లో కూర్చుని

వసంత పంచమి రోజున సీఎల్పీ నేత సీట్లోకి సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: మంచి ముహూర్తం చూసుకుని మరీ కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) స్థానంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆసీనులయ్యారు. బుధవారం ఆయన అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎల్పీ కార్యాలయానికి వచ్చారు. వసంతపంచమి రోజున సాయంత్రం 5 గంటల్లోపు మంచి ముహూర్తం ఉందన్న శాసనసభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు సూచన మేరకు సరిగ్గా ఆ సమయంలోపు రేవంత్ సీఎల్పీ నేత కోసం కేటాయించిన సీట్లో కూర్చున్నారు. ఆయన వెంట పలువురు ఎమ్మెల్యేలు, సీఎల్పీ కార్యదర్శి పూర్ణబోధ శ్రీకాంత్ తదితరులు న్నారు. కొద్దిసేపు సీఎల్పీ కార్యాలయంలో ఉన్న సమయంలో సీఎం రేవంత్‌ను రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన అనిల్‌కుమార్ యాదవ్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎల్పీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి

నేడు సభలో కాళేశ్వరంపై కాగ్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ నిర్వహించిన ఆడిట్ నివేదికను గురువారం రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. దీనితో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ద్రవ్య వినిమయ బిల్లుతో పాటు పలు ఇతర అంశాలపై కాగ్ నిర్వహించిన ఆడిట్ నివేదికలను సభలో ప్రవేశపెట్టనున్నారు. 2022 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, 2021 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో.. రాష్ట్రంలోని పట్టణ గ్రామీణ స్థానిక సంస్థల పని తీరు, రెవెన్యూ సెక్టార్, ప్రభుత్వ రంగ సంస్థల పని తీరు, సామాజిక, ఆర్థిక రంగాల స్థితిగతులు, ఆసరా పెన్షన్ల ద్వారా నగదు బదిలీ ప్రక్రియపై కాగ్ నిర్వహించిన ఆడిట్ నివేదికలను భట్టి విక్రమార్క సభ ముందు ఉంచనున్నారు. దీనికి తోడు 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరాలకి సంబంధించి రాష్ట్రంలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీల ఖాతాలపై నిర్వహించిన ఆడిట్ నివేదికలను సైతం ప్రవేశపెట్టనున్నారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తొలి తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల నివేదిక, దానిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై నివేదికను సభలో ప్రవేశపెడతారు. ఇదిలా ఉంటే సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం ప్రకటిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అసెంబ్లీ నిరవధిక వాయిదా ఎప్పుడు పడుతుందనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

ఓటాన్ అకౌంట్'పై నేడు భట్టి సమాధానం

శాసనసభలో రాష్ట్ర వార్షిక ఆర్థిక ప్రకటన (ఓటాన్ అకౌంట్ బడ్జెట్ 2024–25)పై బుధవారం జరిగిన చర్చకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం సమాధానం ఇస్తారు. శాసనసభ ఐదో రోజు సమావేశాల్లో భాగంగా బుధవారం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చ ముగిసింది. భట్టి వ్యక్తిగత కారణాలతో సభకు రాకపోవడంతో చర్చకు సమాధానాన్ని గురువారం ఇస్తారని స్పీకర్ ప్రకటించారు.

కోరం లేకపోవడంపై అభ్యంతరం.. కాంగ్రెస్ బీఆర్‌ఎస్ నడుమ చర్చ

బుధవారం ఉదయం అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే ఎజెండా చేపట్టేందుకు అవసరమైన కోరం (సభ్యుల కనీస సంఖ్య) సభలో లేదని బీఆర్‌ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సభలో 18 మంది సభ్యులు ఉన్నట్లు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. సభలో 14 మంది సభ్యులు మాత్రమే ఉన్నారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కనీస కోరం 12మంది సభ్యులు ఉంటే సరిపోతుందని శ్రీధర్‌బాబు సమాధానం ఇవ్వడంతో బడ్జెట్‌పై మాట్లాడే అవకాశాన్ని బీఆర్‌ఎస్ తరఫున కడియం శ్రీహరికి ఇచ్చారు. సభలో ఆర్థిక మంత్రి భట్టి లేకపోవడంతో బడ్జెట్‌పై చర్చకు ప్రభుత్వం సీరియస్‌గా లేదని అర్థమవుతోందని కడియం అన్నారు.

బీఆర్‌ఎస్ వాకౌట్

ఓటాన్ అకౌంట్‌పై జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ తరఫున కడియం శ్రీహరి మాట్లాడారు. ఈ క్రమంలో అధికార పక్షం సభ్యులతో చోటు చేసుకున్న వాగ్వాదం నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. కడియం శ్రీహరిని ఉద్దేశించి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యల పట్ల బీఆర్‌ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో కాంగ్రెస్ నుంచి టి.రామ్మోహన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, చిక్కుడు వంశీకృష్ణ, నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. బీజేపీ తరఫున ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, పాల్వాయి హరీష్, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్ ఒవైసీ ప్రసంగించారు. సీపీఐ తరఫున ఆ పార్టీ ఏకైక సభ్యుడు కూనంనేని సాంబశివరావు బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్నారు. అనంతరం సభను గురువారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

వైఎస్ తరహాలో పేదలకు పథకాలు అందాలి

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

- వైఎస్‌ఆర్ తరహాలో మానవీయ కోణం ఉండాలి: కుంభం అనిల్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవికతకు అద్దం పట్టేలా ఉందని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం 2022–23 వార్షిక బడ్జెట్‌ను రూ. 2.90 లక్షల కోట్లతో పెడితే, తరువాత సంవత్సరంలో బడ్జెట్‌ను పెంచడం సాధారణమని, అయితే రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, రాబడి, ఖర్చులను లెక్కలేసుకొని రూ. 2.70 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని అన్నారు. ఇది వాస్తవ పరిస్థితిని బేరీజు వేసుకొని రూపొందించిన బడ్జెట్ అని అన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు వంటి పథకాలను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శాచురేషన్ పద్ధతిలో అందరికీ అందించారని కొనియాడారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రధాన ప్రతిపక్షం సంవత్సరం వరకు విమర్శించే హక్కు లేదని కూనంనేని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా మేడిపల్లిలో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు వెళితే ప్రధాన ప్రతిపక్షంలోని సీనియర్ నాయకులు అన్‌పార్లమెంటరీ పదాలతో దూషించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

మూసీ ప్రక్షాళనకు నిధులు హర్షణీయం: అనిల్

మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా మూసీ ప్రక్షాళనకు బడ్జెట్‌లో రూ. 1,000 కోట్లు కేటాయించడం హర్షణీయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం పేరు మీద లక్ష కోట్లు ఖర్చు చేసిన గత ప్రభుత్వం, మూసీ ప్రక్షాళనకు రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. గోదావరిని ముంచి.. నల్లగొండకు వెళ్లి కృష్ణా నది గురించి కొందరు మాట్లాడుతున్నారని విమర్శించారు. మానవీయ కోణం ఉంటే వైఎస్‌ఆర్ తరహాలో ఆరు గ్యారంటీలను అమలు చేయవచ్చునని అన్నారు. కాగా, ఆదిలాబాద్‌లో 5వేల మందికి ఉపాధి కల్పించే సిమెంట్ ఫ్యాక్టరీ 20 ఏళ్ల క్రితం మూతపడిందని, దాన్ని తెరిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు.

'ఉస్మానియా'ను కాపాడాలి: వంశీకృష్ణ, హరీశ్‌బాబు

అసెంబ్లీలో 15 మంది డాక్టర్లు ఉంటే, వారిలో ఏడుగురు ఉస్మానియా మెడికల్ కాలేజీలో చదువుకున్నవారేనని ఎమ్మెల్యే వంశీకృష్ణ, సిర్పూరు ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఉస్మానియా ఆసుపత్రి శిథిలా వస్థకు చేరిందని, వారసత్వ సంపద పేరుతో ఆసుపత్రి, కాలేజీని అధ్వాన్న స్థితికి చేర్చారని వారు విమర్శించారు. ప్రభుత్వం స్పందించి ఉస్మానియా వైద్య కళాశాల, ఆసుపత్రిని బాగు చేయాలన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి మాట్లాడుతూ, మక్తల్ నియోజక వర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

ఇది డొల్ల బడ్జెట్

జనం నెత్తిన భస్మాసుర హస్తమే: కడియం శ్రీహరి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టింది డొల్ల బడ్జెట్ అని..ఆరు గ్యారంటీలను నమ్మి గెలిపించిన జనం నెత్తిన భస్మాసుర హస్తం పెట్టే ప్రయత్నం చేస్తున్నారా బీఆర్‌ఎస్ సభ్యుడు కడియం శ్రీహరి ప్రశ్నించారు. గ్యారంటీలు అమలు చేయాలంటే ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ.53,196 కోట్లు ఏ మూలకూ చాలవని, వాటికి రూ.1.36 లక్షల కోట్లు అవసరమవుతా యన్నది తమ ప్రాథమిక అంచనా అన్నారు. బుధ వారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామన్నారని, అందుకు రూ.23 వేల కోట్ల కంటే ఎక్కువ నిధులు అవసరమున్నా బడ్జెట్‌లో కేవలం రూ.7 వేల కోట్లే కేటాయించారని, ఈ నిధులు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ప్రతి మహిళకు రూ.2500 ఆర్థిక చేయూత పథకానికి కనీసం రూ.20 వేల కోట్లు కావాలని, కానీ బడ్జెట్‌లో ప్రొవిజనే లేదన్నారు.

పండిన పంటలు కనపడలేదా: కాళేశ్వరం వల్ల ఏమీ జరగలేదని చెప్పే కాంగ్రెస్ నేతలకు, కోదాడ వరకు గొప్పగా పంటలు పండుతున్న తీరు కనిపించలేదా అని, కాకతీయ కాలువ నిండుగా పారుతున్న తీరు మర్చిపోయారా అని ప్రశ్నించారు. దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని, కేసీఆర్ ప్రభుత్వం రాకముందు పూర్తయిన ప్రాజెక్టులు, అవి అందించిన సాగునీరు, సాగు విస్తీర్ణం సంగతేంటని, గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానన్న కేసీఆర్ దాన్ని గాలికొదిలేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. తన చిన్నప్పుడే కరీంనగర్ జిల్లా ఉభయ గోదావరి జిల్లాలతో సాగులో పోటీ పడిందన్నారు. ఈ సమయంలోనే మాజీ మంత్రి కేటీఆర్, మంత్రి పొన్నంను ఉద్దేశించి కూర్చోకూర్చోవయ్యా అనటంతో వివాదం మొదలైంది. మంత్రిని ఉద్దేశించి అలా అనటాన్ని కాంగ్రెస్ సభ్యులు తప్పు పట్టగా, స్పీకర్ జోక్యం చేసుకుని మంత్రిని అవమానపరిచేలా వ్యవహరించటం తగదని కేటీఆర్‌కు సూచించారు.

చంద్రబాబు తొత్తు రేవంత్: పల్లా

చంద్రబాబు చెప్పినట్టు సీఎం రేవంత్ నడుచుకుంటున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆంధ్ర తొత్తుగా వ్యవహరిస్తున్న రేవంత్ తెలంగాణ తల్లి విగ్రహం, రాజముద్ర రూపు రేఖలు మారుస్తామని ప్రకటనలు చేస్తున్నారన్నారు. కేవలం ఒకే సభ్యుడున్న సీపీఐకి అసెంబ్లీలో గంటల కొద్దీ సమయం ఇస్తూ, 39 మంది సభ్యులున్నా తమ గొంతు నొక్కుతున్నారన్నారు. మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఖండిస్తూ హుజూరాబాద్‌లో గెలుపు కోసం తన భార్య, కుమార్తె పనిచేశారన్నారు. 2018లో పొన్నం ఓడిపోవాలని మంత్రి భార్య, కుటుంబ సభ్యులు కోరుకున్నారని వ్యాఖ్యలు చేశారు.

కేసీఆర్‌ను తిట్టడానికి అసెంబ్లీ పెట్టారు

రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను తిట్టేందుకే అసెంబ్లీ నడిపిస్తున్నారని మాజీమంత్రి కడియం శ్రీహరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం పదవి చేపట్టిన తర్వాత కూడా రేవంత్ భాషలో మార్పు రాలేదని, కేసీఆర్‌ను అనుచిత, అసభ్య పదజాలంతో సందర్భం లేకుండా తిడుతున్నార న్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. బడ్జెట్‌పై చర్చను తప్పుదోవ పట్టిస్తూ మైక్ అడగని సభ్యులతో కూడా కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని మాట్లాడించడాన్ని ఖండించారు.

రూ.2.15 లక్షల కోట్లు కావాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఐదు డిక్లరేషన్లు, 300 హామీలు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. బీపీఎల్ కుటుంబాలకు మహాలక్ష్మి పథకం అమలు చేయాలంటే ఏడాదికి రూ.26,990 కోట్లు కావాలని, గ్యాస్ సిలిండర్‌కు రూ.2,699.70 కోట్లు, ఉచిత బస్సు పథకానికి రూ.3,600 కోట్లు, కౌలు రైతులకు రూ. 23,160.8 కోట్లు, మన్‌రేగా కింద 32 లక్షల వ్యవసాయ కూలీలు ఉంటారని, వీరికి ఏడాది రూ.3,840 కోట్లు, వరికి రూ. 500 చొప్పున బోనస్ ఇస్తే ఏడాదికి రూ.7,500కోట్లు, పంటరుణాలకు రూ.36 వేల కోట్లు కావాలని చెప్పారు. గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు ఏడాదికి రూ.4800 కోట్లు, అంబేడ్కర్ ఆర్థికచేయూత పథకానికి నిధులెన్నో చెప్పలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఆర్థిక చేయూతకు రూ.25 వేల కోట్లు, యువభరోసా, విద్యాభరోసా కార్డు అమలుకు రూ.38,894.22 కోట్లు, విద్యాజ్యోతి పథకానికి రూ.6,476 కోట్లు.. ఇంకా పింఛన్ల పెంపు ఇతర హామీలకు ఇలా కలిపి మొత్తం రూ.2,15,568.54 కోట్లు కావాలని, ఈ నిధులు ఎలా సమకూరుస్తారో చెప్పాలన్నారు. కొన్నేళ్లుగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ డబ్బులు పెండింగ్‌లో ఉంచారని, దీనివల్ల కాలేజీల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ధరణి స్థానంలో భూమాత తెచ్చేందుకు నియమించిన నిపుణుల కమిటీ ఎప్పటిలోగా నివేదిక ఇస్తుందో చెప్పాలన్నారు. బడ్జెట్‌లో మైనార్టీలకు కేటాయింపులు నిరాశ పరిచాయని, ముస్లిం మైనార్టీ సంస్థలకు మంజూరైన నిధులు దారి మళ్లడంపై విచారణ జరిపించాలని, రాష్ట్రానికే ఆదాయం తెచ్చి పెడుతున్న హైదరాబాద్ అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీకి ఇవ్వాల్సిన నిధులు సరిగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేసవి తీవ్రంగా ఉంటుందనే సంకేతాలు వస్తున్నాయని, గోదావరి, కృష్ణా జలాలు కూడా అడుగంటిపోయే ప్రమాదముందని, రంజాన్ మాసం సమీపిస్తున్నందున పాతబస్తీలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. ఈ సమస్యపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ అసెంబ్లీ సమావేశాల తర్వాత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: బాలూనాయక్

ప్రాజెక్టులు పూర్తి చేయకుండా సాగు,తాగునీటి ఇబ్బంది కలిగించినందుకు మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలూనాయక్ డిమాండ్ చేశారు. ఎన్నికల ముందే కేసీఆర్‌కు దళితులు గుర్తుకొస్తారని, అంబేడ్కర్‌కు కనీసం నివాళులు అర్పించని సీఎంగా కేసీఆరే మిగిలిపోతారన్నారు.

రాజ్యసభ అభ్యర్థులుగా రేణుక, అనిల్

▶ మొదటి పేజీ తరువాయి

మల్లికార్జున ఖర్గే వీరి పేర్లను ఖరారు చేసినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలకు టికెట్ల ఖరారులో ఉన్న అడ్డంకులను అధిగమించే దిశలో కాంగ్రెస్ ఈ ఎంపిక చేసినట్టు అర్థమవుతోంది. అందులో భాగంగానే ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి ఈసారి ఎట్టి పరిస్థితుల్లో బరిలోకి దిగుతారని భావించిన రేణుకాచౌదరికి, అలాగే సికింద్రాబాద్ స్థానాన్ని తమ కుటుంబంలో ఒకరికి ఇవ్వాలని కోరుతున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆయన కుమారుడు, యువ నాయకుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు అవకాశం కల్పించింది. తద్వారా ఈ రెండుచోట్లా ఇతరులకే అవకాశం దక్కవచ్చనే వాదనను నిజం చేసింది. దీనితో పాటు సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకుని కమ్మ, యాదవ సామాజిక వర్గాలను (ఒకటి ఓసీ, మరొకటి బీసీ) ఎంపిక చేసిందని చెబుతున్నారు. కాగా సీఎం రేవంత్‌రెడ్డి సిఫారసుతో ఈసారి రాజ్యసభ రేసులో చివరి నిమిషం వరకు ఉన్న వి.హనుమంతరావుకు ప్రస్తుతానికి భంగపాటు ఎదురయింది. అయితే రాజ్యసభ అవకాశం రాని నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి వీహెచ్ పోటీ ఖాయమనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

అనూహ్యంగా తెరపైకి అనిల్

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనిల్ యాదవ్‌కు అనూహ్యంగా రాజ్యసభ అవకాశం దక్కింది. అభ్యర్థుల రేసులో అనిల్ పేరు ఉండొచ్చనే అంచనాలు తెలంగాణ కాంగ్రెస్ నేతలకు కూడా లేకపోవడం గమనార్హం. యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో పాటు యువతకు ప్రాధాన్యమివ్వడంలో భాగంగా ఆయన పేరు తెరపైకి వచ్చింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో పాటు హైదరాబాద్‌కు చెందిన నేతకు అవకాశమివ్వడం ద్వారా సిటీకి ప్రాధాన్యం ఇస్తున్నామనే సంకేతాలను పంపడంలో భాగంగానే అనిల్‌ను ఎంపిక చేశారనే చర్చ జరుగుతోంది. అనిల్‌ను రాజ్యసభకు పంపడం ద్వారా అంజన్‌ను కూడా లోక్‌సభ రేసు నుంచి తప్పించి మరొకరికి టికెట్ ఇచ్చేలా సర్దుబాటు వ్యూహాన్ని కాంగ్రెస్ అమలు చేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తండ్రీకొడుకులిద్దరూ చెరో సభకు

అనిల్‌కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపాలన్న కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయంతో రెండు వేర్వేరు సభలకు వెళ్లిన తండ్రీ కొడుకులుగా అంజన్, అనిల్ యాదవ్‌లు రికార్డు సృష్టించారు. తండ్రీ కొడుకులిద్దరూ లోక్‌సభకు వెళ్లిన సందర్భాలు చాలానే ఉన్నా ఇద్దరూ చెరో సభకు ప్రాతినిధ్యం వహించడం మాత్రం అరుదుగానే జరిగింది. అంజన్‌కుమార్ 2004, 2009లో రెండుసార్లు సికింద్రాబాద్ పార్లమెంటు నుంచి గెలుపొందారు. కానీ ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తండ్రి కోసం ముషీరాబాద్ అసెంబ్లీ స్థానం త్యాగం చేయడంతో అనిల్‌కు అనూహ్యంగా ఏకంగా పార్లమెంటుకు వెళ్లే అవకాశం వచ్చింది.

రెండు సభలకు పలుమార్లు రేణుక

కాంగ్రెస్ పార్టీలో తనదైన గుర్తింపు కలిగిన రేణుకాచౌదరి పార్లమెంటులోని రెండు సభలకు పలుమార్లు ప్రాతినిధ్యం వహించారు. ఇప్పటికే మూడుసార్లు రాజ్యసభకు, రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2006–09 మధ్య కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఈమె మహిళా శిశు సంక్షేమ మంత్రిగా ఉన్న సమయంలోనే ఊయల అనే పథకం తీసుకువచ్చారు. తాజాగా ఆమెను రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో నాలుగోమారు రాజ్యసభ, ఆరోసారి పార్లమెంటు సభ్యురాలిగా పనిచేయనున్నారు.

నేడు నామినేషన్లు.... దిగ్విజయ్ రాక

రేణుకాచౌదరి, అనిల్ యాదవ్‌లు గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు దిగ్విజయ్‌సింగ్ బుధవారమే హైదరాబాద్‌కు చేరుకున్నారు. గురువారం ఉదయం అసెంబ్లీలో జరిగే నామినేషన్ల దాఖలు అనంతరం దిగ్విజయ్ గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడతారని, తర్వాత ఢిల్లీ వెళ్లనున్నట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఇలావుండగా కర్ణాటక నుంచి అజయ్ మాకెన్, డా.సయ్యద్ నసీర్ హుస్సేన్, జీసీ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ నుంచి అశోక్ సింగ్‌లకు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పించింది.

రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపిన అనిల్‌కుమార్

అనిల్‌కుమార్ సీఎల్పీ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు వస్తుందనేందుకు తన ఎంపికే నిదర్శనమన్నారు. యువతకు ప్రాధాన్యమిస్తుందనేందుకు కూడా ఇదే ఉదాహరణ అని చెప్పారు. మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఇలావుండగా రాజ్యసభ అభ్యర్థిగా అనిల్ యాదవ్‌ను ఎంపిక చేయడంపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధి లోకేశ్‌యాదవ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఏఐసీసీ కోటా పక్కకు!

తెలంగాణ నుంచి రాజ్యసభలో రెండు స్థానాలు లభించే అవకాశముండడంతో ఒకటి ఏఐసీసీ కోటాకు వెళుతుందని టీపీసీసీ నేతలు భావించారు. ఈ మేరకు ఏఐసీసీ నుంచి కూడా అధికారిక సమాచారం వచ్చింది. ఏఐసీసీ నేతలు సుప్రియా శ్రినాటె, అజయ్ మాకెన్, తిక్కవరపు సుబ్బిరామిరెడ్డి తదితర నేతల పేర్లు చర్చకు వచ్చాయి. ఒకదశలో సోనియాగాంధీ తెలంగాణ నుంచి రాజ్యసభకు వెళితే బాగుంటుందనే చర్చ కూడా ఏఐసీసీలో జరిగింది. అయితే దేశ వ్యాప్త సామాజిక సమీకరణలు, ఇతర కారణాల రీత్యా సోనియాను రాజస్తాన్ నుంచి బరిలోకి దింపడంతో తెలంగాణ నుంచి ఏఐసీసీ కోటా తప్పినట్టయింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి చెందిన రెండో నేతకు రాజ్యసభకు వెళ్లే అవకాశం దక్కింది.

రేణుకాచౌదరి బయోడేటా

పేరు	: గారపాటి రేణుకాచౌదరి
తల్లిదండ్రులు	: కేఎస్‌రావు, వసుంధరరావు
పుట్టిన తేదీ	: 13 ఆగస్టు 1954
స్వస్థలం	: విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్
విద్యార్హత	: కర్ణాటక వర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ
భర్త	: శ్రీధర్‌చౌదరి
కుమార్తెలు	: పూజిత చౌదరి, తేజస్విని చౌదరి
రాజకీయ రంగప్రవేశం	: 1984లో (టీడీపీ ద్వారా), 1998లో కాంగ్రెస్‌లోకి

అనిల్‌కుమార్ బయోడేటా

పేరు	: మందాడి అనిల్‌కుమార్ యాదవ్
తల్లిదండ్రులు	: అంజన్‌కుమార్ యాదవ్, నాగమణి
పుట్టిన తేదీ	: 9 సెప్టెంబర్ 1982
స్వస్థలం	: హైదరాబాద్
విద్యార్హత	: బీకాం, ఎల్ఎల్‌బీ
రాజకీయ రంగప్రవేశం	: 1999లో (ఎన్ఎస్‌యూఐ)

అన్ని వర్గాలనూ కాంగ్రెస్ మభ్యపెట్టింది

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలకు సరిపోయే నిధులు కేటాయించకుండా.. హామీలను అమలు చేస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు రాష్ట్ర బడ్జెట్ కాదుకదా కేంద్ర బడ్జెట్ కూడా సరిపోదన్నారు. బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ చర్చలోపై మహేశ్వర్‌రెడ్డి మాట్లాడు తూ... గత ప్రభుత్వం చేసిన కాళే శ్వరం తప్పులపై సీబీఐ విచారణ కోరడానికి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేంటని ప్రశ్నించారు. సీబీఐ విచా రణ కోరుతూ కేంద్రానికి లేఖ రాస్తే 48 గంటల్లోనే అది జరిగేలా తాము చొరవ తీసుకుంటామని చెప్పారు. దమ్ముంటే కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వ రంపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు యూటర్న్ తీసు కుందో చెప్పాలని నిలదీశారు. సీఎం రేవంత్ యూటర్న్ సీఎంగా పేరు తెచ్చుకుంటున్నారని, అలా కాకుండా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు మేడిగడ్డ పిక్నిక్‌కు వెళ్లి లంచ్, డిన్నర్ చేసి వచ్చారని ఎద్దేవా చేశారు. అంకెల గారడీతో ప్రజలను దగా చేస్తున్నారని, అంబేడ్కర్ ఆర్థిక చేయూత పథకం కింద (దళిత బంధు) ఒక్కొక్కరికి రూ.12 లక్షల చొప్పున ఆర్థికసహాయం అందిస్తామని చెప్పారని, ఐదేళ్లలో రూ.2 లక్షల కోట్లు ఎక్కడి నుంచి సమకూరుస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. 6 గ్యారంటీల అమలుకు రూ.1.51 లక్షల కోట్లు అవసరం కాగా, బడ్జెట్‌లో రూ.50 వేలే కేటాయిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఈ గ్యారంటీల అమలు పేరిట ఆ పార్టీ ఇచ్చిన 412 హామీలను గాలికి వదిలేశారని మండిపడ్డారు.

క్లుప్తంగా...

త్వరలో కాంగ్రెస్‌లో చేరతాం: తీగల కృష్ణారెడ్డి

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి సైతం..

మహేశ్వరం: త్వరలో తాను, తన కోడలు జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి కాంగ్రెస్‌లో చేరుతామని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ప్రకటించారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తీగల మాట్లాడుతూ.. జిల్లా, నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు కాంగ్రెస్ పార్టీతో కలిసి నడవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

197 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు

నూతన కార్యవర్గం

వ్యవసాయ మంత్రి తుమ్మల వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 197 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన కార్యవర్గం ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 123 మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరాదరణకు గురైన వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పూర్వవైభవం తెచ్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. కొత్తగా ఏర్పాటయ్యే ప్రతి మార్కెట్ కమిటీ కార్యవర్గంలో 18 మంది సభ్యులుంటారని, 12 మంది నామినేటెడ్ సభ్యులు, ఇద్దరు అధీకృత వ్యాపారస్తులు (లైసెన్స్‌డ్ ట్రేడర్స్), మిగిలిన నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులుంటారని పేర్కొన్నారు. పాలకవర్గ పదవీకాలం రెండేళ్లు కాగా మరో రెండు సార్లు ఆరు నెలలు పొడిగించే అవకాశం ఉంటుందన్నారు. మార్కెట్ కమిటీలకు నామినేటెడ్ అయ్యే చైర్మన్లలో అన్ని వర్గాల వారికి సముచిత ప్రాధాన్యం కల్పించనున్నట్లు తుమ్మల చెప్పారు.

మేడిగడ్డ టూరిజం.. కాంగ్రెస్ కొత్త నాటకం

- బీజేపీ నేత మురళీధర్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ టూరిజం పేరుతో ప్రజల దృష్టి మరల్చడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నాటకానికి తెరతీసిందని బీజేపీ నేత మురళీధర్ రావు విమర్శించారు. తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్- కాంగ్రెస్ పార్టీలు రెండూ రాజకీయ డ్రామాలను సమాంతరంగా నడిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలవి పార్ట్‌నర్‌షిప్ రాజకీయాలని విమర్శించారు. బీఆర్ఎస్-కాంగ్రెస్ నేతలు తెర ముందు కొట్లాడుతున్నారు.. తెరవెనుక చుట్ట తాగుతున్నారని మురళీధర్ రావు వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణ ఎందుకు జరపడంలేదని నిలదీశారు. కాళేశ్వరం అవినీతి దొంగలను జైలుకు పంపుతాం.. లేకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటామన్న సీఎం రేవంత్ ఇప్పుడెందుకు మాట తప్పారని, ఈ విషయంలో మౌనంగా ఎందుకు ఉంటున్నారని సూటిగా ప్రశ్నించారు.

బీసీలను బీజేపీ అవమానించింది: జాజుల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలను బీజేపీ తీవ్రంగా అవమానించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీ ముఖ్యమంత్రి అంటూ ప్రగల్భాలు పలికిన బీజేపీ.. ఇప్పుడు కనీసం ఆ పార్టీ శాసనసభ పక్షనేతగా బీసీకి అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. ఎన్నికలప్పుడు బీసీ ఓట్లు రాబట్టేందుకే బీసీ ముఖ్యమంత్రి అంటూ ప్రచారం చేశారని, ఎన్నికలయ్యాక బీసీలకు ఎలాంటి అవకాశాలు ఇవ్వదన్న విషయాన్ని బీజేపీ రుజువు చేసిందని తెలిపారు.

జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ ఎన్నికల

నోటిఫికేషన్ విడుదల

సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ (జేఎన్‌జే) మ్యాక్ హౌసింగ్ సొసైటీకి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం ఎన్నికల అధికారి చోళా ఓంప్రకాశ్ విడుదల చేశారు. మార్చి 3వ తేదీన సొసైటీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్‌లో ప్రకటించారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. ఈ నెల 24న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిజాంపేటలోని సొసైటీ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారు. 25న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల తర్వాత పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. సొసైటీ అడ్‌హాక్ బోర్డు 981 మంది సభ్యులతో కూడిన ఓటర్ల జాబితాను తనకు అందించిందని బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓంప్రకాశ్ తెలిపారు. మొత్తం ఐదు డైరెక్టర్ల పదవులకు ఎన్నికలు జరుగుతాయని, మార్చి 3న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో పోలింగ్ జరుగుతుందని, ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని వివరించారు. అదే రోజు సాయంత్రం 4.30 తర్వాత ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తామని, అనంతరం కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని వెల్లడించారు. సభ్యులకు ఏవైనా సందేహాలు ఉంటే 9347032693 ఫోన్ నంబర్‌లో సంప్రదించి తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఇది కంచెల రాజ్యం

సభలో మాట్లాడనివ్వరు... బయట కూడా అంతేనా?

- మీకు చెప్పినా ఒక్కటే.. గోడకు చెప్పినా ఒక్కటే
- మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాషను ఖండిస్తున్నాం
- అసెంబ్లీ బయట నేలపై కూర్చుని నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



మీడియా పాయింట్‌కు వెళ్లే దారిలో నిరసన వ్యక్తం చేస్తున్న కేటీఆర్, సబితారెడ్డి, హరీశ్ రావు, కాలె యాదయ్య, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, కడియం శ్రీహరి, చింతా ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: సభలో మాట్లాడన్వివరు.. అసెంబ్లీ బయట కూడా మాట్లాడన్వివరా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం అసెంబ్లీలో వాకౌట్ చేసిన అనంతరం మీడియా పాయింట్‌లో మాట్లాడేందుకు వెళ్లే క్రమంలో అక్కడ ఉన్న అసెంబ్లీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రికత్త నెలకొంది. ఆ ప్రాంతం భారీ ఎత్తున పోలీసులు, మార్షల్‌తో నిండిపోయింది. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మీడియా పాయింట్‌లో మాట్లాడొద్దని ఏమైనా నిబంధనలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇదేనా ప్రజా పాలన అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షాల గొంతు అణచివేసేందుకు అధికార పక్షం చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం.. కంచెల రాజ్యం.. పోలీసు రాజ్యం అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినదించారు. మీడియా పాయింట్‌కు వెళ్లే దారి మధ్యలో నేలపై కూర్చొని నినాదాలు చేశారు. చివరిగా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మీకు చెప్పినా ఒక్కటే.. గోడకు చెప్పినా అక్కటే అంటూ'' అక్కడి నుంచి తెలంగాణ భవన్‌కు వెళ్లిపోయారు.

రేవంత్ చెప్పేదొకటి.. చేసేదొకటి: కడియం, పల్లా, వేముల

అంతకుముందు అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత భాషను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలని మేము కోరుదామంటే మాకు మాట్లాడే అవకాశం స్పీకర్ ఇవ్వడం లేదని ఆరోపించారు. కంచెలు తొలగిస్తామని చెప్పి ఇప్పుడు కంచెలెందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి బయట ఒకటి చెబుతున్నారని, అసెంబ్లీలో ఒకటి చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఆవరణ సభ్యుల హక్కు అనీ, అలాంటి ప్రాంతంలో నియంత్రణ ఎలా పెడతారని నిలదీశారు.

రాజగోపాల్‌రెడ్డి మాటలను రికార్డుల నుంచి తొలగించాలి

కడియం శ్రీహరిపై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడిన అనుచిత భాషను వెంటనే రికార్డుల నుంచి తొలగించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ ఇష్టమొచ్చిన భాష మాట్లాడుతూ దాన్ని తెలంగాణ భాష గా చెప్పుకుంటున్నాడని, తెలంగాణ భాషను సీఎం అవమానపరుస్తున్నారని విమర్శించారు. రెండు నెలల్లో కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్య స్ఫూర్తి లోపించిందని, అసెంబ్లీలో కంచెల పాలన తెచ్చారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశం నడుస్తుండగా మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు మాట్లాడ వద్దనే నిబంధన ఏదీ లేదని, ప్రభుత్వం కావాలనే మా గొంతు నొక్కుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీకు చేతకాకపోతే తప్పుకో... నేను చేసి చూపిస్తా

▶ మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బురద రాజకీయాలకు పాల్పడుతోంది. ప్రభుత్వం ఎంత తక్కువ చేసి మాట్లాడినా కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయని, ప్రజలకు జీవధార. ఈ ప్రాజెక్టు విషయంలో మేము ఎలాంటి తప్పు చేయలేదు. ఈ విషయంలో ఏ తరహా విచారణకైనా మేము సిద్ధంగా ఉన్నాం. విచారణ జరిపి బాధ్యులను శిక్షించండి..'అని హరీశ్‌రావు అన్నారు.

రైతులకు అన్యాయం జరగకుండా చూడాలి

'ప్రాజెక్టులో సాంకేతిక సమస్యలను పరిష్కరించి, యుద్ధ ప్రాతిపదిక మరమ్మతు పనులు పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలి. రెండు పిల్లర్లు కుంగాయనే నెపంతో మొత్తం ప్రాజెక్టు ప్రతిష్టను డ్యామేజ్ చేసే దుష్టపన్నాగానికి కాంగ్రెస్ పాల్పడుతోంది. కుంగిన పిల్లర్లకు మరమ్మతులు చేసి పొలాలకు నీళ్లు మళ్లించండి కానీ తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొట్టొద్దు. కాళేశ్వరం ద్వారా 20 లక్షల ఎకరాలకు ప్రయోజనం కలిగింది. ప్రాజెక్టు ఫలాల గురించి చెప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోంది. గతంలో కడెంవాగు ప్రాజెక్టు, సింగూరు డ్యాం, ఎల్లంపల్లి, సాత్నాల ప్రాజెక్టులు కొట్టుకుపోయినా పునరుద్ధరింథాం. పోలవరం డయాఫ్రం వాల్, రాయలసీమలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయాయి. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కారకులను శిక్షించి, ప్రాజెక్టులను పునరుద్ధరించి రైతులకు అన్యాయం జరగకుండా చూస్తారు..'అని హరీశ్ వ్యాఖ్యానించారు.

రీ ఇంజనీరింగ్ వల్లే అంచనాల పెంపు

'రీ ఇంజనీరింగ్ వలన ప్రాజెక్టు అంచనా వ్యయం అనివార్యంగా పెరుగుతుంది. ప్రాణహిత-చేవెళ్ల అంచనా విలువ రూ.17 వేల కోట్లతో మొదలై రూ.38 వేల కోట్లకు పెరిగింది. ఆ తర్వాత కేంద్ర జల సంఘానికి నివేదించే నాటికి రూ.40 వేల కోట్లకు పెరిగింది. తట్ట మట్టి ఎత్తకుండానే ప్రాజెక్టు అంచనా విలువ రూ.17 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లకు ఎందుకు పెరిగినట్టు?. కాళేశ్వరం ప్రాజెక్టులో జలాశయాల సామర్థ్యం పెంచాం. కొత్త జలాశయాలు ప్రతిపాదించాం. జలాశయాల సామర్థ్యం పెరగడంతోనే అంచనాలు పెరిగాయి..' అని హరీశ్‌రావు వివరించారు.

కాలువలు తవ్వి నీళ్లివ్వకపోతే కష్టాలే

'రాజకీయ లబ్ధి కోసమే రేవంత్ డైవర్షన్ టూర్ పెట్టుకుని, ఇంజనీర్లు వాస్తవాలు చెబుతున్నా దబాయిస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో హెడ్ వర్క్స్ పూర్తయిన తర్వాతే ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణంపై నిధులు వెచ్చిస్తాం. కాంగ్రెస్ హయాంలో కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల ద్వారా 27 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇస్తే, మేము అన్ని పనులు పూర్తి చేసి 6.36 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. ప్రస్తుత ప్రభుత్వం కాళేశ్వరం కాలువలు తవ్వి నీరు ఇవ్వకుంటే సాగు, తాగునీటి కష్టాలు వస్తాయి..'అని మాజీ మంత్రి హెచ్చరించారు.

రాజ్యసభకు మళ్లీ వద్దిరాజు

▶ మొదటి పేజీ తరువాయి



వద్దిరాజును అభినందిస్తున్న రాష్ట్ర మున్నూరు కాపు సంఘం నేతలు

రాష్ట్రం నుంచి మూడు స్థానాలకు జరిగే ఎన్నికకు సంబంధించి గురువారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు ఇతర సీనియర్ నేతలతో చర్చించి వద్దిరాజు అభ్యర్థిత్వంపై కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం వద్దిరాజుకు కేసీఆర్ బీ-ఫాం అందజేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా అసెంబ్లీలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వద్దిరాజు గురువారం నామినేషన్ దాఖలు చేస్తారు. కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి హాజరవుతారు.

కాంగ్రెస్‌కు రెండు.. బీఆర్ఎస్‌కు ఒకటి

రాష్ట్రం నుంచి రాజ్యసభలో ఏడుగురు సభ్యులు ప్రాతినిథ్యం వహిస్తుండగా అందరూ బీఆర్ఎస్‌కు చెందిన వారే కావడం గమనార్హం. వీరిలో వద్దిరాజు రవిచంద్ర, జె.సంతోష్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్ ఈ ఏడాది ఏప్రిల్ 2న తమ ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకుంటున్నారు. ఖాళీ అవుతున్న మూడు స్థానాల్లో అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్య ఆధారంగా కాంగ్రెస్‌కు రెండు, బీఆర్ఎస్‌కు ఒక స్థానం చొప్పున లభించనుంది. కాంగ్రెస్ అభ్యర్థులుగా రేణుకా చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్ పేర్లు ఇప్పటికే ఖరారు కాగా, బీఆర్ఎస్ తరపున వద్దిరాజు పేరు ఖరారు కావడంతో ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశముంది. రాజ్యసభ సభ్యత్వానికి వద్దిరాజును మరోసారి ఎంపిక చేయడంపై మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హర్షం వ్యక్తం చేశారు.

వరుసగా రెండోసారి..

వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన వద్దిరాజు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2022 మేలో బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ బండా ప్రకాశ్ రాజీనామా చేయడంతో అదే నెల 23న వద్దిరాజును బీఆర్ఎస్ రాజ్యసభకు నామినేట్ చేసింది. ప్రస్తుతం జరుగుతున్న రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలో వద్దిరాజుకు రెండోమారు బీఆర్ఎస్ నుంచి అవకాశం దక్కింది.

కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తా..: వద్దిరాజు

కేసీఆర్ మరోమారు నాకు రాజ్యసభ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఖమ్మం జిల్లాలో పార్టీ బలోపేతానికి నావంతు కృషి చేస్తాను. పార్టీని తిరిగి అధికారంలో తెచ్చేందుకు కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తాను. రాబోయే రోజుల్లో నల్లగొండ సభ తరహాలో మరిన్ని కార్యక్రమాలు ఉంటాయి. గురువారం రాజ్యసభ అభ్యర్థిగా టీఆర్ఎస్ తరపున నామినేషన్ దాఖలు చేస్తాను.

వద్దిరాజు రవిచంద్ర బయోడేటా

పేరు	: వద్దిరాజు రవిచంద్ర
తల్లిదండ్రులు	: నారాయణ, వెంకట నర్సమ్మ
పుట్టిన తేదీ	: 22-03-1964
స్వస్థలం	: మహబూబాబాద్ జిల్లా
విద్యార్హత	: బీకాం
వృత్తి	: గ్రానైట్ వ్యాపారం
రాజకీయం నేపథ్యం	: 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఓటమి, అనంతరం బీఆర్ఎస్‌లో చేరి రాజ్యసభకు ఎన్నిక

నన్ను గెలికితే అంతు చూస్తా

మీ బాగోతాలన్నీ బయటపెడతా: బండి

- రూ.500 కోట్ల భూదాన్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌ల చిట్టా నావద్ద ఉంది
- నర్సింగాపూర్‌లో 20 ఎకరాల సింగిల్ బిట్‌ను ఎవరి పేరిట కొన్నారో తెలుసు
- కరీంనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నేతను ఉద్దేశించి సంజయ్ తీవ్ర ఆరోపణలు
- కేసీఆర్ ఆస్తులు జప్తు చేసే దమ్ము కాంగ్రెస్‌కు ఉందా అని నిలదీత

గంభీరావుపేట/ముస్తాబాద్(సిరిసిల్ల): 'గచ్చిబౌలిలో రూ.500 కోట్ల విలువ చేసే ఆరు ఎకరాల భూదాన్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ బాగోతం చిట్టా నా దగ్గర ఉంది. బోయినపల్లి మండలం నర్సింగాపూర్‌లో 20 ఎకరాల సింగిల్‌బిట్‌ను ఎవరి పేరిట కొన్నారో తెలుసు.. బంజారాహిల్స్ లోటస్‌పాండ్ సమీపంలోని భవంతిలో అధికారులను పిలిపించుకొని సాగిస్తున్న దందాలన్నీ తెలుసు.. నన్ను గెలకొద్దు.. గెలికితే అంతుచూస్తా.. నాపై అవాకులు చెవాకులు పేలితే మొత్తం మీ బాగోతాలన్నీ బయటపెడతా..' అంటూ కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ బీఆర్ఎస్ కీలక నేతనుద్దేశించి తీవ్ర ఆరోపణలు చేశారు. బండి చేపట్టిన ప్రజాహిత యాత్ర ఐదో రోజు బుధవారం రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సబ్‌కాంట్రాక్ట్ సంస్థ నిర్వాకంతోనే కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కూలిపోయే ప్రమాదముందని విజిలెన్స్ నివేదిక ఇచ్చిందని, ఆ సంస్థ ఎవరిదో.. అనే వివరాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే బహిరంగపరచాలని డిమాండ్ చేశారు.



గంభీరావుపేటలో మాట్లాడుతున్న బండి సంజయ్. చిత్రంలో రాణిరుద్రమ

కట్టె కాలేవరకు కేసీఆర్ దోచుకుంటడు..

కట్టెకాలే వరకు ప్రజల కోసం పనిచేస్తానన్న కేసీఆర్.. కట్టె కాలే వరకు ప్రజలను దోచుకుంటాడని బండి సంజయ్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన కేసీఆర్‌ను అరెస్టు చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్..

- సమాధానమివ్వలేకే పారిపోయారన్న కాంగ్రెస్
- బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదం

సాక్షి, హైదరాబాద్: బుధవారం అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. బడ్జెట్, వివిధ అంశాలపై చర్చ సందర్భంగా కాంగ్రెస్-బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య విమర్శలు, వాదోపవాదాలు సాగాయి. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న సందర్భంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లారు. వారిని సీట్లలోకి వెళ్లాలంటూ సభాపతి కోరారు. అయినప్పటికీ వారు వెళ్లకపోవడంతో అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బీఆర్ఎస్‌పై, గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో కాంగ్రెస్ సభ్యులు విమర్శలు కొనసాగిస్తున్న దశలో హరీశ్‌రావు, కేటీఆర్, కడియం శ్రీహరి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, డా.సంజయ్, తదితరులు సభ నుంచి వెళ్లిపోయారు. కాంగ్రెస్ సభ్యులు చేస్తున్న విమర్శలకు సమాధానమిచ్చే అవకాశం, మైక్ ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. అయితే తమ విమర్శలకు సమాధానమిచ్చే దమ్ములేక విపక్ష సభ్యులు సభ నుంచి పారిపోయారని రాజ్‌గోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో చీలికతెచ్చి మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని, కడుపులో విషం పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్‌కు చర్చపై చిత్తశుద్ధిలేదని, పెళ్లిళ్లు, ఫంక్షన్లు ఉన్నాయనే బయటికి వెళ్లారని ఆదిశ్రీనివాస్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌పై, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్ఎస్ సభ్యులు దొరహం కారంతో మాట్లాడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. దళిత స్పీకర్‌ను ఓయ్ అని, బీసీ మంత్రిని కూర్చోవాలంటూ బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడటం సరికాదని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే అన్నట్టుగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

- రూ.60 వేల కోట్ల అప్పును రూ.7 లక్షల కోట్లకు పెంచారు
- మండలిలో బడ్జెట్‌పై చర్చలో మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్య
- ప్రగతిభవన్‌లో పరాయి నేతలకే గౌరవం దక్కింది: మంత్రి సీతక్క
- రాష్ట్ర ఖజానా కాంగ్రెస్ ఏటీఎంగా మారింది: కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా అప్పులపాలు చేసిందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పుడు రాష్ట్ర అప్పులు రూ.60వేల కోట్లు ఉంటే, పదేళ్లలో దాన్ని రూ.7 లక్షల కోట్లకు పెంచారన్నారు. అప్పులు చేసి విచ్చలవిడిగా ఖర్చు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. వాటిని సవరించి అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పటికీ కేసీఆర్ అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం మండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో జూపల్లి పైవిధంగా స్పందించారు. ప్రజల సమ్మతితో నిర్ణయాలు తీసుకోకుండా కేసీఆర్ ఏకపక్షంగా వ్యవహరించి రాష్ట్రాన్ని ఆగమాగం చేశారన్నారు. బీఆర్ఎస్ సభ్యుడు మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ పాత్ర కీలకమని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ లేరంటూ చిత్రీకరించడం సరికాదన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రగతిభవన్‌లో తెలంగాణ ప్రజానీకానికి ప్రవేశం లేకున్నప్పటికీ పొరుగురాష్ట్రాల వారికి మాత్రం రెడ్‌కార్పెట్ వేశారని, సకల మర్యాదలతో వారికి స్వాగతం పలికిన గత చరిత్ర ఉందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు.

గ్యారంటీలపై ప్రభుత్వానికి స్పష్టత లేదు: కవిత



బడ్జెట్ అంతా కాలయాపన చేసేలా ఉందని, ఆరు గ్యారంటీలకు బడ్జెట్ సరిపోదని, పలు గ్యారంటీలపై ప్రభుత్వానికి స్పష్టత లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. దీంతో ప్రజల్లోనూ అయోమయం నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఎన్నో డిక్లరేషన్లు చేసిందని, వాటిని బడ్జెట్లో ఎక్కడా పొందుపర్చలేదన్నారు. తెలంగాణ ఖజానా దేశంలోని కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా మారిందని ఆరోపించారు. అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మండలి సభ్యులపై చేసిన వ్యాఖ్యలను విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. దీనిపై సభలో ధర్నా చేసినా ప్రభుత్వం నుంచి సమాధానం రాకపోవడం బాధాకరమన్నారు. సభ్యుడు ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుబంధుపై షరతులు విధించాలని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి సూచించామని, కానీ అప్పట్లో ఏకపక్షంగా పంపిణీ చేశారన్నారు. రాష్ట్రంలో జోనల్ విధానాన్ని పునఃసమీక్షించాలని, ఉమ్మడి పది జిల్లాకో జోన్ చొప్పున ఏర్పాటు చేస్తే అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉంటుందని జీవన్‌రెడ్డి సూచించారు. అదేవిధంగా జీఓ 317ద్వారా నష్టపోయిన అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ మంగళవారం నల్లగొండలో జరిగిన బీఆర్ఎస్ సభలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేశారని, ఈ ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సచ్చిన పామును మళ్లీ చంపుతారా?

అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం దోపిడీ బయటపడుతుందని, జైలుకు వెళ్లాల్సి వస్తుందనే కేసీఆర్‌ను చంపుతారా అంటూ మాట్లాడుతున్నారని, ఆయనను చంపాల్సిన అవసరం ఎవరికి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'ఇప్పటికే సచ్చిన పామును మళ్లీ ఎవరైనా చంపుతారా? మొన్నటి ఎన్నికల్లో ప్రజలు ఆ పామును చేతితో కాదు కట్టెతో కొట్టారు. ఆల్రెడీ చచ్చిన పామును మళ్లీ చంపాల్సిన అవసరం మాకేం ఉంది?' అని వ్యాఖ్యానించారు. సానుభూతి కోసం కేసీఆర్ వీల్‌చైర్, వీధినాటకాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరంపై సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ సభకు వచ్చేలా ఆ పార్టీ ఎమ్మెల్యేలు చూడాలన్నారు. బుధవారం అసెంబ్లీలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు..బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య బడ్జెట్‌పై వాదోపవాదాలు జరుగుతుండగా సీఎం జోక్యం చేసుకుని మాట్లాడారు.

కేసీఆర్‌ను సభకు రమ్మనండి

'సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో శ్వేతపత్రం ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేసీఆర్ పారిపోయి ఫామ్‌హౌస్‌లో పడుకుని, అక్కడెక్కడికో పోయి ప్రగల్భాలు ఎందుకు? సభకు రమ్మనండి..వాస్తవాలపై చర్చిద్దాం..అన్ని అంశాలపై మాట్లాడదాం. అలా కాదు కాళేశ్వరంపైనే చర్చిద్దామంటే అందుకు కూడా స్పీకర్ విడిగా సమయం కేటాయిస్తే చర్చకు సిద్ధం. మేడిగడ్డ మేడిపండు మాదిరిగా కుంగిపోతే, అక్కడ నీళ్లు నింపే అవకాశముందా? కేసీఆర్, హరీశ్‌రావు సాగునీటి శాఖ మంత్రులుగా పనిచేశారు కదా.. వారికే బాధ్యతలు అప్పగిస్తాం ..వారే ఎలా మేడిగడ్డలో నీళ్లు నింపి అక్కడి నుంచి అన్నారం, సుందిళ్లలో పోస్తారో బాధ్యత తీసుకోవాలి..' అని రేవంత్ అన్నారు.

నేటి సాయంత్రం దాకా చర్చకు సిద్ధం

'బీఆర్ఎస్ఎల్పీ నేత అసెంబ్లీకి వస్తే..గురువారం సాయంత్రం దాకా కాళేశ్వరం ప్రాజెక్టుపై, గోదావరి నదీజలాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైతులపై, తెలంగాణ ప్రజలపై గౌరవంతో ప్రధాన ప్రతిపక్షం ప్రభుత్వ ఆహ్వానాన్ని మన్నిస్తే.. అందరం కలిసి వెళ్లి ప్రాజెక్టులను పరిశీలించి వద్దామని అనుకున్నాం. అలా వెళితే అక్కడ జరిగిన నష్టాన్ని, రైతులకు వచ్చిన కష్టాన్ని అర్థం చేసుకుని ఆ సమస్యకు పరిష్కారం చూపే అవకాశం ఉంది. కానీ ఈ పర్యటనకు బీఆర్ఎస్ రాకపోగా, మేడిగడ్డ విషయంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వమే ఏదో తప్పు చేసినట్టు, వైఫల్యాలకు తామే బాధ్యత వహించాలి అన్నట్టుగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారు. పదే పదే భాష గురించి మాట్లాడుతున్నారు. మంగళవారం నల్లగొండలో కేసీఆర్ మాట్లాడిన భాషపై సభలో చర్చిద్దామా? సీఎం పదవిలో ఉన్న వ్యక్తిని పట్టుకుని ఏమి పీకడానికి మేడిగడ్డ వెళ్లారంటూ మాట్లాడతారా? కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన, ఎమ్మెల్యేగా, ఎంపీగా, పదేళ్లు సీఎంగా ఉన్న వ్యక్తి నాలుగు కోట్ల మంది ప్రజలు ఎన్నుకున్న ఓ సీఎంపై అలాంటి భాషను ఉపయోగిస్తారా? ఉద్యమకారు డిని అని గొప్పలు చెప్పుకునే వ్యక్తి, ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాలో ఉండి, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకుని ఏమి పీకడానికి వెళ్లారని నిలదీస్తారా? ఇదేనా తెలంగాణ సంప్రదాయం? గౌరవం? అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే కేసీఆర్ ప్యాంట్‌ను తెలంగాణ ప్రజలు ఊడ బెరికారు. మళ్లీ వస్తానంటే ఉన్న అంగీ కూడా ఊడబెరుకుతారు. బొక్క బోర్లాపడి బొక్కలు విరిగినా ఇంకా బుద్ధి మారలేదు..' అంటూ సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

అందరినీ ఒకేవిధంగా చూడండి: కేటీఆర్

రెండురోజుల క్రితం రాజ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతున్నపుడు కడియం శ్రీహరి ఏవో వ్యాఖ్యలు చేశారని, వాటిపై రాజ్‌గోపాల్‌రెడ్డి బుధవారం స్పందించి ఉంటారని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు చెప్పారు. దీంతో కడియం శ్రీహరిపై రాజ్‌గోపాల్‌రెడ్డి ఏదైనా అన్‌పార్లమెంటరీ భాష ఉపయోగించి ఉంటే వాటిని పరిశీలించి రికార్డుల నుంచి తొలగిస్తామని స్పీకర్ తెలిపారు. అయితే తనపైనే కడియం అనుచిత వ్యాఖ్యలు చేశారని రాజ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌పై తమకు అపార గౌరముందని, తాము ఏదైనా తప్పు మాట్లాడితే దానిని సవరించే అధికారం వారికుందని కేటీఆర్ చెప్పారు. అయితే అధికారపక్ష సభ్యులు తమను వ్యక్తిగతంగా దూషించినా, నోటికొచ్చినట్టు మాట్లాడినా సభాపతి ఏమీ అనడం లేదని అన్నారు. సభ్యులందర్నీ ఒకేవిధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నం సత్యదూరమైన మాటలు చెబుతుంటే బాధతో 'కూర్చో' అన్నామే తప్ప ఆయన్ను అవమానించాలని కాదన్నారు. 'కాళేశ్వరంలోని మూడు బ్యారేజీలకు గాను ఒక్క బ్యారేజీలో ఇబ్బంది జరిగితే దాన్ని రిపేర్ చేయండి. రైతులపై మాత్రం కోపం పెంచుకోకండి. కేసీఆర్‌పై కోపం ఉంటే ఆ ప్రాంత రైతాంగంపై కక్ష కట్టొద్దు. మేడిగడ్డ నింపండి. కాళేశ్వరంలో పంపింగ్ మొదలుపెట్టండి..' అని కేటీఆర్ సూచించారు.



స్నేహం విషయంలో నెమ్మదిగా వ్యవహరించాలి; కానీ ఒక్కసారి స్నేహం అంటూ చేశాక స్థిరంగా, దృఢంగా కొనసాగించాలి.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 15 ఫిబ్రవరి 2024

వలసపోయిన మందహాసం

పురిటిలోనే సంధి కొట్టింది. కేంద్రంలోని అధికార ఎన్డీఏకి వ్యతిరేకంగా జట్టుకట్టిన ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి పరిస్థితి ఒక్క మాటలో అదే. ఏడాదైనా కాక ముందే... ఎన్నికలు మరో రెండు నెలల దూరమైనా లేక ముందే... ఆ కూటమి అంతర్గత కుమ్ములాటలతో చతికిలపడిన పరిస్థితి. బిహార్ నుంచి మహారాష్ట్ర దాకా కూటమి నుంచి వలసపోతున్న నేతలు, సీట్ల పంపిణీ సమస్యలతో ఏకపక్ష నిర్ణయం తీసుకుంటున్న పార్టీలను చూస్తుంటే ఆ మాట అక్షరసత్యమని అర్థమవుతోంది. కొద్ది వారాల క్రితం బిహార్ సీఎం నితీశ్ కుమార్ 'ఇండియా' కూటమికి గుడ్‌బై చెప్పి, ఎన్డీఏ గూటికి తిరిగొచ్చారు. కొత్త కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి, సోమవారం అసెంబ్లీలో విశ్వాసపరీక్షలో కూడా నెగ్గారు. బిహార్‌లోనే కాదు... మహారాష్ట్రలోనూ 'ఇండియా' కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మాజీ ఎంపీ మిళింద్ దేవరా గత నెలలో గ్రాండ్ ఓల్డ్ పార్టీని వదిలేసి, శివసేనలో చేరారు. అది జరిగిన కొద్ది వారాలకే కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ చవాన్ హస్తాన్ని విడిచిపెట్టి, కమలం చేత ధరించారు. ఇలా సొంత కూటమిలోనే సవాలక్ష తలనొప్పులతో ఎన్నికలు రాకముందే బలహీనమైపోయింది. ఎన్డీఏకు సరైన ప్రత్యామ్నాయం తామేనంటూ చెప్పిన మాటలు రోజు రోజుకూ నీరుగారుతున్నాయి.

ఈ దుఃస్థితికి కారణం 'ఇండియా' కూటమి పక్షాల స్వయంకృతం కొంతయితే, భారతరత్న పురస్కారాలు – ఈడీ – సీబీఐ లాంటి సామ దాన భేద దండోపాయాలతో పరవారిని కూడా తమ వారిని చేసుకొనేలా బీజేపీ నడుపుతున్న చాణక్య తంత్రం మరికొంత. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పార్టీ కండువాలు మార్చే సీజన్ ప్రబలుతోంది. అధికారం, ఎన్నికల్లో విజయాలే పరమావధిగా ఒకప్పటి 'ఆయా రామ్, గయా రామ్' సంస్కృతిని బీజేపీయే మళ్ళీ యథేచ్ఛగా పెంచిపోషిస్తోందనే విమర్శ బలంగానే వినిపిస్తోంది. గమ్మత్తేమిటంటే, కీలక నేతలే కాదు... కూటములు మారుస్తున్న పార్టీలదీ అదే సంస్కృతి, అదే సరళి. నిరుడు బీజేపీని అడ్డమైన మాటలూ అని బయటకు వెళ్ళిన నితీశ్, ఆయన జేడీయూ ఇవాళ మళ్ళీ అదే కమలం పార్టీ చంకనెక్కారు. కొత్త కూటమితో మళ్ళీ సీఎం సీటులో కూర్చున్నారు. మహారాష్ట్ర సీఎం సహా అనేక ఉన్నత పదవులను అనుభవించిన అశోక్ చవాన్ 38 ఏళ్ళ కాంగ్రెస్ సాహచర్యాన్ని వదులుకొని, కమలనాథుల పంచన చేరారు. అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న ఆయన తీరా కాషాయ వస్త్రం కప్పుకొన్న మరునాడే రాజ్యసభ అభ్యర్థి కాగలిగారు. ఎవరెప్పుడు ఎటుంటారో, తిరిగి వదిలొచ్చిన పార్టీలోకే వెళతారో తెలియకపోవడంతో ఇప్పుడు 'ఆయా రామ్... గయా రామ్... మళ్ళీ ఆయేగా రామ్' అనేది తాజా ఛలోక్తి అయింది.

నిజానిజాలేమో కానీ, మధ్యప్రదేశ్‌లో మరో మాజీ సీఎం సైతం కాంగ్రెస్ గూడ్స్ బండి దిగిపోయి, బీజేపీ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతారని వార్త. వ్యక్తులు వెళ్ళిపోయినా, వ్యవస్థలు శాశ్వతమనే మాట నిజమే. కానీ, కాంగ్రెస్ అధినాయకత్వం కానీ, 'ఇండియా' కూటమి కానీ ముందున్న సవాళ్ళపై లోతుగా ఆలోచిస్తున్నాయా అన్నది ప్రశ్న. పార్టీని విడిచిపెట్టిపోయే ముందు రోజు సైతం అశోక్ చవాన్ రానున్న లోక్‌సభ ఎన్నికలకు పార్టీ వ్యూహాన్ని ఖరారు చేసే కీలక సమావేశంలో ఉన్నారంటే, చుట్టుపక్కల ఏం జరుగుతోందో పార్టీ చూడలేకపోతోందని అనుకోవాలా? ఒకపక్క బీజేపీ కొత్త కూటములు కట్టడంలో, పాత దోస్తీలు వదిలించుకోవడంలో చాలా చులాగ్గా వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ మాత్రం కనీసం ఎన్నికల్లో పోటీకి సీట్ల పంపిణీలో సైతం అడుగులు ముందుకు వేయలేకపోవడం విచిత్రం. గడచిన పక్షం రోజుల్లో పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ కానీ, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ నేత కేజ్రీవాల్ కానీ ఏకపక్షంగా తామే అన్ని సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించారంటే ఏమనాలి? చివరకు ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఒకే ఒక్క సీటు మాత్రం ఇస్తామనే స్థాయికి తెగించిందంటే 'ఇండియా' కూటమిలో సయోధ్య ఏమున్నట్టు?

పార్టీల మధ్య వలసలు వెక్కిరిస్తుంటే, మరోపక్క ప్రజాస్వామ్యంలో అర్థవంతమైన చర్చలు కరవై, చట్టసభలు సైతం గౌరవం కోల్పోవడం మరో విషాదం. 1990 తర్వాత పార్లమెంట్ పనితీరు నానాటికీ తీసికట్టు నాగంభొట్లుగా మారింది. ఇటీవలే ఆఖరుసారి సమావేశమైన ప్రస్తుత 17వ లోక్‌సభలో అసలు డిప్యూటీ స్పీకర్ నియామకమే జరగలేదు. సాంప్రదాయికంగా ప్రతిపక్షాలకు కేటాయించాల్సిన డిప్యూటీ స్పీకర్ పదవి అనేదే భర్తీ కాకుండా అయిదేళ్ళు గడిచిపోవడం పార్లమెంటరీ చరిత్రలో ఇదే తొలిసారి. అలాగే, ప్రతిపక్ష ఎంపీలలో 70 శాతానికి పైగా సస్పెన్షన్‌లో ఉండగా కీలకమైన నేర సంస్కరణల చట్టాల లాంటివి ఆమోదం పొందాయి. ఒకే ఒక్క ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇవ్వడం తప్ప, ఏ ప్రశ్నకూ ప్రధాని మౌఖికంగా జవాబివ్వని లోక్‌సభా ఇదే. గడ్డె మీది పార్టీలతో సంబంధం లేకుండా గత 30 ఏళ్ళుగా పెరిగిన ధోరణికి ఇది తార్కాణం.

ఈ పరిస్థితులకు ఎవరిని తప్పుబట్టాలో, ప్రజలు ఏ పార్టీ వైపు ఆశగా ఎదురుచూడాలో తెలియని పరిస్థితి. మోదీ తరహా రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా 'ఇండియా' కూటమి వైపు చూడవచ్చని కొందరు ఆశపడ్డా, ఇప్పుడదీ అంతంత మాత్రమేననే భావన కలుగుతోంది. నిజాలు ఏమైనా, అయోధ్య, అబూధాబీల్లో ఆలయాలతో అధికసంఖ్యాకుల్లో అనుభూతిపరంగా మార్కులు కొట్టేస్తున్న మోదీతో పోటీపడాలంటే ప్రతిపక్ష కూటమి ఇకనైనా కళ్ళు తెరవాలి. బలమైన ప్రత్యర్థిని ఢీ కొట్టాలంటే, ఎంత మంచిదైనా ఆఖరి నిమిషపు 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లు చాలవని రాహుల్ గాంధీ లాంటివారు గ్రహించాలి. కూటమిలో ఐక్యత కావాల్సిన కీలక క్షణాల్లో, నిర్ణయాలు తాత్సారం చేస్తే ఫలితాలు చేదుగా ఉంటాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే, త్వరపడి తగు చర్యలు తీసుకోకపోతే... 'ఇండియా' కూటమి ఎన్నికల్లో పోటీకి ముందే చేతులెత్తేయాల్సి వస్తుంది.

సైన్యం ప్రతిష్ఠను దిగజార్చిన తీర్పు

విశ్లేషణ



మనోజ్ జోషీ

పాకిస్తాన్ తర్వాతి ప్రధానిగా మరోసారి షెహబాజ్ షరీఫ్ ఎన్నికయ్యే అవకాశం ఉంది. నాలుగోసారి ప్రధాని అవుతారని భావించిన నవాజ్ షరీఫ్ ఉన్నట్టుండి తన సోదరుడు షెహబాజ్ పేరును ముందుకు తెచ్చారు. అయితే ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పీటీఐ మద్దతు ఉన్న అభ్యర్థులు ఈ ఎన్నికల్లో బలమైన ప్రదర్శన ఇచ్చినందున, పాలనా సామర్థ్యానికి సంబంధించిన సమస్యలు అలాగే ఉంటాయి. ఇక, ఈ ఎన్నికలు పాక్‌లో సైన్యం ప్రాబల్యం తగ్గిందని సంకేతిస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ భారత్‌కు ముఖ్యమైనవే. ఆ దేశంతో మన సంబంధాలు సుప్తావస్థలో ఉండవచ్చు. కానీ అవి ఎప్పటికీ అలాగే ఉండవు. ఏ రకమైన ప్రపంచ శక్తిగా ఎదగడానికైనా, ఉపఖండ శాంతి, ఆర్థిక ఏకీకరణ మనకు చాలా కీలకం.

ఇస్లామిక్ రిపబ్లిక్ గమ్యానికి మధ్యవర్తిగా తన ప్రాబల్యాన్ని పాకిస్తాన్ సైన్యం రాను రానూ కోల్పోతోందని ఇటీవలే ముగిసిన ఆ దేశ ఎన్నికలకు చెందిన ఆశ్చర్యకరమైన ఫలితాలు సూచిస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం దేశాన్ని వాస్తవంగా నడిపిన మయన్మార్ సైన్యం... ఇప్పటి వరకూ ప్రజాస్వామ్య, వేర్పాటువాద శక్తులకు వ్యతిరేకంగా విజయవంతంగా పోరాడుతూ వచ్చినప్పటికీ వెనుకపట్టు పడుతోంది. మన దేశ తూర్పు సరిహద్దులలో జరుగుతున్న దానితో పోలిస్తే పాకిస్తాన్ పరిణామాలు కూడా మరీ భిన్నమైనవేమీ కాదు.

ప్రస్తుత తరుణంలో రాబోయే కాలంలో పాక్ రాజకీయాలు ఎలా రూపుదిద్దుకుంటాయో చెప్పడం కష్టమే. నవాజ్ షరీఫ్‌కు చెందిన 'పాకిస్తాన్ ముస్లిం లీగ్– నవాజ్'(పీఎంఎల్–ఎన్), బిలావల్ భుట్టో జర్దారీకి చెందిన 'పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ'(పీపీపీ) కలిసి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. అయితే ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన 'పాకిస్తాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్' (పీటీఐ) మద్దతు ఉన్న అభ్యర్థులు ఈ ఎన్నికల్లో బలమైన ప్రదర్శన ఇచ్చినందున, పాలనా సామర్థ్యానికి సంబంధించి తీవ్రమైన సమస్యలు అలాగే ఉంటాయి. ఇమ్రాన్ పార్టీని అణిచివేసేందుకు ఉద్దేశించిన చర్యలను ఆ పార్టీ నామినీలు అధిగమించి అత్యుత్తమ పనితీరు కనబరిచారు. అసమానతలకు వ్యతిరేకంగా వారు ప్రదర్శించిన పోరాట పటిమ మన దేశ ప్రతిపక్షానికి కూడా ప్రేరణగా ఉపయోగపడుతుంది.

ఎన్నికల ఫలితాలను చూస్తే పాకిస్తాన్ సైన్యం పెద్ద ఎత్తున పట్టు కోల్పోయిందని చెప్పవచ్చు. 2023 మే 9న ఇమ్రాన్ అరెస్టు తర్వాత, ఆయన పార్టీ మద్దతుదారులు దేశవ్యాప్తంగా హింసకు పాల్పడి, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి, పాకిస్తాన్ పంజాబ్‌లోని సైనిక స్థావరాలపై కూడా దాడి చేసిన సంఘటనలను గుర్తు చేసుకోండి.

ఈ పరిణామాలన్నీ భారత్‌కు ముఖ్యమైనవే. పాకిస్తాన్ ప్రభుత్వంతో మన సంబంధాలు తీవ్రమైన సుప్తావస్థలో ఉండవచ్చు. కానీ అవి ఎప్పటికీ అలాగే ఉండలేవు. పాకిస్తాన్ తనకుతాను మునిగిపోనీ లేదా తేలియాడనీ అని భావించేవారు నిజంగానే భ్రమలో ఉన్నారు. ఏ రకమైన ప్రపంచ శక్తిగా ఎదగడానికైనా సరే, ఉపఖండ శాంతి, ఆర్థిక ఏకీకరణ అనేవి మన భవిష్యత్తుకు చాలా ముఖ్యమైనవి.

భారత్, పాకిస్తాన్ సంబంధాలు ఇటీవలి కాలంలో ఆసక్తికరమైన దశలో ఉన్నాయి. ఒకవైపు పాకిస్తాన్ జిహాదీల చొరబాట్లు, వారి దాడులు కొనసాగుతున్నాయి. మరోవైపు, పాకిస్తాన్ ప్రభుత్వం భారత ప్రభుత్వానికి చేరువ కావడానికి ప్రయత్నించింది. ఈలోగా, 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్'(ఎఫ్ఏటీఎఫ్) ఒత్తిడితో, హాఫీజ్ సయీద్(లష్కర్–ఎ–తైయబా సహ వ్యవస్థాపకుడు)కు పాక్ 31 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అలాగే (లష్కర్–ఎ–తైయబా మరో వ్యవస్థాపకుడు) జకీవుర్ రెహ్మాన్ లఖ్వీకి కూడా వరుసగా



మూడు ఐదేళ్ల జైలు శిక్షలు విధించారు. ఇక, 2008 ముంబై దాడుల ప్రధాన నిర్వాహకుడు సాజిద్ మీర్‌ను కూడా పాకిస్తాన్ 'దొరికించుకుని' దోషిగా నిర్ధారించింది.

2023 జనవరిలో, అప్పటి పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ (నవాజ్ షరీఫ్ తమ్ముడు) దేశంలో అంధకార స్థితి మధ్య 'మేము మా గుణపాఠం నేర్చుకున్నాము. మా నిజమైన సమస్యలను పరిష్కరించు కోగలిగితే, మేము భారతదేశంతో శాంతియుతంగా జీవించాలనుకుంటున్నాము' అని ప్రకటించారు. కానీ మరుసటి రోజే, కశ్మీర్ రాజ్యాంగ హోదాను భారతదేశం పునరుద్ధరించనంత వరకూ ఎటువంటి సంభాషణా సాధ్యం కాదని పాక్ ప్రధాని కార్యాలయం ప్రకటించింది.

ఆ తర్వాత, భారత ప్రభుత్వం ఆమోదించిన ఆర్టికల్ 370 రద్దును మన సుప్రీం కోర్ట్ సమర్థించింది. జమ్మూ – కశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కూడా పిలుపునిచ్చింది. కానీ అది కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్ లేని కొత్త సరిహద్దులను కలిగి ఉంటుంది.

వాస్తవానికి, పుల్వామాలో సైనికులపై దాడి, ఆర్టికల్ 370 రద్దు కారణంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడానికి ముందే, రెండు దేశాలు ఐఎస్ఐ(పాకిస్తాన్ గూఢచార సంస్థ) మాజీ డిప్యూటీ చీఫ్‌తోనూ, భారతీయ ఇంటెలిజెన్స్ అధికారితోనూ తెరవెనుక సంభాషణను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించాయి. తర్వాత, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఒకానొక గల్ఫ్ దేశంలో అప్పటి ఐఎస్ఐ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఫైజ్ హమీద్‌ను కలిశారు. 2021లో ప్రధాని మోదీ పాకిస్తాన్ పర్యటనకూ, సింధ్‌లోని హింగ్లాజ్ మాతా ఆలయాన్ని సందర్శించడానికీ ప్రణాళికలు రూపొందాయి. కానీ అంతలోనే పాక్ ప్రధానిగా ఉన్న ఇమ్రాన్ ఖాన్ వెనక్కి తగ్గారు. ఆ తర్వాత 2022లో, ఆయన పదవి నుండి తొలగించబడ్డారు.

మోదీ, నవాజ్ షరీఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నప్పటికీ, ఆ సంబంధాల సూత్రాలను ఎంచుకోవడం ఇప్పుడు సవాలుగా మారింది. 2015లో ప్రధానిగా ఉన్న నవాజ్ షరీఫ్ మాతృమూర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు భారత ప్రధాని లాహోర్‌లో దిగినప్పటి నుంచీ చాలా పరిణామాలే జరిగాయి. ముఖ్యంగా, 2019 బాలాకోట్ వైమానిక దాడులు, తీవ్రవాద దాడి జరిగినప్పుడు పాక్‌పై దాడి చేయడానికి న్యూఢిల్లీ వెనుకాడదని స్పష్టంగా సూచించింది.

భారత్ కంటే పాకిస్తాన్‌కే ఇప్పుడు శాంతియుత సరిహద్దు అవసరం. దాని ఆర్థిక పరిస్థితి భయంకరంగా కొనసాగుతోంది; జిహాదీ తీవ్రవాద ముప్పు రోజురోజుకూ పెరుగుతోంది; అంతర్జాతీయ సమాజం దాని పగ్గాలను బిగించడానికి 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్'ను ఉపయోగిస్తోంది. పైగా, అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ల అధికార స్వీకారం నుండి ఆశించిన ప్రయోజనాలు కార్యరూపం దాల్చలేదు. బదులుగా ఇరాన్‌తో పాకిస్తాన్ ప్రమాదకరమైన గొడవకు దిగింది.

అమెరికా, చైనా తమ సొంత కారణాల వల్ల, పాకిస్తాన్‌లో ఉమ్మడి ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. ప్రధానంగా, అణ్వాయుధాలను కలిగి ఉన్న దేశంలో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక ఆరోగ్యం చాలా అవసరం. కాబట్టే, ఈ రెండు దేశాలూ, ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను మాత్రమే కాకుండా, పాక్–అఫ్గాన్ ప్రాంతం తీవ్రవాదులకు పుట్టిల్లు కాకుండా ఉండే వాతావరణాన్ని కోరుకుంటున్నాయి.

తన బీఆర్ఐ (బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్) పెట్టుబడులు ఉన్నప్పటికీ, తాను మాత్రమే పాకిస్తాన్ ఆర్థిక శ్రేయస్సుకు హామీ ఇవ్వలేననీ, ఇతర దేశాలు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) కూడా ముఖ్యమైన పాత్ర పోషించాలనీ చైనా గ్రహించింది. అమెరికాకు పాకిస్తాన్ ఒక ముఖ్యమైన వాణిజ్య భాగస్వామిగా ఉన్నదనీ, వాషింగ్టన్ కూడా పాక్‌లో లోతైన ప్రయోజనాలను కలిగి ఉందనీ కూడా చైనీయులకు తెలుసు. ఇస్లామిక్ స్టేట్ బలపడుతున్న అఫ్గానిస్తాన్‌లో ఏమి జరుగుతోందో తెలుసుకోవడానికి అమెరికాకు పాకిస్తాన్ ఒక ముఖ్యమైన సాధనం.

సైనిక కోణంలో భారత్ విషయానికొస్తే, భారతదేశ చర్యలు గత మూడేళ్లలో పాకిస్తాన్ నుండి చైనా వైపు దృష్టిని మరల్చినట్లు సూచిస్తున్నాయి. అయినప్పటికీ, పాకిస్తాన్ సరిహద్దును ప్రశాంతంగా ఉంచడం భారతదేశ ప్రయోజనాలలో భాగం. పాకిస్తాన్ మూలంలోనే పూర్తిగా గడబిడ ఉంటుంది. ఒక ఉన్నత స్థాయి బ్యాక్ ఛానల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా మరోసారి చర్చలు ప్రారంభించడమే మార్గం. ప్రబలమైన ఘర్షణను తగ్గించడం, రెండు దేశాల మధ్య సంబంధాలకు గానూ కొత్త విధానాన్ని రూపొందించడం తదుపరి కర్తవ్యం.

వ్యాసకర్త డిస్టింగ్విష్డ్ ఫెలో, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్, న్యూఢిల్లీ । ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రేమికుల కోసం



ప్రేమికులందరికీ 'వాలెంటైన్స్ డే' శుభాకాంక్షలు. మతం, కులం, జాతి, సంస్కృతి, దేశం లాంటి మనిషి సృష్టించుకున్న అన్ని హద్దులనూ దాటే ప్రేమికుల కోసమే ఈ ఉత్సవం!

– స్వాతి కె., న్యాయవాది

శుభాకాంక్షలు



సరస్వతీ దేవి మనందరికీ అపారమైన జ్ఞాన సాగరాన్ని అనుగ్రహించాలి. అందరికీ వసంత పంచమి (ఫిబ్రవరి 14) శుభాకాంక్షలు.

– అమ్జద్ అలీ ఖాన్, సరోద్ విద్వాంసుడు

అమర్ రహే



భయానకమైన తీవ్రవాద దాడికి జమ్ము కశ్మీర్ సాక్షిగా నిలిచిన రోజుగా 14 ఫిబ్రవరి 2019 గుర్తుండిపోతుంది. వంద కిలోల పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ప్రయాణిస్తున్న బస్సును పుల్వామాలో ఢీకొట్టించడం వల్ల 40 మంది సైనికులు అమరులయ్యారు.

– సాజిద్ యూసుఫ్ షా, కశ్మీర్ బీజేపీ నేత

ఇదా మీ నిర్వాకం?



టియర్ గ్యాస్ వాడకానికి దేశంలో డ్రోన్లను ఉపయోగించిన మొదటి పోలీసు బలగం హరియాణా పోలీసులు. 'ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను సర్వే చేయడానికి, వ్యవసాయ పంటలను పర్యవేక్షించడానికి' దృశ్య కంపెనీ 2021లో రూపొందించిన డ్రోన్లను రైతుల మీద గ్రెనేడ్లు వేయడానికి వాడారు.

– విజైతా సింగ్, జర్నలిస్ట్

పార్టీ ముగిసిందా?



ఎప్పుడైతే గాంధీలు రాజ్యసభలో ఆశ్రయం పొందారో, ఇక కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని తెలిసిపోతోంది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఇది ఎంతటి నైతిక స్థైర్యం కోల్పోయే సందేశం ఇస్తుందో ఆమె ఒక్కసారి కూడా ఆలోచించలేదా? (సోనియా గాంధీ రాజ్యసభకు పోటీపడనున్నారని వార్త.)

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

జయప్రదం చేయండి!

తెలంగాణ సామాజిక, రాజకీయార్థిక చలనాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఒక ప్రత్యక్ష సాక్ష్యం. 1919 సంవత్సరంలో ఏర్పడ్డ తెలుగు శాఖ బోధన, పరిశోధన రంగాల్లో ప్రమాణాలను నెలకొల్పుతూ వందేళ్లను పూర్తిచేసుకుంది. సాధికారకమైన పరిశోధక విలువలను తెలుగు సమాజానికి అందించిన తెలుగు శాఖ, ఆర్ట్స్ కాలేజి వేదికగా 2024, ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో 'తెలుగు లిటరరీ కాంగ్రెస్–2024'ను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో ఎంపిక చేయబడిన వారు ప్రతినిధులుగా పాల్గొంటున్నారు.

మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా తెలుగు భాష, సాహిత్య, పరిశోధనా రంగాల్లో కృషి చేస్తున్న ప్రముఖ కవులు, రచయితలు, పరిశోధకులు పాల్గొంటారు. అలాగే వివిధ భాష, సాహిత్య విషయాల్లో నిష్ణాతులైన 100 మంది విషయ నిపుణులు పత్ర సమర్పణ చేస్తారు. సాహిత్య శిల్పం, సాహిత్య మూల్యాంకనం అనే అంశాలపై ప్యానల్ డిస్కషన్లు ఉంటాయి.

అన్ని వర్గాలవారూ పాల్గొని ఈ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతున్నాము.

– ప్రొఫెసర్ సి. కాశీం । ఓయూ తెలుగు శాఖాధ్యక్షులు, లిటరరీ కాంగ్రెస్ కన్వీనర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

రైతు ప్రధానికి సముచిత గౌరవం

సందర్భం




డా॥ యలమంచిలి శివాజి

పేదవర్గాలకు ఎనలేని సేవలందించిన భారత మాజీ ప్రధానమంత్రి దివంగత చరణ్ సింగ్‌కు ఆయన చనిపోయిన 45 ఏళ్ళ తర్వాత కేంద్ర ప్రభుత్వం 'భారత రత్న' అవార్డుకు ఎంపిక చేయటం హర్షణీయం. అదే విధంగా తెలుగుజాతికి ప్రపంచంలో గుర్తింపు తెచ్చిన ఎన్టీ రామారావుకు కూడా భారతరత్న ఇస్తే సముచితంగా ఉంటుంది.

1977లో ఎమర్జెన్సీ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఇందిరాగాంధీని ఓడించటంలో చరణ్ సింగ్‌ది ప్రధానపాత్ర. వాస్తవానికి 1971 ఎన్నికలలో రాయబరేలీలో ఇందిరమ్మపై పోటీచేసిన రాజ్ నారాయణ్ ఎన్నికల పిటిషన్ వేసి, అలహాబాద్ హైకోర్టులో నెగ్గడం వెనుక కూడా చరణ్‌సింగ్ చాణక్యం లేకపోలేదు. మధు లిమాయే 1977లో ఒక మాటన్నారు: 'ఉత్తరభారతంలో రామ్ మనోహర్ లోహియా విఫలం కాగా చరణ్ సింగ్ సమర్థంగా వ్యవసాయ కులాలను, మైనార్టీలను, వెనుకబడిన వర్గాలను గుదిగుచ్చి మాల తయారు చేయటంలో విజయం సాధించారు.'

1937లో చరణ్ సింగ్ రెవిన్యూ మంత్రిగా ఉత్తరప్రదేశ్‌లో రైతురుణ విమోచన చట్టం తెచ్చి, రైతాంగాన్ని ఆనాడే అప్పుల బాధ నుండి బయట పడేశారు. 1979లో చరణ్‌సింగ్ ఆర్థికశాఖను చేపట్టి 1979–80 ఫిబ్రవరి 28న బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఆ సందర్భంలో ఓ రోజు ఉదయం ఫిబ్రవరి మొదటివారంలో చరణ్‌సింగ్‌ను కలుద్దామని తుగ్లక్ రోడ్డుకెళ్ళాను. అప్పట్లో ఆయన ఉపప్రధానిగా కూడా ఉన్నారు. చరణ్ సింగ్ ఇంటి ముందు మూడు కార్లున్నాయి. వాటినిండా ఫైళ్ళు మూట గట్టి నింపేస్తున్నారు. వ్యక్తిగత భద్రతాధికారి కర్తార్ సింగ్ నన్ను చూడగానే, 'చౌదరీ సాబ్ బడ్జెట్ రూపొందించేందుకై హరియాణాలోని సూరజ్‌కుండ్‌కు వెళ్తున్నారు. నీవు ఇక్కడే ఉండు, చౌదరీసాబ్ బయటకు రాగానే కనపడమని సలహా చెప్పారు. వాకిలి వద్దే నిలుచున్నాను.

చౌధరీ బయటకు రాగానే నన్ను చూసి 'ఏమిటింత ప్రొద్దున్నే వచ్చావు. గొడ్డుచలిలో?' అని వాకబు చేశారు. 'రెండు, మూడు సమస్యలున్నాయి. బడ్జెట్ ప్రతిపాదనలలో పొందుపరచాలి' అని వివరించాను. కారు ఎక్కమన్నారు. వెనుక సీటులో చౌధరీసాబ్ పక్కన కూర్చున్నాను. ముందు సీటులో కర్తార్ సింగ్ కూర్చున్నారు. రైతులు పండించే పొగాకుపై ఎక్సైజ్ సుంకం రద్దుచేయవలసిన అవసరాన్ని వివరించాను. అదే మాదిరి పేదవారు వాడుకొనే అల్యూమినియం పాత్రలపై కూడా సుంకం తొలగించాలని వివరించాను. దానికి సంబంధించిన వివరాలతో, ముసాయిదా పత్రాన్ని కూడా తయారు చేశానని చెప్పాను. ఆ పత్రాలు లాక్కొని తన ఫైలులో పెట్టుకొన్నారు. ఆ రెంటినీ బడ్జెట్ ప్రతిపాదనలలో పొందుపరిచారు. చాలా ఆశ్చర్యమేసింది. అంతకు ముందు బడ్జెట్లు రూపొందించే కసరత్తులో భాగంగా సలహాల కోసం బొంబాయి వెళ్ళి ఆర్థికవేత్తలు, ప్రణాళికా నిపుణులు, పారిశ్రామిక, వాణిజ్య వర్గాల వారు, పాలనాదక్షులతో చర్చలు జరిపితే బడ్జెట్ మరింత నాణ్యంగా రూపొందించడానికి ఉపయోగపడగలదని సూచించాను. సరేనన్నారు. బొంబాయి సమావేశంలో పాల్గొన్న పెద్దలు చెప్పినవన్నీ జాగ్రత్తగా రికార్డు చేయించి, ఆ కాగితాలు తీసుకొని ఆ



'భారతరత్న' చరణ్ సింగ్

సూచనలలో ప్రతి ఒక్కదానికీ పూర్తి వ్యతిరేకంగా బడ్జెట్ ప్రతిపాదనల్లో చేర్చారు. 'బొంబాయిలోని వారంతా బడా బాబులు. వారు చెప్పినదానికి పూర్తి వ్యతిరేకంగా చేస్తే, మనం సరైన మార్గంలో ఉన్నట్లు! మనం చేసిన పని బాగుందని వారు కితాబిస్తే మనం ఎక్కడో తప్పు చేశామని అర్థం! అని గీతోపదేశం చేశారు.

1979 జులైలో జనతాపార్టీ చీలిపోయింది. మొరార్జీ స్థానంలో చరణ్ సింగ్ ప్రధాన మంత్రి అయ్యారు. ఆయన కాలంలో లోక్ సభ రద్దయి, మధ్యంతర ఎన్నికలు ప్రకటించారు. డీసీఎం అధిపతి అయిన భరత్ రామ్ భారత వాణిజ్య, పారిశ్రామిక మండలి అధ్యక్షులుగా చరణ్ సింగ్ దగ్గరకు వెళ్లి ఆయనకు ఎన్నికల నిధి ఇవ్వజూపారు. ఏమిటిదని అడిగారు చరణ్ సింగ్. 'ఏమీ లేదు – ఇది మామూలే. ప్రతి ఎన్నికల సమయంలోనూ ప్రధానమంత్రులందరికీ మేము ఇలాగే సమర్పించుకొంటుంటాం. ఇందులో కొత్త ఏమీలేదు. ఇప్పుడు ప్రధాని కుర్చీలో మీరు కూర్చున్నారు గనుక మీకు సమర్పిస్తున్నాం' అన్నారు. 'ఏమిటీ నాకు డబ్బులిస్తావా? పోలీసులకు అప్ప జెబుతాను. నేను రైతుల దగ్గరికెళ్ళి రూపాయి – రూపాయి అడుక్కొంటాను గానీ, పారిశ్రామికవేత్తల విరాళాలతో ఎలక్షన్‌కు వెళ్తానా?' అని కోపగించారు చరణ్ సింగ్. భరత్ రామ్ రాష్ట్రపతి భవన్ కెళ్ళి రాష్ట్రపతిగా ఉన్న నీలం సంజీవరెడ్డిని కలిసి 'భలేవాడిని ప్రధాన మంత్రిగా చేశారు సార్. ఎన్నికల నిధికి ఏదో పదిరూపాయలిద్దామని వెడితే, అరెస్ట్ చేయిస్తానని వెంటబడతాడేమిటి సార్' అని వాపోయారు. ఎమ్‌వీఎస్ సుబ్బరాజు, గణపా రామస్వామి రెడ్డి, దొడ్డపనేని ఇందిర జనతాపార్టీ శాసనసభ్యులు, నీలం సంజీవరెడ్డికి ఆత్మీయులు. వారు వాస్తవానికి మానసికంగా లోక్ దళ్‌కూ, చరణ్ సింగ్ భావజాలానికీ దగ్గర. వారిని పిలిపించారు సంజీవరెడ్డి. 'ఇదెక్కడ గోలయ్యా. తుండు, తుపాకీ లేకుండా యుద్ధానికి వెళతానంటాడు. ఎవరో పెద్దమనిషి పది రూపాయలిస్తానంటే అరెస్టు చేయిస్తానంటాడు. ఈ సిద్ధాంత మూర్ఖుడితో కూడుగాదు, మీరు కాంగ్రెస్‌లో చేరిపోండి' అని సలహా ఇచ్చారు. అలాగే చేశారు వారు ముగ్గురూ.

ప్రధానమంత్రిగా నుండగా 1979 అక్టోబరులో గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ. చౌధరీ సాబ్ ఉపన్యాసాన్ని తెలుగులోకి నేనే తర్జుమా చేశాను. 'శివాజీ, నా ఉపన్యాసం కన్నా, నీ తర్జుమా మరింతగా శ్రోతలను ఆకట్టుకొంది. లేకుంటే సభ అంత రక్తికట్టేది కాదు' అని సభానంతరం మనసారా అభినందించారు చరణ్ సింగ్.


కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న ఓట్ల చీలిక వల్లనే కాంగ్రెస్ నెగ్గుకొస్తున్నదనీ, ఆ పార్టీలన్నీ ఐక్యం అయితే కాంగ్రెస్ పాలన ముగుస్తుందనీ చరణ్ సింగ్ విశ్వాసం. ఆ దిశగా ఆలోచన చేసే 1974 ఆగస్టు 29న భారతీయ క్రాంతిదళ్, సోషలిస్టుపార్టీ, సంయుక్త సోషలిస్టు పార్టీలు, ముస్లిం మజ్లిస్, స్వతంత్ర పార్టీ, రాష్ట్రీయ లోక్ దళ్, మజ్దూర్ పార్టీ, పంజాబ్ ఖేతీ భారీ జమీందారీ యూనియన్లను విలీనం గావించి భారతీయ లోక్‌దళ్‌ను రూపొందించారు.

జాతీయ స్థాయిలో నిరంతరం రైతుల కోసం పరితపించిన చరణ్ సింగ్‌కు భారతరత్న ఇవ్వటం ఎంతో సముచితం. కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్ని రైతులందరూ స్వాగతిస్తున్నారు.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ సభ్యుడు । 98663 76735

బంజారా ధర్మ గురు

బంజారా జాతిలో భగవత్ స్వరూపునిగా, అవతార పురుషునిగా, సామాజిక క్రాంతి వీరుడిగా పూజింపబడుతున్న వారు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాది వేసిన మహోన్నత వ్యక్తి ఆయన. మధ్యయుగంలో బంజారాలు ఉత్తర, మధ్య భారతాల నుంచి దక్షిణ భారత దేశం వైపుకు పశువులను మేపుకుంటూ వలస వచ్చారంటారు. రమావత్ రాంజీనాయక్ 360 కుటుంబాలతో పాటు 3775 గోవులతో కర్ణాటక రాష్ట్రంలోని గుత్తి గ్రామానికి అలా చేరుకున్నవారే. అనంతపురం అప్పట్లో కర్ణాటక పరిధిలోనే ఉంది. అక్కడ 'గొల్లయ్య దొడ్డి'లో నివాసం ఏర్పరుచుకున్నారు. ఆయన జన్మించిన ఈ ప్రాంతంలోనే 2000 సంవత్సరం తర్వాత సేవాగఢ్ మందిరం నిర్మించి శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్‌కు పూజలు నిర్వహిస్తున్నారు.



శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్

రాంజీ నాయక్‌కు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు భీమానాయక్‌కు కర్ణాటకలోని ధర్మిణీ బాయితో వివాహం జరిగింది. పిల్లలు లేని ఆ దంపతులు తమ ఏడుగురు దేవతలనూ మొక్కారు. ఇందులో మేరామాయాడి అంశతో 1739 ఫిబ్రవరి 15న ఆ దంపతులకు రమావత్ సంత్ సేవాలాల్ మహరాజ్ జన్మించారని ఓ కథ ప్రచారంలో ఉంది. ఈయన గోర్ బంజారాలను సంస్కరించడానికి ఎంతో కృషి చేశారు. ఆయన కాలంలోనే గుత్తిలో నివసిస్తున్న గోర్ బంజారా కుటుంబాలు గోవులతో తిరుపతికి పయనమయ్యాయి. వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని అక్కడి నుంచి రాయచూర్ మీదుగా హైదరాబాద్ చేరుకున్నారు.

గోర్ బంజారాల సంఘ సంస్కర్త సేవాలాల్ ధైర్య సాహసాలనూ, ఆధ్యాత్మిక శక్తినీ తెలుసుకున్న హైదరాబాద్ నిజాం నవాబు ఆయనను ఆహ్వానించి మహరాజ్ గంజ్, బంజారాహిల్స్ ప్రాంతాలను బహుమానంగా ఇచ్చారని లంబాడా గిరిజన పెద్దలు చెబుతారు. సంత్ సేవాలాల్ పొహరా గఢ్ ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పచుకొని బంజారాలను సంస్కరించే బోధనలు కొనసాగించారు.

– నరేష్ రాథోడ్ । నల్లగొండ (నేడు సంత్ సేవాలాల్ జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.షష్ఠి సా.4.18 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** అశ్విని ప.3.21 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.11.31 నుండి 1.02 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.20 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.30 నుండి 10.01 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.31, **సూర్యాస్తమయం:** 5.56.

బ్రిటిష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'గ్రేట్ స్కాలర్‌షిప్స్'

సాక్షి, హైదరాబాద్: భారత విద్యార్థులకు యూకే వర్సిటీల్లో విద్యను విస్తృతం చేయడమే లక్ష్యంగా బ్రిటిష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'గ్రేట్ స్కాలర్‌షిప్స్ 2024'ను ప్రకటించారు. యూకే ప్రభుత్వ భాగస్వామ్యంతో భారత్‌లోని విద్యార్థులు యూకే వేదికగా వివిధ అధ్యయన రంగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను చేపట్టే అవకాశాలను ఇది అందించనుంది. యూకేలోని 25 వర్సిటీలు ఈ సంవత్సరం స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాయి. ఫైనాన్స్, మార్కెటింగ్, బిజినెస్, సైకాలజీ డిజైన్, హ్యుమానిటీస్ తదితర అంశాల్లో 26 పీజీ గ్రేట్ స్కాలర్‌షిప్‌లు విద్యార్థులకు అందనున్నాయి. కోర్సు కోసం ట్యూషన్ ఫీజు కింద చెల్లించనున్నారు. మరింత సమాచారం కోసం https://www.britishcouncil.in/study-uk/scholarships/great-scholarshipsలో సంప్రదించాలని బ్రిటిష్ కౌన్సిల్ పేర్కొంది.

TS గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్
గిరిజన సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం
ప్రధాన కార్యాలయం, IV అంతస్తు, D.S.S. భవన్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్-500028
కార్యాలయం: 23393779, 23398013, ఫ్యాక్స్: 040-23395799,rmgcchyd@gmail.com

Rc.No. 48/2024/C **ప్రకటన** తేది: 13.02.2024

మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ (NTFP) & గమ్ అమ్మకం కోసం ఇ-వేలం

తెలంగాణ స్టేట్ గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ వారు మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ (డెడ్ స్టాక్ NTFP) & గమ్ అమ్మకం కోసం తెలంగాణ ఇ-వేలం పోర్టల్ ద్వారా ఇ-వేలం కోరుతున్నారు. ఆసక్తి గల సంస్థలు స్టాక్ వివరాలు మరియు వేలం నియమ నిబంధనలను auction.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

సం/- VC & మేనేజింగ్ డైరెక్టర్, TSGCC LTD, హైదరాబాద్
DIPR RO No.10458-PP/CL/ADVT/1/2023-24, Dt: 14-02-2024

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, సంగారెడ్డి, సంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇ-ప్రొక్యూర్‌మెంట్ NIT No.E1/721/2023, E1/721/9/2023, E1/681/2023, E1/686/2023, E1/687/2023, తేది : 13.02.2024, మొత్తం పనుల సంఖ్య : మున్సిపల్ జనరల్ ఫండ్స్ 2023-24 క్రింద (04), మున్సిపల్ జనరల్ ఫండ్స్ 2022-23 క్రింద (01). బిడ్ దాఖలు ప్రారంభ తేది మరియు సమయం : 13.02.2024న సా.6.00 గం.లు, బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం : 19.02.2024న సా.4.00 గం.లు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ tender.telangana.gov.inలో చూడవచ్చును. ఫోన్ నం. Dy.E.E., సంగారెడ్డి మున్సిపాలిటీ : 9849907770

సం/- మున్సిపల్ కమిషనర్, సంగారెడ్డి మున్సిపాలిటీ
DIPR RO No.10430-PP/CL/Advt/1/2023-24, Dt 14.02.2024

తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్
విద్యుత్ సౌధ : హైదరాబాద్-82

T.No.e-05/CE(C&C)/SE(C&C)/DE(C)/A1/TSGENCO/2023-24
BTPS- ఒక సంవత్సర కాలానికి M/s. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ యొక్క మణుగూరు గ్రూప్ ఆఫ్ మైన్స్ నుండి భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు రోడ్ ద్వారా 42.00 లక్షల మెట్రిక్ టన్నులు (MT) బొగ్గు రవాణా చేయుట. షెడ్యూల్ ప్రారంభ & ముగింపు తేది: 14-02-2024, 19.00 గం.కు & 05-03-2024, 16.00 గం.కు.

T.No.e-17/GM(ERP)/TSGENCO/2023-24
BTPS, KTPP, KTPS-V&VI స్టేజీలు మరియు KTPS-VII స్టేజ్ ప్లాంట్ల కొరకు అవసరమైన TSPCB సెంట్రల్ సర్వర్‌కు లైవ్ వీడియోలు ప్రదర్శించుటకు IP ఆధారిత PTZ కెమెరాలు సరఫరా, కాన్ఫిగరేషన్ మరియు పనిచేయించుట. పనుల విలువ రూ.36,22,923/-. షెడ్యూల్ ప్రారంభ & ముగింపు తేది: 10-02-2024, 19.00 గం.కు & 28-02-2024, 16.00 గం.కు.

T.No.e-11/CE/HPC&HP/TSGENCO/2023-24
PCHES- సూర్యాపేట జిల్లా, పులిచింతల హైడ్రోఎలక్ట్రిక్ స్కీమ్, 1 నం. డీజిల్ జనరేటర్ సెట్ 500 KVA, 415V, AC, 3-ఫేజ్, 0.8 PF, 50 HZ సామర్థ్యం ప్రముఖ తయారీ జనరేటర్ (కిర్లోస్కర్/కుమిన్స్/క్యాటర్‌పిల్లర్/గ్రీవ్స్ కాటన్) డిజైన్, తయారీ, తయారీదారు యొక్క వర్క్స్ వద్ద పరీక్షించుట, సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట, పూర్తి కంట్రోల్ ప్యానెల్, ఇంజిన్, ఆయిల్ ట్యాంక్, కానోపి ఎన్‌క్లోజర్ (అకోస్టిక్ టైప్) మరియు AMF (ఆటోమ్యాటిక్ మెయిన్స్ ఫెయిల్యూర్) కంట్రోల్ ప్యానెల్‌తో సహా మరియు అన్ని అవసరమైన ఎక్విప్‌మెంట్ అనగా అన్ని ప్రొటెక్షన్స్‌తో బ్యాటరీ చార్జింగ్ ఎక్విప్‌మెంట్, AVR మరియు కంట్రోల్ ప్యానెల్, వాటి ఇండికేషన్స్ మరియు అలారమ్స్ మొ॥ వాటితో బ్యాటరీ ఏర్పాటు చేయాలి. పనుల విలువ: రూ.35,00,000/-. షెడ్యూల్ పొడిగింపు 26-02-2024, 16.00 గం. వరకు.

T.No.e-10/CE/CETD/TSGENCO/2023-24
CETD- పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వద్ద 01-04-2024 నుండి లేదా వాస్తవ ప్రారంభ తేది నుండి 31-03-2025 వరకు CETD యొక్క క్యాంటీన్ వద్ద బోర్డింగ్ సదుపాయాల ఏర్పాటు. షెడ్యూల్ ప్రారంభ & ముగింపు తేది: 07-02-2024, 11.00 గం.కు & 07-03-2024, 15.00 గం.

T.No.e-14/CE/HPC&HP/TSGENCO/2023-24
AMRPLIS- నల్గొండ జిల్లా, పుట్టంగండి, AMRPLIS వద్ద యూనిట్-1 కొరకు లభించే స్పేర్ రన్నర్ మరియు గైడ్ వేన్స్ ద్వారా పాడయిన రన్నర్ మరియు గైడ్ వేన్ రీప్లేస్‌మెంట్. పనుల విలువ: రూ.78,40,310/-. షెడ్యూల్ ప్రారంభ & ముగింపు తేది: 19-02-2024, 11.00 గం.కు & 06-03-2024, 14.00 గం.కు.

తదుపరి వివరాల కొరకు: "www.tsgenco.co.in & https://tender.telangana.gov.in."
DIPR RO No.10479-PP/CL/Advt/1/2023-24, Dt 14.02.2024

దక్షిణ రైల్వే
(ప్రాజెక్ట్ ఆర్గనైజేషన్)
ఇ-టెండరు ప్రకటన నం.PROJ_MS_MSB_VLCY_24_02, తేది: 12-02-2024

క్ర.సం.	పని వివరణ	ఐటమ్ నం.1
1	పని పేరు	దక్షిణ రైల్వే, చెన్నై డివిజన్‌లోని చెన్నై బీచ్ (MSB) - వెలచేరి (VLCY) సబర్బన్ సెక్షన్ (20RKM) లో డ్యూయల్ డిటెక్షన్ MSDAC ద్వారా ప్రస్తుతం గల AFTC యొక్క రీప్లేస్‌మెంట్
2	ఇ-టెండరు ప్రకటన నం.	PROJ_MS_MSB_VLCY_24_02 తేది:12-02-2024
3	పని అంచనా వ్యయం	రూ.26,28,69,743.13/-
4	బిడ్డింగ్ విధానం	రెండు ప్యాకెట్ల (ఓపెన్) టెండర్
5	బయానా (EMD)	రూ.14,64,400.00/-
6	పూర్తిచేయు కాలము	12 నెలలు
7	టెండరు డాక్యుమెంట్ ఆన్‌లైన్ దాఖలు(ముగింపు) ఆఖరితేది, సమయం	06-03-2024,11.00గం. వరకు
8	టెండరు డాక్యుమెంట్లు లభించు వెబ్‌సైట్ చిరునామా,సమయం మరియు తేది	భారతీయ రైల్వే వెబ్‌సైట్ అనగా www.ireps.gov.in లో 12-02-2024 నుండి
9	ఆఫర్ల చెల్లుబాటు	90 రోజులు

గమనిక: సవివరమైన టెండరు ప్రకటన, నియమ నిబంధనలతో టెండరు డాక్యుమెంట్ మరియు టెండరుకు జారీచేసే ఏదైనా సవరణను (www.ireps.gov.in) లో చూడవచ్చును.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలి కమ్యూనికేషన్ ఇంజినీర్,
ప్రాజెక్ట్, చెట్‌పేట్, చెన్నై - 600031

మమ్మల్ని అనుసరించండి : twitter.com/GMSRailways

पेंशन निधि विनियामक और विकास प्राधिकरण
PENSION FUND REGULATORY AND DEVELOPMENT AUTHORITY
Azadi Ka Amrit Mahotsav

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ
బి-14/ఎ, ఛత్రపతి శివాజీ భవన్, కుతుబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా,
కట్వారియా సరై, న్యూ ఢిల్లీ - 110016

ఉద్యోగ ప్రకటన

కాంట్రాక్ట్/ డిప్యూటేషన్ ప్రాతిపదికన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (CEO), నేషనల్ పెన్షన్ సిస్టమ్ ట్రస్ట్ (NPS ట్రస్ట్), న్యూ ఢిల్లీగా ప్రారంభంలో మూడు (03) సంవత్సరాల కాల వ్యవధి కోసం, అథారిటీ వారు కోరుకుంటే రెండు (02) సంవత్సరాలు పొడిగించబడే కాల వ్యవధి కోసం నియామకానికి గాను భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నవి. అర్హత ప్రమాణాల వివరాలు, ఎంపిక విధానం, జీత భత్యాలు మరియు దరఖాస్తు ఫారం మొ॥వి PFRDA వెబ్‌సైట్ అనగా www.pfrda.org.in అదే విధంగా NPS ట్రస్ట్ వెబ్‌సైట్ అనగా www.npstrust.org.in మరియు నేషనల్ కెరీర్ సర్వీస్ వెబ్‌సైట్ www.ncs.gov.inలో కూడా లభిస్తాయి.

ఈ ఉద్యోగ ప్రకటనకు సంబంధించి సవరణలు/ అనుబంధాలు/ నోటీస్‌లు (ఏవైనా ఉంటే) PFRDA/ NPS ట్రస్ట్ వెబ్‌సైట్‌లో మాత్రమే జారీ చేయబడును.

దరఖాస్తు స్వీకరణ కోసం ఆఖరి తేది: 04 ఏప్రిల్, 2024 (గురువారం)

సం/-
చీఫ్ జనరల్ మేనేజర్
HR డిపార్ట్‌మెంట్

పూర్తి సమాచారం కోసం మా వెబ్‌సైట్ www.pfrda.org.in దర్శించండి లేదా QR కోడ్ స్కాన్ చేయండి

SECUNDERABAD CANTONMENT BOARD
SP Road, Court Compound, SECUNDERABAD - 500 003.
Tel No. 040-27808600 / 04. Email ID : ceo.scb2009@gmail.com

Lr.No. SCB/SWW/Digging of Borewells/336 Dated : 14-02-2024

PUBLIC NOTICE

Draft Regulations for digging and use of bore wells in Secunderabad Cantonment

1. The draft regulations for digging and use of bore wells in Secunderabad Cantonment which the Secunderabad Cantonment Board proposes to make in exercise of the powers conferred by sub-section (4) of section 204 of the Cantonments Act, 2006 (41 of 2006) is hereby published, as required by sub-section (1) of section 350 of the Cantonments Act, 2006, for the information of all persons likely to be affected thereby and notice is hereby given that the said draft regulations will be taken into consideration by Cantonment Board, Secunderabad after the expiry of (10) ten days from the date of publication of this notice.
2. Any objections or suggestions which may be received from any person with respect to the said draft before the expiry of the period of (10) ten days stated above will be considered by the Secunderabad Cantonment Board.
3. Detailed draft regulations for digging and use of bore wells in Secunderabad Cantonment has been uploaded on Secunderabad Cantonment Board website https://secunderabad.cantt.gov.in/ and also placed on the Office Notice Board for perusal of the general public.
4. Any person who intends to file objections/suggestions in respect of the draft regulations for digging and use of bore wells may submit the same in the office of the Cantonment Board Secunderabad in person or through dak or by email on ceo.scb2009@gmail.com on or before the expiry of a period of (10) ten days from the date of publication of this notice.

Sd/- **Chief Executive Officer**, Secunderabad Cantonment Board.

'సాగర్' విద్యుత్ కేంద్రాలకు ఎన్‌డీఎస్‌ఏ


విద్యుదుత్పాదన కేంద్రంలో ఎన్‌డీఎస్‌ఏ బృందం

నాగార్జునసాగర్: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల బృందం బుధవారం నాగార్జునసాగర్ డ్యామ్ దిగువన గల ప్రధాన, కుడికాల్వ విద్యుదుత్పత్తి కేంద్రాలను సందర్శించింది. బృందం సభ్యులు ముందుగా విజయవిహార్ బోర్డురూమ్‌లో సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేశ్‌కుమార్ అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాగర్ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం, భద్రత, నీటి వినియోగం, విద్యుదుత్పత్తి, జలాశయంలో ఎంత నీరున్నప్పుడు కుడి కాల్వపై విద్యుత్ ఉత్పత్తి అవుతుంది, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో టర్బైన్ల సంఖ్య, ఏయే టర్బైన్ నుంచి ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది? దిగువ టెయిల్‌పాండ్‌లోకి నీటిని విడుదల చేస్తూ విద్యుదుత్పాదన అనంతరం తిరిగి నీటిని జలాశయంలోకి ఎత్తిపోసేందుకు టర్బైన్లను పంప్‌మోడ్‌కు ఎప్పుడు మార్చారు వంటి అంశాలపై చర్చించారు. జెన్‌కో చీఫ్ ఇంజనీర్ మంగేశ్‌కుమార్ సభ్యుల సందేహాలకు సమాధానాలు చెప్పారు. అనంతరం రూట్‌మ్యాప్‌తో జల విద్యుదుత్పాదన కేంద్రాలను సందర్శించారు. సాయంత్రం వారు లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మరో డైరెక్టర్ ఆశిశ్‌కుమార్, నేషనల్ డ్యామ్‌సేఫ్టీ అథారిటీ డైరెక్టర్ మహేంద్రసింగ్, డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్‌జిషన్, సాంకేతిక నిపుణులు రాకేశ్, స్టేట్‌డ్యామ్ సేఫ్టీ అథారిటీ చీఫ్ ఇంజనీర్ కుమార్, ఎస్‌ఈ మురళీకృష్ణ, ఆర్గనైజేషన్ సీఈ ప్రమీల, ఎస్‌ఈ శ్రీనివాసులు, ఈఈ విజయలక్ష్మి, డీఈ సతీశ్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, ఎస్‌ఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లికార్జున్‌రావు, ఆంధ్రప్రదేశ్ సీఈ మురళీధర్ రెడ్డి, కృష్ణా రివర్‌బోర్డు ఎస్‌ఈ వరలక్ష్మీదేవి, ఈఈ హరి పాల్గొన్నారు.


తమ సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు పాడె మోస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిమల్లు రవి. అనారోగ్యంతో మంగళవారం కన్నుమూసిన ఆయుష్ విభాగం మాజీ డైరెక్టర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలను బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించారు. - వైరా

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగానే ముందుకెళ్తాం

- విజిలెన్స్ నివేదిక ఆధారంగా న్యాయ విచారణ
- పశ్చాత్తాపం లేకుండా కేసీఆర్ మాట్లాడుతున్నారు
- చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ విషయంలో ఏం చేయాలన్న దానిపై తాము సొంత నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చే నివేదిక ఆధారంగానే ముందుకెళ్లాల్సి ఉంటుందని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నివేదిక ప్రకారమే అవసరమైన చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు. అసెంబ్లీ లాబీల్లోని తన కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ... మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం విషయంలో అవలంబించిన భౌగోళిక ప్రక్రియ గురించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అడిగిందని, ఆ ప్రక్రియను సరిగా పాటించారా లేదా అన్నది పరిశీలించాల్సి ఉందని ఆయన అన్నారు. ఇప్పటికే విచారణ జరుపుతున్న విజిలెన్స్ ఇచ్చే నివేదిక ఆధారంగానే న్యాయ విచారణ జరుగుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో క్రిమినల్ విచారణ తాము చేయడం లేదని, తాము అధికారంలోకి రాకముందే ఎఫ్ఐఆర్ నమోదైందని చెప్పారు. బ్యారేజీ కుంగిపోయిన విషయం తెలిసిన తర్వాత కూడా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎందుకు మౌనంగా ఉండాల్సి వచ్చిందని ప్రశ్నించారు. వన్‌మ్యాన్ షో చేసి తెలంగాణకు నష్టం చేసిన కేసీఆర్ పశ్చాత్తాపం లేకుండా మాట్లాడుతున్నారని, తెలంగాణ ప్రజలకు ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో కాంగ్రెస్, బీజేపీ వాగ్యుద్ధం

బీఆర్ఎస్-బీజేపీ మధ్య దోస్తీ ఉందన్న మంత్రులు

- కాంగ్రెస్-బీఆర్ఎస్ కలిసి సంసారం చేశాయన్న బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్-బీజేపీ మధ్య దోస్తీ, లోపాయికారీ ఒప్పందం ఉన్నాయని మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వ్యాఖ్యానించగా... కాదు కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య దోస్తీ ఉంది.. పరస్పరం కేబినెట్‌లలో పనిచేశారు... కలిసి సంసారం చేశారంటూ బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యేలు ఎదురుదాడి చేశారు. బుధవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడు కాంగ్రెస్‌పై విమర్శలు కురిపిస్తూ బీఆర్ఎస్-కాంగ్రెస్‌ల మధ్య దోస్తీ ఉందంటూ వ్యాఖ్యానించారు. అప్పుడు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని బీఆర్ఎస్-బీజేపీల మధ్యనే అవగాహన ఉందని మండిపడ్డారు. 'ఎన్నికలకు ముందు బీఆర్ఎస్-బీజేపీ మిలాఖత్ అయ్యాయి. అనేక సందర్భాల్లో ఇది బయటపడింది. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను మార్చి కిషన్‌రెడ్డిని మాజీ సీఎం కేసీఆర్ నామినేట్ చేయించారు'అని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది అవాస్తవమంటూ మహేశ్వర్‌రెడ్డి ఖండించారు. కాళేశ్వరంపై న్యాయవిచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందని, మరి దీనిపై కేంద్రం, బీజేపీ ఈడీతో విచారణ ఎందుకు జరిపించడం లేదని చీఫ్‌విప్ ఆదిశ్రీనివాస్ ప్రశ్నించారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని మహేశ్వర్‌రెడ్డి చెప్పగా.. న్యాయవిచారణ అంటే బీజేపీకి భయం ఎందుకని ఆదిశ్రీనివాస్ నిలదీశారు.

వారిదే మ్యాచ్ ఫిక్సింగ్

భారతీయ జనతా పార్టీ ఎప్పుడు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయలేదు. చేయదు కూడా అని మహేశ్వర్‌రెడ్డి స్పష్టంచేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ కలిసి పని చేశాయని, భవిష్యత్‌లోనూ పనిచేస్తాయని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్‌తో కాంగ్రెస్‌కు లోపాయికారీ ఒప్పందం ఉందని, గతంలో కేంద్ర, రాష్ట్రస్థాయిల్లో కేబినెట్‌లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మంత్రులుగా ఉన్నారని చెప్పారు. సిట్టింగ్ జడ్జితో విచారణకు అవకాశం లేదని హైకోర్టు చెప్పినా దానినే పట్టుబడుతున్నారంటే దీని వెనక ఏదో మతలబు, కాంగ్రెస్-బీఆర్ఎస్‌ల మధ్య మ్యాచ్‌ఫిక్సింగ్ ఉందని స్పష్టమౌతోందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల వెంట మేడిగడ్డకు బీజేపీ ఎమ్మెల్యేలు వెళ్తే మంచివాళ్లు లేకపోతే కాదా అని ఆయన ప్రశ్నించారు. అందరి కంటే ముందుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డా.కె.లక్ష్మణ్, పార్టీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు మేడిగడ్డకు వెళ్లి పగుళ్లు పడిన విషయాన్ని బయటపెట్టారన్నారని గుర్తు చేశారు.

పురపాలక మరియు పట్టణాభివృద్ధి
తెలంగాణ ప్రభుత్వం
hmda | NIUM NATIONAL INSTITUTE OF URBAN MANAGEMENT

Advt. No. తేది: -02-2024

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (HMDA) మరియు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (MRDCL) కోసం లీగల్ స్పెషలిస్ట్ (కాంట్రాక్ట్ ప్రాతిపదిక) హైరింగ్

దిగువ తెలిపిన ఉద్యోగాల కోసం అర్హులైన ప్రొఫెషనల్స్ నుండి MA&UD దరఖాస్తు కోరుతోంది:

శాఖ	జాబ్ రోల్	ఉద్యోగాల సంఖ్య	జీతం (నెలకు)	అనుభవం
HMDA	లీగల్ స్పెషలిస్ట్	1 ఉద్యోగం	1.00 లక్షలు	కనీసం 10 సంవత్సరాలు మరియు వయసు 40 సంవత్సరాలు మించరాదు
MRDCL	లీగల్ స్పెషలిస్ట్	1 ఉద్యోగం	1.00 లక్షలు	కనీసం 10 సంవత్సరాలు మరియు వయసు 40 సంవత్సరాలు మించరాదు

ఆసక్తి గల అభ్యర్థులు 29 ఫిబ్రవరి, 2024న లేదా ఆలోగా దరఖాస్తు చేయవచ్చును. షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులు మాత్రమే ఇంటర్వ్యూ కోసం పిలువబడతారు. మరిన్ని వివరాల కోసం దర్శించండి www.nium.org.in/careers లేదా ఇ-మెయిల్: hr@nium.org.in.
DIPR RO No.10459-PP/CL/Advt/1/2023-24, Dt:14.02.2024

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం
తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ & వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నం.SE/TSEWIDC/HYD/NIT/1322 to 1348/2023-24, తేది: 13.02.2024 (1వ, 4వ & 9వ పిలుపు) దిగువ తెలిపిన పనుల కోసం అర్హులైన కాంట్రాక్టర్లందరి నుండి టెండర్లు కోరబడుచున్నవి: తెలంగాణ రాష్ట్రంలో భవనాలు, పాదబాటలు, వీధిలైట్లు, CC రోడ్ల నిర్మాణం, డ్యువల్ డెస్కుల సరఫరా, పునరుద్ధరణ మరియు మరమ్మతులు, GJC, GDC ప్రహరీగోడలు, ఎలక్ట్రికల్ పనులు (27 పనులు) (రూ.2.60 నుండి 225.00 L). ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలు మరియు స్వీకరణకు చివరి తేది: 27.02.2024 సా.4.00 గం వరకు. **గమనిక:** ధర సర్దుబాటు GO Ms.No.94 of Transport, Roads & Buildings (R.1) Dept., dt.16.04.08 ప్రకారం అంటే స్టీల్ మరియు సిమెంట్ కోసం మాత్రమే వర్తిస్తుంది. పూర్తి వివరాలను https://tender.telangana.gov.in లో చూడవచ్చును లేదా సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TSEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, ఇ-గేట్ ఎదురుగా, ఎల్.బి.స్టేడియం, హైదరాబాద్, ఫోన్ నం. 29565991 వారిని స్వయంగా సంప్రదించండి.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TSEWIDC, హైదరాబాద్
DIPR RO No.10451-PP/CL/Advt/1/2023-24, Dt: 14.02.2024

PMశ్రీ కేంద్రీయ విద్యాలయ నం.2, గోల్కొండ
నానల్‌నగర్ 'X' రోడ్, హైదరాబాద్ - 500 008
టెలిఫోన్ నం: 040-23566628
ఇ-మెయిల్: kvgolkd2@gmail.com, వెబ్‌సైట్: http://no2golconda.kvs.ac.in

వాక్-ఇన్-ఇంటర్వ్యూ

మా గౌరవప్రదమైన విద్యాసంస్థలో వివిధ టీచింగ్ నాన్-టీచింగ్ ఉద్యోగాల కోసం వాక్-ఇన్ ఇంటర్వ్యూలు ప్రకటించడానికి మేము సంతోషిస్తున్నాము. వివరాలు దిగువ విధంగా ఉన్నాయి:

తేది: 23.02.2024 మరియు 24.02.2024, సమయం: 10:00 గం. నుండి 16:00 గం.

23.02.2024: PGTs: ఇంగ్లిష్, హిందీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్, కామర్స్ మరియు ఎకనామిక్స్, **TGTs:** ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, మ్యాథమెటిక్స్, సైన్స్ (PCBతో) మరియు సోషల్ సైన్స్.
PRTs మరియు **బాలవాటిక** (ప్రీ-ప్రైమరీ) టీచర్స్.

24.02.2024: కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ / స్పోర్ట్స్ కోచ్ / ఆర్ట్ కోచ్ / స్పెషల్ ఎడ్యుకేటర్ / యోగా ఇన్‌స్ట్రక్టర్ / మ్యూజిక్ & డ్యాన్స్ కోచ్ / ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ / డాక్టర్ మరియు నర్స్.

అభ్యర్థులు ఒరిజినల్ డాక్యుమెంట్లతో పాటు జిరాక్స్ కాపీల సెట్ మరియు రెజ్యూమె దాఖలు చేయవలెను.
సవివరమైన విద్యార్హతల కోసం దర్శించండి మా వెబ్‌సైట్: http://no2golconda.kvs.ac.in
అన్ని ఉద్యోగాలు పార్ట్-టైమ్ కాంట్రాక్చువల్ ప్రాతిపదికన పూర్తిగా తాత్కాలికం.

సం/- ప్రిన్సిపాల్

పురపాలక సంఘ కార్యాలయము, మెదక్

ఫైల్ నెం.A1/1492/2024 **బహిరంగ వేలం ప్రకటన** తేది: 13-02-2024

మెదక్ పట్టణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా పాత బస్టాండు ఎదురుగా గల మున్సిపల్ కమర్షియల్ కాంప్లెక్స్ దుకాణములకు (3) మూడు సంవత్సరములకు గాను కిరాయిపై లీజు ఇచ్చుటకు బహిరంగ వేలము నిర్వహించుటకు తేది: 06.02.2023 రోజున పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయడం జరిగినది, కానీ కొన్ని అనివార్య కారణముల వలన వేలము పాట వాయిదా వేయడం జరిగినది. కావున బహిరంగ వేలము వాయిదా వేసి ఒక సంవత్సరము గడుస్తున్నందున ఇట్టి బహిరంగ వేలము రద్దు పరచనైనది. కావున ఇదివరకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు తమ దరఖాస్తులను ఉపసంహరించుకోగలరని తెలియచేయనైనది. ఇట్టి విషయములో పట్టణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా ప్రస్తుతము బహిరంగ వేలము తేది: 21.02.2024 రోజున ఉ.10.30 గం.లకు పురపాలక సంఘ కార్యాలయములో వేలంపాట జరుగును.కావున పట్టణ ప్రజలు బహిరంగ వేలములో పాల్గొనుటకు దరఖాస్తు చేసుకోగలరు.

ఇట్టి వేలము పాటలో ఈ దిగువ చూపిన నెంబర్లు గల దుకాణములకు బహిరంగ వేలము నిర్వహించబడును.

క్రమ సంఖ్య	దుకాణము నెంబరు	వైశాల్యం (పొడవు X వెడల్పు) చదరపు ఫీట్లు	మొత్తం వైశాల్యం చదరపు ఫీట్లు	నిర్ణయించిన నెలసరి అద్దె	రూల్స్ ప్రకారం రిజర్వేషన్ పొజిషన్	డిపాజిట్ అమౌంట్
1	1	21.60x10.90	235.44	9332	SC	30,000=00
2	2	21.60x12.00	259.20	9332	ST	30,000=00
3	3	21.60x12.00	259.20	9332	General	30,000=00
4	4	21.60x12.00	259.20	9332	Naybrahmana	30,000=00
5	5	21.60x9.00	194.40	6650	General	30,000=00
6	6	21.60x12.00	259.20	9332	General	30,000=00
7	7	21.60x12.00	259.20	9332	General	30,000=00
8	8	21.60x12.00	259.20	9332	SLF/TLF	30,000=00
9	9	21.60x12.00	259.20	9332	General	30,000=00
10	10	21.60x12.00	259.20	9332	SC	30,000=00
11	11	21.60x12.00	259.20	9332	General	30,000=00
12	12	32.00x12.00	384.00	9332	General	30,000=00
13	13	32.00x9.00	288.00	6756	General	30,000=00
14	14	32.00x12.00	384.00	10664	General	30,000=00
15	15	32.00x12.00	384.00	10664	SC	30,000=00
16	16	32.00x12.00	384.00	10664	SLF/TLF	30,000=00
17	17	32.00x12.00	384.00	10662	Person with Disability	30,000=00

వేలం షరతులు:
1. వేలము షరతులు తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 సెక్షన్ 147 ప్రకారము అనుసరించి ఉండును.
2. వేలము పాటలో పాల్గొనుటకు గాను దరఖాస్తు సమర్పించుటకు చివరి తేది: 15.02.2024 నుండి 20.02.2024 (సమయం ఉ.10.30 గం. నుండి సాయంత్రం 05.00 గం. వరకు)
3. వేలము తేది: 21.02.2024 సమయం: ఉదయం 10.30 గం.లకు, స్థలం: పురపాలక సంఘ కార్యాలయము.
4. వేలములో పాల్గొనదలచిన వారు దరఖాస్తు ఫారం ఫీజు రూ.10000/- (తిరిగి ఇవ్వబడదు) చెల్లించవలెను. మరియు SC, ST & PH వారికి దరఖాస్తు ఫారం ఫీజు రూ.5000/-
5. వేలములో పాల్గొను దరఖాస్తు దారుడు పైన పట్టికలో తెలిపిన విధముగా రూ.30,000/-లు డిమాండ్ డ్రాఫ్ట్ రూపేణా దరఖాస్తు వెంబడి చెల్లించవలెను. ఈ రూపాయలు అధిక పాట పాడిన వారికి వారు చెల్లించు అడ్వాన్స్‌లో సర్దుబాటు చేయబడును, మిగతా వారికి తిరిగి చెల్లించబడును.
6. దుకాణముల వేలం ప్రక్రియ రిజర్వేషన్ ప్రకారం నిర్వహించబడును.
7. దరఖాస్తుదారుని యొక్క ఫోటో మరియు ఏదేని ఒక గుర్తింపు కార్డ్ సమర్పించవలెను.
8. ప్రతిషాపు వేరు వేరుగా వేలం వేయబడును. ఒక డిపాజిట్ దారుడు ఒక షాపుకు మాత్రమే వేలము పాటకు అర్హుడు.
9. వేలములో పాల్గొనే వారు ఒక కుటుంబంలో నుండి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
10. దరఖాస్తుదారుడు మున్సిపాలిటీకి చెల్లించవలసిన అన్ని రకముల పన్నులు చెల్లించి ఉండాలి ఎలాంటి బకాయిలు ఉండరాదు. కార్యాలయము నుండి తీసుకున్న నోడ్యూస్ సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు సమర్పించగలరు.
11. అధిక మొత్తంలో వేలం పాట పాడిన వారికి దుకాణం కేటాయించబడును.
12. వేలం పాటలో పాల్గొని పాట దక్కించుకున్న కిరాయి దారుడు 3 నెలల కిరాయి అడ్వాన్స్‌గా చెల్లించవలసి యుండును. ముందుగా సమర్పించిన డి.డి.ని సదరు కలుపుకుని మిగతా బ్యాలెన్స్ అమౌంట్ డిపాజిట్ చేయవలసియుండును.
13. వేలం యొక్క లీజు కాలపరిమితి 3 సంవత్సరములు ఉండును.
14. కిరాయిదారుడు తన స్వంత ఖర్చులతో లీజ్ డీడ్ రిజిస్ట్రేషన్ (8) రోజులలో చేసి కార్యాలయములో సమర్పించిన తరువాత షాపు అప్పగించబడును.
15. మడిగెలు, గోదాములకు గాని, వంట చేయుటకు గాని ఉపయోగించరాదు మరియు హోటల్స్, [illegible] నడుపరాదు.
16. ప్రతినెల అద్దె నెల ఆరంభములో అనగా 5వ తేదీ లోపు జమకట్టవలెను. లేనియెడల నోటీస్ జారీచేసి 2% వడ్డీ వసూలు చేస్తూ షాపును వెంటనే రద్దు చేయబడును.
17. వేలములో గెలుపొందిన వ్యక్తి మాత్రమే వ్యాపారం చేసుకొనుటకు అధికారము కలిగియుండును, ఇతరులకు దుకాణమును సబ్ లీజ్ చేయుటకు అధికారము లేదు. సబ్ లీజ్ చేసినచో షాపును జప్తుచేసి తిరిగి వేలం వేయబడును.
18. ఇట్టి వేలం ప్రక్రియ గురించి ఏదైనా సలహాలు సందేహాల కొరకు కార్యాలయం పని వేళలలో రెవెన్యూ విభాగం మరియు టౌన్ ప్లానింగ్ విభాగములో సంప్రదించగలరు.
19. ఇట్టి వేలము ప్రక్రియ నిర్వహించుటకు గాని రద్దు పరచుటకు గాని ఎలాంటి షరతులు లేకుండా సమయానుసారము నిర్ణయము తీసుకొనుటకు కమిషనర్ గారికి అధికారములు కలవు.

సం/- కమిషనర్, పురపాలకసంఘం, మెదక్
DIPR RO No.10423-PP/CL/Advt/1/2023-24, Dt: 14.02.2024

సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (CCRT)
సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
ప్లాట్ నం.15ఎ, సెక్టార్-7, ద్వారక, న్యూ ఢిల్లీ - 110075
Ministry of Culture, Government of India

సాంస్కృతిక రంగంలో అత్యున్నత వ్యక్తులకు ఫెలోషిప్ ప్రదానం చేయుటకు పథకం

సంస్కృతికి సంబంధించి అభినయం, సాహిత్యం, ప్లాస్టిక్ కళలు మరియు నూతన ఏరియాల రంగంలో రిసెర్చ్ ఓరియెంటెడ్ ప్రాజెక్టులు చేపట్టుటకు జూనియర్ మరియు సీనియర్ ఫెలోషిప్ ప్రదానం చేయుటకు CCRT, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆఫ్-లైన్ దరఖాస్తులు కోరుచున్నది.

2022-23 సంవత్సరం కొరకు **15 ఫిబ్రవరి 2024** నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. ఈ సంవత్సరానికి 200 జూనియర్ & 200 సీనియర్ ఫెలోషిప్స్ లభిస్తున్నాయి. పథకాల వివరాలు, దరఖాస్తుదారులకు సూచనలు, అర్హత నిబంధనలు/ ప్రమాణాలు మరియు అప్లికేషన్ మాడ్యూల్ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం మరియు CCRT యొక్క దిగువ వెబ్‌సైట్లు అనగా **www.indiaculture.nic.in & www.ccrtindia.gov.in** లో లభిస్తాయి.

దరఖాస్తుల దాఖలుకు ఆఖరి తేది 31 మార్చి, 2024
ఆఫ్-లైన్ దరఖాస్తులు మాత్రమే పరిశీలించబడతాయి.

cbc 09127/12/0010/2324

MINISTRY OF SOCIAL JUSTICE & EMPOWERMENT, GOVERNMENT OF INDIA | ALIMCO



" సమాజంలో ప్రతి వ్యక్తి సులభంగా జీవించేలా చేయడానికి మా ప్రభుత్వం త్వరితగతిన పని చేస్తోంది. అది సీనియర్ సిటిజన్స్ కావచ్చు, దివ్యాంగజనులు కావచ్చు, గిరిజనులు కావచ్చు లేదా సమాజంలో అణచివేతకు గురైన వర్గాల వారు కావచ్చు. 130 కోట్ల మంది భారతీయులకు సేవ చేయడానికి మరియు వారి ప్రయోజనాలను కాపాడటానికి అగ్ర ప్రాధాన్యతనిస్తున్నాము. "
-నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి

రాష్ట్రీయ వయోశ్రీ యోజన ద్వారా సాధికారత

సీనియర్ సిటిజన్స్‌కు సహాయ పరికరాల పంపిణీ

సీనియర్ సిటిజన్స్ కోసం దేశవ్యాప్తంగా 60 పంపిణీ శిబిరాలు నిర్వహిస్తున్నాము

శారీరక కార్యకలాపాలను దాదాపు సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు వయో-సంబంధిత వైకల్యాలు / బలహీనతతో బాధపడే సీనియర్ సిటిజన్స్ కోసం సాధనాలు మరియు సహాయ-జీవన పరికరాలు

BPL కేటగిరీకి చెందిన మరియు నెలవారీ ఆదాయం రూ.15000/- మించని సీనియర్ సిటిజన్స్ కోసం

వీరి సమక్షంలో
గౌ॥ డా॥ వీరేంద్ర కుమార్
సామాజిక న్యాయం & సాధికారత శాఖ మంత్రి
భారత ప్రభుత్వం

గురువారం, 15 ఫిబ్రవరి, 2024న ఉ॥ 11.00 గం.లకు
వర్చువల్‌గా

60 జిల్లాలకు సంబంధించిన సమాచారం కోసం QR కోడ్ స్కాన్ చేయండి
సీనియర్ సిటిజన్స్ కోసం టోల్‌ఫ్రీ జాతీయ హెల్ప్‌లైన్ **14567**
మరింత తెలుసుకొనేందుకు, లాగాన్ https://socialjustice.gov.in/
సోషల్ మీడియాలో అనుసరించండి /Department of Social Justice and Empowerment

CBC 38101/13/0070/2324



బుధవారం అబుదాబిలో స్వామి నారాయణ్ ఆలయ ప్రారంభోత్సవంలో జలాభిషేకం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

సుసర్ణాధ్యాయం

అబుదాబిలో ఆలయ నిర్మాణంపై మోదీ

- భారతీయుల మది గెలిచిన యూఏఈ
- అధ్యక్షుడు షేక్ జాయేద్‌కు కృతజ్ఞతలు
- ఆలయ ప్రారంభోత్సవంలో ప్రధాని



ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా మహంత్ స్వామి మహరాజ్‌తో మోదీ

అబుదాబి: యూఏఈ రాజధాని అబుదాబీలో రూపు దిద్దుకున్న హిందూ ఆలయాన్ని ప్రపంచ మానవాళి ఉమ్మడి వారసత్వ విలువలకు నూతన ప్రతీకగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. అంతర్జాతీయ స్థాయిలో మత సామరస్యానికి, ఐక్యతకు చిహ్నంగా అది విలసిల్లుతుందని ఆశాభావం వెలిబుచ్చారు. బోచాసన్వాసి అక్షర్ పురుషోత్తం సంస్థ (బాప్స్) ఆధ్వర్యంలో నిర్మితమైన ఈ స్వామి నారాయణ్ ఆలయాన్ని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సంప్రదాయ పద్ధతిలో లేత గులాబి రంగు ధోవతి, కుర్తా, స్లీవ్ లెస్ జాకెట్ ధరించి అర్చకులు, పురోహితులతో కలిసి పూజాదికాలు తదితరాల్లో పాల్గొన్నారు. దేవతా మూర్తులకు హారతులిచ్చారు. యూఏఈ మంత్రి షేక్ నహ్యాన్ బిన్ ముబారక్ అల్ నహ్యాన్, స్వామి నారాయణ్ సాంప్రదాయికులతో పాటు పలు మత సంప్రదాయాలకు చెందిన ఆధ్యాత్మిక పెద్దలు ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. అనంతరం వేలాదిగా పాల్గొన్న భక్తులనుద్దేశించి మోదీ మాట్లాడారు. ''ఈ ఆలయ నిర్మాణం ద్వారా మానవ చరిత్రలోనే సువర్ణాధ్యాయానికి యూఈఏ తెర తీసింది. 140 కోట్ల మంది భారతీయుల మది గెలుచుకుంది'' అంటూ కొనియాడారు. భారతీయుల ఆకాంక్షలను సాకారం చేసినందుకు యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌కు కృతజ్ఞతలన్నారు. ఆలయ నిర్మాణానికి ఆయన అందించిన అండదండలు మరవలేనివని ప్రశంసించారు. ''ఈ ఆలయంలో అడుగడుగునా మత వైవిధ్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. యూఏఈ అనగానే గుర్తొచ్చే బుర్జ్ ఖలీఫా, షేక్ జాయేద్ మసీదులకు ఇకపై స్వామి నారాయణ్ ఆలయం కూడా తోడవుతుంది. దీని సందర్శనకు ముమ్ముందు భారీగా భక్తులు తరలి వస్తారు'' అని ఆశాభావం వెలిబుచ్చారు. ఇటీవలే అయోధ్యలో భవ్య రామ మందిరాన్ని ప్రారంభించుకున్నామంటూ గుర్తు చేసుకున్నారు. ఆ వెంటనే అబుదాబీలోనూ ఆలయాన్ని ప్రారంభించే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఇది భారత్‌తో పాటు దేశ మత విశ్వాసానికి, సంస్కృతికి కూడా అమృత కాలమేనన్నారు.

సుత్తి, ఉలి చేబట్టిన మోదీ...

అంతకుముందు ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్న వారందరినీ మోదీ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుత్తి, ఉలి చేబూని అక్కడి రాతిపై వసుదైవ కుటుంబకం అంటూ స్వయంగా చెక్కారు. ఆలయ నిర్మాణ విశేషాలను అడిగి తెలుసుకున్నారు.

సర్కారు 'మద్దతు' లేదనే..!

రాజధాని బాట పట్టిన రైతు ఉద్యమం

సాగు గిట్టుబాటు కావడం లేదంటూ రైతన్న మరోసారి కన్నెర్రజేశాడు. డిమాండ్ల సాధనకు రాజధాని బాట పట్టాడు. దాంతో రెండు రోజులుగా ఢిల్లీ శివార్లలో యుద్ధ వాతావరణం నెలకొంది. అవసరమైతే మరోసారి నెలల తరబడి ఆందోళనలు కొనసాగించేందుకే రైతులు సిద్ధమవుతున్నారు. పంజాబ్, హరియాణాతో పాటు ఉత్తర యూపీకి చెందిన రైతులు భారీ సంఖ్యలో నిరసనల్లో పాల్గొంటున్నారు. అన్ని పంటలకూ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించడంతో పాటు దానికి చట్టబద్ధత కల్పించాలన్నది వారి ప్రధాన డిమాండ్. దాంతోపాటు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలుకు కూడా రైతులు పట్టుబడుతున్నారు. ఇంతకీ ఏమిటీ ఎంఎస్‌పీ? రైతు సంక్షేమానికి స్వామినాథన్ కమిటీ చేసిన సిఫార్సులేమిటి...?



ఎంఎస్‌పీ కీలకం..

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడంలో కనీస మద్దతు ధర (మినిమం సపోర్ట్ ప్రైస్-ఎంఎస్‌పీ)ది కీలక పాత్ర.

- రైతుల నుంచి పంటను సేకరించేందుకు ప్రభుత్వం చెల్లించే కనీస ధరే ఎంఎస్‌పీ.
- ఇది వారికి మార్కెట్ ఒడిదొడుకుల బారినుంచి రక్షణతో పాటు స్థిరత్వాన్ని, ఆదాయ భద్రతను కల్పిస్తుంది.
- దీన్ని కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సీఏసీపీ) నిర్ణయిస్తుంటుంది. ఈ విషయంలో ఉత్పత్తి వ్యయం, మార్కెట్ ధోరణులు, డిమాండ్-సరఫరా తదితరాలను పరిగణనలోకి తీసుకుంటుని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీకి ఎంఎస్‌పీపై సిఫార్సులు చేస్తుంది. వాటి ఆధారంగా సీసీఈఏ తుది నిర్ణయం తీసుకుంటుంది. సీఏసీపీ 1965లో ఏర్పాటైంది.

ఇలా లెక్కిస్తారు...

ఎంఎస్‌పీ లెక్కింపు సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం రైతులకయ్యే ప్రత్యక్ష, పరోక్ష ఉత్పత్తి వ్యయాలు రెండింటినీ పరిగణనలోకి తీసుకుంటారు.

- ఎరువులు, విత్తనాలు, కూలీల వంటివి ప్రత్యక్ష వ్యయం కాగా రైతు సొంత కుటుంబం పడే కష్టం, అద్దెలు తదితరాలు పరోక్ష వ్యయం.
- వీటిని స్థూలంగా ఏ2, ఎఫ్ఎల్, సీ2గా వర్గీకరిస్తారు.
- పంట ఎదుగుదల, ఉత్పత్తి, నిర్వహణ నిమిత్తం చేసే ఎరువులు, విత్తనాలు, కూలీల వ్యయం ఏ2 కిందకు వస్తుంది.
- ఈ అసలు ఖర్చులకు కుటుంబ కష్టం తదితర పరోక్ష ఉత్పత్తి వ్యయాన్ని కలిపితే ఎఫ్ఎల్.
- ఏ2, ఎఫ్ఎల్ రెండింటికీ మూలధన ఆస్తులు, రైతు చెల్లించే అద్దెలను కలిపితే వచ్చేదే సీ2.
- వీటికి తోడు పలు ఇతర అంశాలను కూడా సీఏసీపీ పరిగణలోకి తీసుకుంటుంది. ఉదాహరణకు సాగు వ్యయం ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంటుంది. ప్రతి క్వింటా పంట దిగుబడికి అయ్యే వ్యయమూ అంతే. అలాగే మార్కెట్ ధరలు, వాటి ఒడిదొడుకులు, కూలీల వ్యయం తదితరాలు కూడా ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. వీటన్నింటితో పాటు సదరు పంట ఎగుమతులు, దిగుమతులు, మొత్తం నిల్వలు, డిమాండ్, తలసరి వినియోగం, ప్రాసెసింగ్ పరిశ్రమ ధోరణులు తదితరాలన్నింటినీ ఎంఎస్‌పీ లెక్కింపు కోసం సీఏసీపీ పరిగణనలోకి తీసుకుంటుంది.

స్వామినాథన్ సిఫార్సులు...

- అన్ని పంటలకూ ఎంఎస్‌పీ హామీ ఇస్తూ చట్టం తేవాలి. ఎంఎస్‌పీ మొత్తం పంట సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50 శాతం ఎక్కువగా ఉండాలి (దీన్ని సీ2+50 పద్ధతిగా పిలుస్తారు).
- రైతు ఆత్మహత్యలను అరికట్టేలా భూమి, నీరు, సేంద్రియ వనరులు, రుణం, బీమా, టెక్నాలజీ, పరిజ్ఞానం, మార్కెట్ల వంటి మౌలిక సదుపాయాలు వారందరికీ అందుబాటులో తేవాలి.
- రాష్ట్రాల జాబితాలో ఉన్న వ్యవసాయాన్ని ఉమ్మడి జాబితాలో చేర్చాలి.
- రైతు, వినియోగదారుల మధ్య ప్రత్యక్ష సంబంధం ద్వారా మెరుగైన ధర కల్పించాలి.
- వ్యవసాయోత్పత్తుల సేకరణ, ప్యాకేజింగ్, బ్రాండింగ్ స్థానిక, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల ప్రమాణాలకు తగ్గట్టు ఉండాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్

రెండో రోజూ ఉద్రిక్తత

- పంజాబ్–హరియాణా శంభు బోర్డర్ వద్ద యుద్ధ వాతావరణం
- రైతులు, పోలీసుల మధ్య ఘర్షణ
- డ్రోన్లతో బాష్పవాయువు గోళాలు ప్రయోగించిన పోలీసులు



శంభు సరిహద్దు వద్ద భద్రతా బలగాలతో ఘర్షణకు దిగిన రైతులు

చండీగఢ్: డిమాండ్ల సాధన కోసం రైతు సంఘాలు తలపెట్టిన 'చలో ఢిల్లీ' ఉద్రిక్తతలు వరుసగా రెండో రోజు బుధవారం సైతం కొనసాగాయి. ఢిల్లీకి చేరుకోకుండా రైతులను పోలీసులు ఎక్కడికక్కడ నిలువరించారు. పంజాబ్–హరియాణా శంభు సరిహద్దులో మళ్లీ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం ఇక్కడికి చేరుకున్న వేలాది మంది రైతులు రాత్రంతా ట్రాక్టర్లపైనే ఉండిపోయారు. బుధవారం ఉదయం రక్షణ వలయాన్ని ఛేదించుకొని, ఢిల్లీవైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేసి, తమను అడ్డుకున్న పోలీసులపై నిరసనకారులు ఆగ్రహావేశాలతో రాళ్లు విసిరారు. అప్రమత్తమైన పోలీసులు వారిని చెదరగొట్టడానికి డ్రోన్లతో బాష్ప వాయువు గోళాలు ప్రయోగించారు. ఇలాంటి ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి. శంభు బోర్డర్‌లో రోజంతా యుద్ధ వాతావరణం కనిపించింది. పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. హరియాణా ప్రభుత్వం రాష్ట్రంలో పలు జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఢిల్లీకి చేరుకొని తమ గళం వినిపించడం తథ్యమని, ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రైతులు తేల్చిచెప్పారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్న తమ డిమాండ్‌లో ఎలాంటి మార్పు లేదని, ఈ విషయంలో ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని రైతు సంఘం నేత జగజీత్ సింగ్ దలీవాల్ చెప్పారు. మరోవైపు, ఢిల్లీ సరిహద్దుల్లోనూ బుధవారం ఉద్రిక్తత కొనసాగింది. రైతులను పోలీసులు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.

డ్రోన్లను కూల్చడానికి పతంగులు

శంభు బోర్డర్ వద్ద పోలీసులు ప్రయోగించిన డ్రోన్లను నేల కూల్చడానికి కొందరు యువ రైతులు వినూత్న ప్రయత్నం చేశారు. పతంగులు ఎగురవేశారు. పతంగుల దారాలతో డ్రోన్లను బంధించి, కూల్చివేయాలన్నదే వారి ఆలోచన. డ్రోన్లతో నిరసనకారులపై పోలీసులు బాష్పవాయువు గోళాలు ప్రయోగించడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శంభు సరిహద్దులో హరియాణా పోలీసులు డ్రోన్లు ప్రయోగించడం పట్ల పంజాబ్ పోలీసులు అభ్యంతరం తెలిపారు. తమ రాష్ట్ర భూభాగంలోకి డ్రోన్లను పంపొద్దని స్పష్టం చేశారు. తమ ఆందోళన కొనసాగిస్తామని, గురువారం పంజాబ్‌లో పలు ప్రాంతాల్లో రైలు పట్టాలపై బైఠాయిస్తామని రైతు సంఘాల నాయకులు చెప్పారు.

నేడు మూడో దశ చర్చలు!

రైతుల డిమాండ్ల విషయంలో రైతు సంఘాలతో నిర్మాణాత్మక చర్చలకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా బుధవారం చెప్పారు. చర్చలకు సానుకూల వాతావరణం కల్పించాలని, నిరసన కార్యక్రమాలు విరమించాలని రైతులకు సూచించారు. అసాంఘీక శక్తుల వలలో చిక్కుకోవద్దని చెప్పారు. కేంద్ర మంత్రులు, రైతు సంఘాల నేతల మధ్య ఇటీవల జరిగిన రెండు దశల చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. చర్చలకు ఇరుపక్షాలు సముఖంగా ఉన్నాయి. మూడో దశ చర్చలు గురువారం మధ్యాహ్నం చండీగఢ్‌లో జరుగనున్నట్లు తెలిసింది.

పాకిస్తాన్ ప్రధానిగా షహబాజ్ షరీఫ్!

ఆరు పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో రాజకీయ అనిశ్చితికి దాదాపు తెరపడింది. నూతన ప్రధానమంత్రిగా పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) పార్టీ అధినేత, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ తమ్ముడు షహబాజ్ షరీఫ్(72) బాధ్యతలు చేపట్టనున్నారు. తమ పార్టీ అభ్యర్థిగా షహబాజ్ షరీఫ్ పేరును పీఎంఎల్-ఎన్ మంగళవారం రాత్రి హఠాత్తుగా ప్రతిపాదించింది. ప్రధానమంత్రి పదవిని నవాజ్ షరీఫ్ స్వీకరించబోతున్నారని మొదట విస్తృతంగా ప్రచారం జరిగింది. చివరకు అనూహ్యంగా షహబాజ్ షరీఫ్ పేరు తెరపైకి వచ్చింది. పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. దీంతో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. పీఎంఎల్-ఎన్‌తో పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ), ముత్తాహిదా ఖ్వామీ మూవ్‌మెంట్ పాకిస్తాన్(ఎంక్యూఎం-పి), పాకిస్తాన్ ముస్లిం లీగ్-ఖ్వాయిద్(పీఎంఎల్-క్యూ), ఇస్తెఖామ్-ఇ-పాకిస్తాన్ పార్టీ(ఐపీపీ), బలూచిస్తాన్ అవామీ పార్టీ(బీఏపీ) చేతులు కలిపాయి. షహబాజ్ షరీఫ్‌తో ఆయా పార్టీల అగ్రనేతలు సమావేశమయ్యారు. కలిసికట్టుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. తమకు మద్దతు ప్రకటించినందుకు పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ నేతలు అసిఫ్ అలీ జర్దారీ, బిలావల్ భుట్టోకు షెహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

యూపీఎస్‌సీ సివిల్స్ నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్‌సీ) 2024 ఏడాదికి నోటిఫికేషన్‌ను బుధవారం విడుదలచేసింది. సివిల్స్‌లో మొత్తంగా 1,056 పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తుల స్వీకరణనూ యూపీఎస్సీ మొదలుపెట్టింది. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ మార్చి ఐదు. ఆ రోజు సాయంత్రం ఆరింటిలోపు వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. అర్హత గల అభ్యర్థులు అధికార upsconline.nic.in. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రిలిమ్స్ పరీక్ష మే 26వ తేదీన నిర్వహించనున్నారు. మెయిన్స్ పరీక్షలు సెప్టెంబర్ 20వ తేదీ నుంచి ఐదో రోజులపాటు కొనసాగనున్నాయి. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో 150 పోస్టులకూ యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. సివిల్స్ పరీక్ష ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ దశలో జరుగుతుంది. మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూకు పిలుస్తారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రిలిమ్స్ పరీక్ష హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్‌లో జరగనుంది. మెయిన్స్ పరీక్ష హైదరాబాద్, విజయవాడలో జరగనుంది.



రాజ్యసభ నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న సోనియా. చిత్రంలో రాహుల్, ప్రియాంక

రాజ్యసభకు సోనియా నామినేషన్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ మొట్టమొదటిసారి లోక్‌సభ ఎన్నికల సమరం నుంచి వైదొలగి పెద్దలసభ బాటపట్టారు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం సోనియా రాజస్తాన్ నుంచి రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలుచేశారు. బుధవారం జైపూర్‌లో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, పీసీసీ చీఫ్ గోవింద్‌ల సమక్షంలో సోనియా తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఏప్రిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభ సభ్యత్వ పదవీకాలం పూర్తవుతున్న నేపథ్యంలో ఆ స్థానం నుంచే సోనియా బరిలో నిలిచారు. 77 ఏళ్ల సోనియా రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు విజయంసాధించారు. కాగా, మరోసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయబోనని 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోనియా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఆమె పెద్దలసభను ఎంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటకల్లోనూ ఆమె పోటీచేస్తే గెలుపు ఖాయమని తెలిసినా హిందీ భాషా రాష్ట్రాల నుంచి గాంధీలు దూరంకాబోరనే సంకేతం ఇచ్చేందుకే ఆమె రాజస్థాన్‌ను ఎంచుకున్నారని వార్తలొచ్చాయి.

10 మందితో మరో జాబితా

10 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ బుధవారం మరో జాబితా విడుదలచేసింది. బిహార్ నుంచి అఖిలేష్ ప్రసాద్ సింగ్, హిమాచల్ ప్రదేశ్ నుంచి అభిషేక్ మను సింఘ్వీలకు కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులుగా అవకాశం కల్పించింది. మహారాష్ట్ర నుంచి చంద్రకాంత్ హండోర్, కర్ణాటక నుంచి అజయ్ మాకెన్, సయ్యద్ నసీర్ హుస్సేన్, జీసీ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ నుంచి అశోక్ సింగ్, తెలంగాణ నుంచి రేణుకా చౌదరి, ఎం.అనిల్ కుమార్ యాదవ్‌లకు అవకాశమిచ్చింది.

గుజరాత్ నుంచి నడ్డా

12 మంది రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ బుధవారం 12 మంది అభ్యర్థుల జాబితాను బుధవారం ప్రకటించింది. బీజేపీ అధ్యక్షుడితోపాటు ఇద్దరు కేంద్ర మంత్రులు, ఒక్క రోజు ముందు పార్టీలో చేరిన అశోక్ చవాన్ పేరు సైతం ఈ జాబితాలో ఉన్నారు. ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎంపికైన పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాను బీజేపీ ఈసారి గుజరాత్ నుంచి బరిలోకి దింపుతోంది. కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఒడిశా నుంచి, కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్‌కు మధ్యప్రదేశ్ నుంచి చోటు కల్పించింది. అశ్వినీ వైష్ణవ్, మురుగన్‌లు ఈ ఎన్నికల్లో గెలిస్తే రాజ్యసభకు ఎన్నికవడం ఇది రెండోసారి అవుతుంది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్‌ను మహారాష్ట్ర నుంచి రాజ్యసభకు నామినేట్ చేసింది. బీజేపీ విడుదల చేసిన జాబితాలో గుజరాత్ నుంచి గోవింద్‌భాయ్ ధోలాకియా, మయాంక్ భాయ్ నాయక్, జశ్వంత్‌సింగ్ సలాంసింగ్ పర్మార్ ఉన్నారు. మహారాష్ట్ర నుంచి మేధా కులకర్ణి, డాక్టర్ అజిత్ గోప్‌చాడే, మధ్యప్రదేశ్ నుంచి ఉమేశ్‌నాథ్ మహరాజ్, మాయా నరోలియా, బన్సీలాల్ గుర్జర్ ఉన్నారు.

28 మందిలో నలుగురికే మళ్లీ అవకాశం

రాజ్యసభలో పదవీకాలం ముగుస్తున్న 28 మంది పార్టీ ఎంపీల్లో కేవలం నలుగురికి మాత్రమే బీజేపీ మరోసారి అవకాశం ఇస్తోంది. మిగతావారిలో కొందరు ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగే వీలుంది.

ఇండోనేసియా అధ్యక్ష ఎన్నికల్లో ప్రబొవో విజయం

జకార్తా(ఇండోనేసియా): మానవ హక్కులను కాలరాశాడని అప్రతిష్ఠ మూటగట్టుకున్న రక్షణ మంత్రి, మాజీ సైన్యాధికారి ప్రబొవో సుబియాంటో ఇండోనేసియా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించారు. ఇంకా అధికారికంగా వెల్లడికాని ఫలితాల గణాంకాల ప్రకారం ప్రబొవో 57–59 శాతం ఓట్లు సాధించారు. ఇప్పటికే 80 శాతానికిపైగా ఓట్ల లెక్కింపు పూర్తయిన నేపథ్యంలో 72 ఏళ్ల ప్రబొవో గెలుపు దాదాపు ఖాయమైనట్లే. దీంతో దేశ రాజధాని జకార్తాలో ఆయన విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ విజయం మొత్తం ఇండోనేసియన్లదని వ్యాఖ్యానించారు. జాతీయవాద పార్టీ అయిన గెరింద్రా నుంచి ఆయన పోటీచేశారు. 17,000 ద్వీపాల దేశమైన ఇండోనేసియాలో బుధవారం అధ్యక్ష, ఉపాధ్యక్ష, నేషనల్, ప్రావిన్షియల్, రీజినల్, రిజన్సీ, సిటీ స్థాయిలో ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. జాతీయ, స్థానిక ఎన్నికలు ఒకేసారి జరగడం ఇండోనేసియా ప్రత్యేకత.

కేజ్రీవాల్‌కు ఆరోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం అవకతవకల కేసులో ప్రశ్నించేందుకు తమ ఆఫీస్‌కు రావాలంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆరోసారి సమన్లు జారీచేసింది! ఆయన ఒక్కసారి కూడా విచారణకు రాలేదంటూ ఈడీ ఢిల్లీ కోర్టును ఆశ్రయించడం, ఫిబ్రవరి 17న తమ ఎదుట హాజరవాలని కేజ్రీవాల్‌ను కోర్టు ఆదేశించడం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 19వ తేదీన తమ ఆఫీస్‌కు రావాలని ఈడీ బుధవారం ఆరోసారి సమన్లు పంపింది.

కాంగ్రెస్‌ను వీడిన మాజీ ప్రధాని మనవడు

న్యూఢిల్లీ/లక్నో: కాంగ్రెస్ నుంచి నేతల నిష్క్రమణ పర్వం కొనసాగుతోంది. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మనవడు విభాకర్ శాస్త్రి బుధవారం కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. లక్నోలో యూపీ బీజేపీ చీఫ్ భూపేందర్ సింగ్, ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ సమక్షంలో బీజేపీలో చేరారు.

పూలన్ దేవి ముఠా ఊచకోత కేసు...

చిట్టచివరి దోషికి శిక్ష

కాన్పూర్(ఉత్తరప్రదేశ్): అగ్రకులస్తులు తనపై వారాలపాటు సామూహిక అత్యాచారానికి పాల్పడినందుకు ప్రతీకారంగా 20 మంది అగ్రకులస్తులను బందిపోటు రాణి పూలన్ దేవి కాల్చిచంపిన ఉదంతంలో 43 ఏళ్ల తర్వాత తీర్పు వెలువడింది. నాటి హత్యోదంతంలో నిందితులుగా ఉన్న వారిలో శ్యామ్‌బాబు, విశ్వనాథ్ మినహా మిగతావారెవరూ ఇప్పుడు బతికిలేరు. ఈ కేసులో శ్యామ్‌బాబుకు జీవితఖైదు విధిస్తూ దోపిడీల నిరోధక న్యాయస్థానం న్యాయమూర్తి అమిత్ మాలవీయ బుధవారం తీర్పు చెప్పారు. సరైన సాక్ష్యాధారాలు లభించని కారణంగా మిగిలిన ఒకే ఒక్క నిందితుడు విశ్వనాథ్‌ను నిర్దోషిగా కోర్టు విడిచిపెట్టింది. కోర్టు తీర్పు తర్వాత శ్యామ్‌బాబును కాన్పూర్ దెహాత్ జైలుకు తరలించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో తీర్పు ఇన్నాళ్లకు వెలువడింది. ఈ వివరాలను కాన్పూర్ దెహాత్ జిల్లా ప్రభుత్వ న్యాయవాది రాజు పోర్వాల్ వెల్లడించారు. ఆనాడు అగ్రకులస్తులను వరసబెట్టి కాల్చేసిన ఘటనలో బందిపోటు రాణి పూలన్ దేవి సహా 35 మంది నిందితులుగా ఉన్న విషయం తెల్సిందే.

బందిపోటు రాణి.. జైలు జీవితం.. ఎంపీ

సరిగ్గా 43 సంవత్సరాల క్రితం అంటే 1981 ఫిబ్రవరి 14వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని రాజ్‌పూర్ పోలీస్‌స్టేషన్ కాన్పూర్ దెహాత్ పరిధిలోని బెహ్మాయి గ్రామంలో 20 మందిని పూలన్ దేవి ముఠా కాల్చిచంపింది. హతమైన వారిలో 17 మంది అగ్రవర్ణ ఠాకూర్‌లు ఉన్నారు. బందిపోటు ముఠా చేతిలో పౌరులు మరణించారంటూ దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో నాటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి వీపీ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. అణగారిన వర్గానికి చెందిన తనపై ఇద్దరు అగ్రకులస్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడినందుకు ప్రతీకారంగా ఆ అగ్రకులం వారిని హతమార్చాక రెండేళ్లకు మధ్యప్రదేశ్‌లో పూలన్ దేవి పోలీసులకు లొంగిపోయారు. 1994 వరకు జైలులో గడిపారు. తర్వాత కొద్దికాలానికి రాజకీయాల్లో చేరి పార్లమెంట్ సభ్యురాలు అయ్యారు. 1996, 1999 లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. తమ వర్గీయులను చంపేసిందన్న కక్షతో కొందరు పూలన్‌దేవి హత్యకు కుట్ర పన్నారు. మిర్జాపూర్ లోక్‌సభ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ ఎంపీగా పూలన్ కొనసాగుతున్న కాలంలో లోక్‌సభ నుంచి తిరిగొస్తుండగా ఆమెను హత్యచేశారు. 2001 జూలై 25వ తేదీన పూలన్ దేవిని ఢిల్లీలోని ఆమె నివాసం బయట ముగ్గురు పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో విచక్షణారహితంగా కాల్చి చంపారు. పూలన్ దేవి విషాదగాథను రచయిత మాలాసేన్ 'ఇండియాస్ బందిట్ క్వీన్: ది ట్రూ స్టోరీ ఆఫ్ పూలన్ దేవి' అని గ్రంథస్తం చేయగా దానిని ప్రముఖ దర్శకుడు శేఖర్ కపూర్ సినిమాగా తీశారు.



బుధవారం త్రివర్ణ శోభితంగా వెలిగిపోతున్న బుర్జ్ ఖలీఫా

సమీకృత, అవినీతిరహిత ప్రభుత్వాలు కావాలి

దుబాయ్‌లో ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ



సదస్సులో ప్రసంగిస్తున్న మోదీ

దుబాయ్: సమీకృత, అవినీతిరహిత ప్రభుత్వాలు ప్రపంచానికి అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. 'కనిష్ఠ ప్రభుత్వం, గరిష్ఠ పాలన' తమ మంత్రమన్నారు. బుధవారం దుబాయ్‌లో బుధవారం ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రజల జీవితాల్లో ప్రభుత్వ జోక్యం సాధ్యమైనంత తక్కువగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం లేదనే భావన ప్రజలకు కలగకూడదని, ప్రభుత్వాల ఒత్తిడి వారిపై ఉండకూడదని అన్నారు. భారత్‌లో కొన్నేళ్లుగా ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం పెరుగుతోందని చెప్పారు. ప్రజల మనోభావాలకు ప్రాధాన్యమివ్వడం వల్లే ఇది సాధ్యమైందని వివరించారు. అనంతరం దుబాయ్ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్–మక్తూమ్‌తో మోదీ సమావేశమయ్యారు.

అమెరికాలో భారతీయ కుటుంబం

అనుమానాస్పద మృతి

న్యూయార్క్: కేరళకు చెందిన ఒక కుటుంబం అమెరికాలోని సొంతింట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతులను ఆనంద్ సుజిత్ హెన్రీ, భార్య అలీస్ ప్రియాంక, వారి నాలుగేళ్ల కవల కుమారులుగా గుర్తించారు. కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాన్ మాటియోలో తల్లిదండ్రుల్లో ఒకరు పిల్లలకు విషమిచ్చి, తర్వాత జీవిత భాగస్వామిని కాల్చిచంపి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. స్థానికుల యోగక్షేమాలను తెల్సుకునే 'వెల్ఫేర్ చెక్'లో భాగంగా అధికారులు ఈ కుటుంబం గురించి ఆరాతీయగా కొద్దిరోజులుగా ఆ ఇంట్లోకి రాకపోకలే లేవని ఇరుగుపొరుగు వారు చెప్పారు. దీంతో కిటికీ గుండా లోనికి ప్రవేశించిన పోలీసులు బాత్‌రూమ్‌లో భార్యాభర్తల, పడకగదిలో చిన్నారుల మృతదేహాలను గుర్తించారు. భార్యాభర్తలకు బేధాభిప్రాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. భార్య నుంచి విడాకులు కోరుతూ ఆనంద్ సుజిత్ 2016లో దరఖాస్తుచేశారు. ఘటనాస్థలిలో 9ఎంఎం పిస్టల్, బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి హైదరాబాద్

గురువారం ׀ 15 ׀ ఫిబ్రవరి ׀ 2024





మనోహరం.. మహిషాసుర మర్దనం

నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న జాతీయ పుస్తక ప్రదర్శనకు అనూహ్య స్పందన వస్తోంది. రవ్వా శ్రీహరి వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆహ్లాదపరుస్తున్నాయి. బుధవారం విద్యార్థినులు ప్రదర్శించిన మహిషాసుర మర్దని నృత్య రూపకం ఆద్యంతం ఆకట్టుకుంది.

జ్యువెలరీ దుకాణంలో దోపిడీ

మిట్ట మధ్యాహ్నం వేళ రెచ్చిపోయిన దొంగలు

- ముఖానికి మాస్కులతో వచ్చిన ఇద్దరు దుండగులు
- మరో వ్యక్తి సైతం సహకరించినట్లు అనుమానం
- ముమ్మరంగా గాలిస్తున్న చాదర్‌ఘాట్ పోలీసులు



జ్యువెలరీ షాపును పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో/చాదర్‌ఘాట్: నగరం నడిబొడ్డున ఉన్న చాదర్‌ఘాట్ ప్రాంతంలోని ఓ జ్యువెలరీ దుకాణంలో బుధవారం మిట్ట మధ్యాహ్నం దోపిడీ దొంగలు చెలరేగిపోయారు. ముఖాలకు మాస్కులు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు.. కత్తులతో దాడి చేసి ఆభరణాలు దోచుకెళ్లిపోయారు. వీరికి మరో వ్యక్తి సహకరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందం రంగంలోకి దిగిందని, వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్ ఆధారంగా ముందుకు వెళ్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వై.ప్రకాష్‌రెడ్డి తెలిపారు. నగరానికి చెందిన మహ్మద్ ఉల్ రెహ్మాన్ చాదర్‌ఘాట్‌లోని అక్బర్‌బాగ్ చౌరస్తాలో కిస్వా జ్యువెలర్స్ పేరుతో వెండి, బంగారం నగల విక్రయం దుకాణం నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ఆయన కుమారుడు సజావుర్ రెహ్మాన్ దుకాణంలో ఉన్నారు.

నంబర్‌ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై వచ్చి..

1.20 గంటల సమయంలో దుకాణానికి వచ్చిన ఓ యువకుడు తనకు వెండి గొలుసు కావాలని రెహ్మాన్‌ను అడిగాడు. అతను గొలుసులు చూపిస్తున్న క్రమంలో ముఖానికి మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై వచ్చి దుకాణం వద్ద ఆగారు. 1.30 గంటల ప్రాంతంలో దుకాణం లోపలకు ప్రవేశిస్తూనే తమ వద్ద ఉన్న కత్తులు బయటకు తీశారు. వెండి గొలుసులు పరిశీలిస్తున్న కస్టమర్‌ను పక్కను తోసేసి సజావుర్‌పై దాడికి ప్రయత్నించారు. వీరిని అడ్డుకునే క్రమంలో ఆయన ఎడమ చెవి, ఎడమ చేయికి గాయాలయ్యాయి. ఆ షాక్ నుంచి బాధితుడు కోలుకోకముందే అక్కడ ఉన్న కొన్ని బంగారు ఆభరణాలు తీసుకుని ఉడాయించారు.

సీసీ కెమెరాల దృశ్యాలతో ముమ్మరంగా దర్యాప్తు..

- స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలితో పాటు వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన అంశాల ఆధారంగా ఇద్దరు దుండగులు పాతబస్తీ వైపు నుంచి కామాటిపురా, డబీర్‌పురా ఫ్లైఓవర్ మీదుగా వచ్చారని, దోపిడీ చేసిన తర్వాత అదే మార్గంలో వెళ్లినట్లు గుర్తించారు. వీరు దుకాణంలో చొరబడటానికి ముందు వినియోగదారుడిగా వచ్చిన యువకుడు కూడా ఈ ముఠాలో సభ్యుడే అని పోలీసులు అనుమానిస్తున్నారు.
- దోపిడీ దొంగలు అతడి జోలికి వెళ్లకపోవడం, దోపిడీని అతడు అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడంతో ఈ కోణంలోనూ అనుమానిస్తున్నారు. నేరం జరిగిన తర్వాత కూడా ఆ యువకుడు దుకాణం వద్ద నుంచి కొద్దిదూరం నడిచి వెళ్లాడు. అక్బర్‌బాగ్ చౌరస్తా సమీపంలో ఆటో ఎక్కి మలక్‌పేట డీ మార్ట్ వద్ద దిగాడు. అక్కడ నుంచి మరో ఆటో ఎక్కి మీర్‌చౌక్ వరకు వెళ్లాడు. ఆపై అతడి ఆచూకీ లేకుండాపోవడం పోలీసుల అనుమానాలకు బలాన్నిస్తోంది. ఘటనాస్థలికి వచ్చిన సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ జానకీ ధరావత్, మలక్‌పేట ఏసీపీ జి.శ్యామ్‌సుందర్ వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి పరిస్థితి నిలకడగా ఉంది. దోపిడీ దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందం ముమ్మరంగా గాలిస్తోంది. దోపిడీకి గురైన బంగారం విలువ పోలీసు రికార్డుల ప్రకారం రూ.5 లక్షలుగా ఉండగా.. వాస్తవానికి మరింత ఎక్కువ ఉంటుందని తెలుస్తోంది.

న్యూస్‌రీల్

ఇన్‌కాయిస్ సేవలు నిరుపమానం

- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



నిజాంపేట్: మహా సముద్రాలలో భారత్ కార్యకలాపాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇందుకోసం ఇన్‌కాయిస్ అవసరమైన అన్ని పద్ధతులనూ పాటిస్తోందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. బుధవారం ప్రగతినగర్‌లోని ఇన్‌కాయిస్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో కిరణ్ రిజిజు పాల్గొన్నారు. ఇందులో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన సినర్జిస్టిక్ ఓషన్ అబ్జర్వేషన్ ప్రిడిక్షన్ సర్వీసెస్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశానికి సేవ చేసేందుకు నిరంతరాయంగా కృషి చేస్తున్న ఇన్‌కాయిస్ బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ బ్ల్యూ ఎకానమీ కార్యక్రమాలకు ఇన్‌కాయిస్ సేవలు ఎంతగానో దోహదపడుతున్నాయని గుర్తు చేశారు. సముద్రాల గురించి తెలుసుకోవాలనుకునే విద్యార్థులకు నగరంలోని ఇన్‌కాయిస్ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్, ఇన్‌కాయిస్ డైరెక్టర్ టి.శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్ పూలింగ్‌పై మార్గదర్శకాలు రూపొందించండి

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అత్యంత కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్స్ తగ్గించడానికి కార్ పూలింగ్‌కు సంబంధించి మార్గదర్శకాలు రూపొందించాలని బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) కంపెనీల సీఈఓలు కమిషనర్ అవినాష్ మహంతిని కోరారు. గచ్చిబౌలిలోని పోలీసు కమిషనరేట్‌లో బుధవారం జరిగిన సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (సీఎస్‌సీఎస్) సమావేశంలో దాదాపు 20 కంపెనీలకు సంబంధించిన సీఈఓలు పాల్గొన్నారు. ఎస్‌సీఎస్‌సీ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రాధాన్యం ఇవ్వాల్సిన అంశాలపై చర్చించడానికి నిర్వహించిన ఈ సమావేశంలో ట్రాఫిక్ విభాగం సంయుక్త పోలీసు కమిషనర్ డి.జోయల్ డెవిస్ పాల్గొన్నారు. రద్దీ వేళల్లో ఒక్కసారిగా రోడ్ల పైకి వస్తున్న వాహనాల కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయన్న బీఎఫ్ఎస్ఐ సీఈఓలు అభిప్రాయపడ్డారు. దీనికి పరిష్కారంగా కార్ పూలింగ్ తప్పనిసరి చేయాలని కోరారు. నానాటికీ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై దృష్టి పెట్టాలని కోరిన సీఈఓలు.. ఆ కోణంలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

బల్దియా బదిలీలు!

డీసీలకు స్థానచలనం

- 10 మంది ఇన్.. 12 మంది ఔట్
- పైరవీలకే ప్రాధాన్యమని ఆరోపణలు

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జీహెచ్‌ఎంసీలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ల (డీసీ) బదిలీలు జరిగాయి. జీహెచ్‌ఎంసీ సర్కిళ్లలో డిప్యూటీ కమిషనర్లే ఇతర మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో కమిషనర్లుగానూ వ్యవహరిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు విడతలుగా జరిగిన మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాల నుంచి పదిమంది జీహెచ్‌ఎంసీకి బదిలీ కాగా, జీహెచ్‌ఎంసీ నుంచి పన్నెండుమందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు.

ఇతర ప్రాంతాల నుంచి జీహెచ్‌ఎంసీకి..

ఇతర ప్రాంతాల నుంచి జీహెచ్‌ఎంసీకి వస్తున్న వారిలో ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎ.శైలజ, సంగారెడ్డి కమిషనర్ ఎ.సుజాత, జహీరాబాద్ కమిషనర్ డి.సుభాష్‌రావు, బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి, జడ్చర్ల కమిషనర్ మహ్మద్ షేక్, గజ్వేల్ కమిషనర్ ఎస్. విద్యాధర్, తెల్లాపూర్ కమిషనర్ వి.సమ్మయ్యలున్నారు. వీరితో పాటు పోస్టింగ్స్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఎండీ ఖాదర్ మొయినుద్దీన్, నళినీ పద్మావతి, కె.సత్యనారాయణలున్నారు. వీరిలో నళినీ పద్మావతి, సత్యనారాయణ గతంలో జీహెచ్‌ఎంసీలోనూ డిప్యూటీ కమిషనర్లుగా, ఇతర విభాగాల్లో పనిచేసిన వారే కావడం విశేషం. తాజాగా జీహెచ్‌ఎంసీ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారిలో డిప్యూటీ కమిషనర్లు బి.చంద్రశేఖర్, డి.బాలయ్య, బి.శ్రీనివాస్, శంకర్, సూర్యకుమార్, అసిస్టెంట్స్ ఎస్టేట్ ఆఫీసర్ సీహెచ్. వేణు, ఏఈఓ డి.లావణ్య, ఏఎంసీ జె.ఉమ, సెక్రటరీ కె.లక్ష్మిలతో పాటు ఆయా విధులు నిర్వహిస్తున్న ఎం. మంగతాయారు, ఎండీ యూసుఫ్, తాజ్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.



పైరవీలకే ప్రాధాన్యం?

ఎన్నికల బదిలీల్లోనూ పైరవీలు చేసుకున్న వారికే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్ వంటి వారికి సైతం మున్సిపల్ కమిషనర్ల పోస్టులిచ్చారు. మున్సిపల్ కమిషనర్ హోదా వారున్నప్పటికీ వారిని కాదని ఇతరులకు కమిషనర్ల పోస్టులిచ్చారని చెబుతున్నారు. పలువురిని మెహిదీపట్నం, మీర్‌పేట, బోడుప్పల్, యాదాద్రి, బొల్లారం, తెల్లాపూర్, జడ్చర్ల, జవహర్‌నగర్, జీహెచ్‌ఎంసీ వంటి ఇరుగుపొరుగు ప్రాంతాలకే బదిలీ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకుగాను భారీయెత్తున ముడుపులు చేతులు మారాయని చెబుతున్నారు. ఎన్నికల బదిలీల పేరిట ఎన్నికల సంఘం మార్గదర్శకాలతో పాటు వాటి పరిధిలో లేని ఇతరులను కూడా అధికసంఖ్యలో బదిలీలు చేశారని, ఈ బదిలీల పేరిట కోరుకున్న కొందరికి కావాల్సిన చోట పోస్టింగ్‌లిచ్చారనీ ఆరోపణలు కొనసాగుతున్నాయి.

పోస్టింగులిచ్చిన కమిషనర్..

జీహెచ్‌ఎంసీ నుంచి ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల నుంచి జీహెచ్‌ఎంసీకి మున్సిపల్ కమిషనర్ల బదిలీల నేపథ్యంలో.. బదిలీపై వచ్చి జీహెచ్‌ఎంసీలో రిపోర్ట్ చేసిన వారికి కమిషనర్ రోనాల్డ్ రాస్ డిప్యూటీ కమిషనర్లు (డీసీ)గా పోస్టింగులిచ్చారు. వివరాలిలా ఉన్నాయి. పంచాయతీరాజ్ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన డిప్యూటీ సీఈఓ జకియా సుల్తానాను ఎల్‌బీనగర్ డీసీగా నియమించారు. ఎ.సుజాత (సరూర్‌నగర్), సీహెచ్.నాగేశ్వరరావు (మెహిదీపట్నం), జి.వేణుగోపాల్ రెడ్డి (సికింద్రాబాద్), శివకుమార్ (సంతోష్‌నగర్), ఎస్.విద్యాధర్ (గోషామహల్) వి.సమ్మయ్య (బేగంపేట), ఎండీ ఖాదర్ మొహియుద్దీన్ (ముషీరాబాద్), తిప్పర్తి యాదయ్య (హయత్‌నగర్) జి.ఆంజనేయులును ఉప్పల్ డీసీగా నియమించారు. జీహెచ్‌ఎంసీలోని వివిధ సర్కిళ్లలో డీసీలుగా ఉన్న పి.రవీందర్‌కుమార్, టి.దశరథ్, సీహెచ్. అరుణకుమారి, ఎ.నాగమణిలను కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి జీహెచ్‌ఎంసీకి వచ్చిన వారిలో ఎ.శైలజ, ఎండీ షేక్, డి.సుబాష్‌రావులను కూడా కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

రాంగ్ రూట్‌లో వచ్చి చంపేశాడు!

రోడ్డు ప్రమాదంలో చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దుర్మరణం

- నారాయణగూడ ఎక్సైజ్ ఎస్‌ఐకి స్వల్ప గాయాలు
- రాంగ్ రూట్లో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు
- ఎల్‌బీనగర్‌లో మంగళవారం అర్ధరాత్రి దుర్ఘటన



ప్రమాదానికి కారణమైన కారు

నాగోలు: రాంగ్ రూట్లో వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మొహమ్మద్ సాదిక్ అలీ మృతి చెందారు. నారాయణగూడ ఎక్సైజ్ ఎస్‌ఐ ఖాజావలీ మోహినుద్దీన్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ దుర్ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన మొహమ్మద్ సాదిక్ అలీ (40) నగరంలోని మూసారంబాగ్‌లో ఉన్న ఆంధ్రా కాలనీ ప్రభుత్వ క్వార్టర్స్ 'ఎ' బ్లాక్‌లో భార్య షాహేదా, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉంటున్నారు. 2017 నుంచి చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన పని చేస్తున్నారు. సాదిక్ అలీ నివసించే క్వార్టర్స్‌లోనే నారాయణగూడ ఎక్సైజ్ ఎస్‌ఐ ఖాజావలీ మోహినుద్దీన్ అలియాస్ బాబా ఉంటున్నారు. వీరిద్దరూ స్నేహితులు. మంగళవారం రాత్రి ఇరువురూ కలిసి ఎల్‌బీనగర్‌లో జరిగిన వివాహానికి హాజరయ్యారు. తిరిగి 11.40 గంటలకు ద్విచక్ర వాహనంపై మూసారంబాగ్‌కు వస్తున్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంప్ వద్ద.. రాంగ్ రూట్లో వేగంగా వచ్చిన ఓ కారు.. వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మొహమ్మద్ సాదిక్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి. ఖాజావలీ మోహినుద్దీన్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మొహమ్మద్ సాధిక్ అలీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఖాజావలీ మోహినుద్దీన్ చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కారును అక్కడే వదిలేసి పారిపోయాడు. ఈ కారుపై ఓవర్ స్పీడ్ చలానాలు ఉన్నాయి. పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. మృతుడు సాదిక్ అలీ సోదరుడి ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు మొహమ్మద్ సాదిక్ అలీ (ఫైల్)



చికిత్స పొందుతున్న ఖాజావలీ మోహినుద్దీన్

యువనేతకు జాక్‌పాట్!

కాంగ్రెస్ నుంచి పెద్దల సభకు అనిల్‌కుమార్ యాదవ్

- నాడు తండ్రి లోక్‌సభకు.. నేడు రాజ్యసభకు కుమారుడు
- ఎన్‌ఎస్‌యూఐ నుంచి రాజకీయ ప్రస్థానం మొదలు
- అనూహ్య రీతిలో అభ్యర్థిత్వం ఖరారు చేసిన అధిష్టానం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన యువనేత, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్ పెద్దల సభ జాక్‌పాట్ కొట్టేశారు. కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ నుంచి రాజ్యసభకు అనిల్ కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. రాజ్యసభ సభ్యుల విషయంలో అనూహ్యంగా అనిల్ కుమార్ పేరు తెరపైకి వచ్చింది. యువజన కోటాలో యువతను ఆకట్టుకునే విధంగా ప్రాధాన్యం కల్పించినట్లు తెలుస్తోంది. అనిల్‌కుమార్ యాదవ్ తండ్రి అంజన్ కుమార్ యాదవ్ గతంలో సికింద్రాబాద్ స్థానం నుంచి లోక్‌సభకు వరుసగా రెండుసార్లు ఎన్నిక కాగా.. తాజాగా ఆయన తనయుడు అనిల్‌కుమార్ యాదవ్ రాజ్యసభకు వెళ్లనుండటం విశేషం.

రాజకీయ అరంగేట్రం ఎన్‌ఎస్‌యూఐ నుంచి..

విద్యార్థి దశలోనే కాంగ్రెస్ విద్యార్థి అనుబంధ సంస్థ ఎన్ఎస్‌యూఐతో రాజకీయ అరంగ్రేటం చేసిన అనిల్ కుమార్ యాదవ్ రాజ్యసభ సభ్యుడి ఎంపిక వరకు ఎదిగారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ సమన్వయ కర్తగా, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి, ఉపాధ్యక్షుడిగా, యూత్ కాంగ్రెస్‌కు ఎన్నికల ద్వారా మొదటి రాష్ట్ర అధ్యక్షుడిగా, ఆ తర్వాత జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయన పని చేశారు. ప్రస్తుతం సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ స్థానం నుంచి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నుంచి తండ్రి అంజన్ కుమార్ పోటీ చేయడంతో అనిల్‌కుమార్‌కు అవకాశం దక్కలేదు. గత పదేళ్లుగా పార్టీ పరంగా అనేక ప్రజా ఆందోళన కార్యక్రమాల్లో అనిల్‌కుమార్ కీలక పాత్ర పోషించారు. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న అనిల్.. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై ఆశలు పెట్టుకోగా.. ఊహించని విధంగా రాజ్యసభకు ఎంపిక కానున్నారు.



కష్టపడితే పదవులు ఖాయం: అనిల్ కుమార్ యాదవ్

కాంగ్రెస్ పార్టీలో జెండా మోస్తూ కష్టపడే వారికి పదవులు దక్కుతాయనడానికి నేనే ఉదాహరణ. తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిత్వానికి నా పేరు ప్రకటించడం పట్ల కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు చెబుతున్నా. రాజ్యసభ అవకాశం ఇస్తారని నేను ఎప్పుడూ ఊహించలేదు. కొత్త రక్తాన్ని రాజకీయాల్లోకి తేవడమే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ లక్ష్యంగా కనిపిస్తోంది.

సరేనంటారా.. సారీ అంటారా!

కంటోన్మెంట్‌ల విలీనంపై వడివడిగా అడుగులు

- తుది దశకు చేరిన 12 కంటోన్మెంట్‌ల విలీన ప్రక్రియ
- సికింద్రాబాద్ విషయంలో కదలికలేని వైనం
- సీఎం రేవంత్‌రెడ్డి స్పందనపైనే స్థానికుల ఆశలు

కంటోన్మెంట్: దేశవ్యాప్తంగా ఉన్న కంటోన్మెంట్‌లను వీటి సమీపంలోని మున్సిపాలిటీల్లో విలీనం చేసే దిశగా కేంద్రం వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ ప్రక్రియ ప్రారంభించి దాదాపు ఏడాది గడుస్తుండగా ఇప్పటికే గతేడాది ఒక కంటోన్మెంట్ పూర్తిగా కనుమరుగైపోయింది. తాజాగా మరో 12 కంటోన్మెంట్‌ల విలీనానికి సంబంధించిన ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. సెంట్రల్ కమాండ్, సదరన్ కమాండ్‌లలోని 6 చొప్పున 12 కంటోన్మెంట్‌లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఏర్పాటు చేసిన కమిటీల సూచనలకు అనుగుణంగా విలీన ప్రక్రియపై ఆయా బోర్డులు తీర్మానం చేసి బుధవారం నాటికి ప్రతిపాదనలు పంపాలని రక్షణ శాఖ సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది జనవరిలో సికింద్రాబాద్‌తోనే ఈ ప్రక్రియ ప్రారంభం అయినప్పటికీ ఇప్పటికీ ఎలాంటి కదలికా లేకుండాపోయింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు నియమించిన కమిటీ సమావేశం మినిట్స్ కూడా ఇప్పటి వరకు బహిర్గతం కాకపోవడం గమనార్హం.



ప్రకటనలకే పరిమితం..

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీ విలీనం చేయాలంటూ అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ పలుమార్లు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా కంటోన్మెంట్‌లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసే దిశగా కేంద్రం నిర్ణయం తీసుకుని 2022లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో దేశంలోనే తొలి విలీన కమిటీ ఏర్పాటైంది. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు, రక్షణ శాఖ ఉన్నతాధికారులు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అధికారులతో 2023 జనవరి 4న కమిటీ నియమితమైంది. నెల రోజుల్లోనే నివేదిక ఇవ్వాల్సిందిగా కమిటీకి సూచించారు. ఒక్కసారి మాత్రమే భేటీ అయిన సదరు కమిటీ నివేదిక ఇప్పటికీ బహిర్గతం కాలేదు.

డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధం చేయాలని..

ఇదిలా ఉండగానే.. గతేడాది ఖ్యాస్ యోల్ కంటోన్మెంట్ విలీన ప్రక్రియ ముగిసింది. అనంతరం మిగతా కంటోన్మెంట్‌లకు సంబంధించి కూడా కమిటీలు ఏర్పాటయ్యాయి. ఆయా కమిటీలు పదే పదే భేటీ అయి ఇచ్చిన నివేదికల ఆధారంగా మరో 12 కంటోన్మెంట్‌ల విలీనం తుది అంకానికి చేరుకుంది.

రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తేనే..

పుణే, కిర్కీ కంటోన్మెంట్‌ల విలీనానికిసంబంధించి మంగళవారం ఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్ విషయంలో మాత్రం ఎలాంటి కదలిక లేకపోవడంతో విలీనంపై ఆశలు పెట్టుకున్న స్థానికులు నిరాశకు గురవుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. రెండు నెలల క్రితం వరకు బోర్డులో ప్రత్యేక ఆహ్వానితుడిగా కొనసాగిన అప్పటి ఎంపీ, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, ప్రస్తుతం సీఎం సెక్రటరీగా కొనసాగుతున్న కంటోన్మెంట్ మాజీ సీఈఓ అజిత్ రెడ్డి చొరవ చూపితేనే విలీన ప్రక్రియ వేగం పుంజుకునే అవకాశం ఉంది.

సెంట్రల్ కమాండ్ పరిధిలోని ఫతేఘడ్, డెహ్రాడూన్, షాజహాన్‌పూర్, క్లైమెంట్ టౌన్, రామ్‌గఢ్, మథుర, సదరన్ కమాండ్ పరిధిలోని దేవ్‌లాలీ, బబినా, మోరార్, నసీరాబాద్, అజ్మీర్, సాగర్ కంటోన్మెంట్‌లలోని సివిల్ ఏరియాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసే విషయంలో బుధవారం నాటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధం చేయాల్సిందిగా రక్షణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాకేశ్ కుమార్ షా సంబంధిత అధికారులకు సూచించారు.



మురిపించిన ముద్దుగుమ్మలు

నగలతో వగలొలికించారు. వయ్యారి సోయగాలతో హొయలు పోయారు. స్నిగ్ధ సింగారాలతో ముగ్ధలు మురిపించారు. బుధవారం నగరంలోని హెచ్ఐసీసీ నోవాటెల్ వేదికగా ప్రారంభమైన హైలైఫ్ ఎగ్జిబిషన్‌లో నటీమణులు వర్షిణీ సౌందర్ రాజన్, స్రవంతి చొకరోపు, చాందినీ భగవన్ నానైలతో పాటు ఇతర ముద్దుగుమ్మలు తమ అందచందాలతో ఆకట్టుకున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

రాత్రి మిస్సింగ్.. తెల్లారేసరికి శవమై..

బాలుడి అనుమానాస్పద మృతి


కార్తీక్ (ఫైల్)


కార్తీక్ మృతదేహం

బంజారాహిల్స్: అనుమానాస్పదస్థితిలో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గాభవానీనగర్ బస్తీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–5లోని దుర్గాభవానీనగర్ బస్తీకి చెందిన మునావత్ కార్తీక్ (10) సెయింట్ మేరీస్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. మంగళవారం రాత్రి ఆడుకునేందుకు వెళుతున్నట్లు తల్లిదండ్రులు రమేష్, కవితకు చెప్పి బయటికి వెళ్లాడు. అతను తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టారు. కాగా బుధవారం ఉదయం సమీపంలోని జీహెచ్ఎంసీ పార్కులోని నాలాలో కార్తీక్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు అతడు ఎలా మృతి చెందాడనే విషయమై దర్యాప్తు చేపట్టారు. వరదనీటి కాలువ పైకప్పు లేకపోవడంతో ప్రమాదవశాత్తూ అందులో పడి మృతి చెంది ఉంటాడా? ఇంకేదైనా కారణం ఉందా? అనే కోణంలో విచారణ చేపట్టారు. రాత్రి అదృశ్యమైన కుమారుడు తెల్లారేసరికి విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్ల నరికివేతపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: క్రికెట్ మైదానం నిర్మాణం పేరిట పచ్చని వృక్షాల నరికివేతపై కారణాలను తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు అధికారులు, అనధికారిక ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీబీహెచ్)లో ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం 100కు పైగా చెట్లను నరికివేసేందుకు మార్కింగ్ చేయగా, వాటి ఫౌండేషన్ అధికారులను సంప్రదించింది. పలు చర్చల తర్వాత వాటిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మణికొండ పంచాయతీలో ట్రాన్స్ లొకేట్ చేశారు. ఇప్పుడు పచ్చగా పెరిగిన ఈ చెట్లను క్రికెట్ మైదానం కోసం నరికివేయడంపై వాటి ఫౌండేషన్ హైకోర్టును ఆశ్రయించింది. 70 చెట్లను రీ లొకేట్ చేయగా.. 40 చెట్లను ఇప్పటికే నరికేశారని తెలిపింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, జీహెచ్ఎంసీ కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ కమిషనర్, సర్పంచ్‌కు నోటీసులు జారీ చేసింది.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


వెంకటకుమార్ (ఫైల్)

నాగోలు: అనుమానాస్పద స్థితిలో భవనం పైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఎల్‌బీనగర్, ఆర్టీసీకాలనీకి చెందిన వెంకటకుమార్(41), కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మంగళవారం అతడి ఇంటికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు వెంకటకుమార్‌ను బయటికి తీసుకెళ్లి రాత్రి వదిలేసి వెళ్లారు. బుధవారం మరో ముగ్గురు వ్యక్తులు అతడి ఇంటికి వచ్చి తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని భవనం మూడో అంతస్తుకు తీసుకెళ్లి అతనిపై మరోసారి దాడి చేశారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన అతడి భార్య అనిత వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆమెపై కూడా దాడికి యత్నించారు. వారు వెళ్లిన కొద్దిసేపటికే వెంకటకుమార్ భవనం పైనుంచి కింద పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు., అనిత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తన భర్తను డబ్బుల విషయమై నవీన్, మరి కొందరు దాడి చేసి భవనంపై నుంచి తోసి హత్య చేశారని ఆమె ఆరోపించింది.

సందర్శకుల వేళల్లోనూ బాధితుల కోణమే!

- గతంలో సాయంత్రం వేళల్లోనే సీపీని కలిసే అవకాశం
- దీంతో కింది వారిని కలవాలంటే మర్నాడే అవకాశం
- దీనిని గుర్తించిన సైబరాబాద్ కమిషనర్ మహంతి
- ఉదయం వేళకు మారుస్తూ నిర్ణయం
- తన అధికారాల వికేంద్రీకరణపై ప్రత్యేక కసరత్తు



సాక్షి, సిటీబ్యూరో: ప్రతి పోలీసు కమిషనర్ వద్దకు విజిటర్స్‌గా పిలిచే బాధితులు, ఫిర్యాదుదారులు వస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఆయా కమిషనరేట్లలో వీరి కోసం ప్రత్యేకంగా విజిటింగ్ అవర్స్ కేటాయిస్తారు. సాధారణంగా సాయంత్రం వేళల్లోనే ఇవి ఉంటాయి. తద్వారా బాధితులకు కలుగుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి తన విజిటింగ్ అవర్స్‌ను మధ్యాహ్నానికి మార్చారు. మరోపక్క సైబరాబాద్ కమిషనర్‌కు ఉండే అధికారాలనూ వికేంద్రీకరిస్తున్నారు. దీనిపై ప్రస్తుతం ప్రత్యేక కసరత్తు జరుగుతోంది.

42 పీఎస్‌లు..16 ట్రాఫిక్ ఠాణాలు

సైబరాబాద్ కమిషనరేట్ మూడు రెవెన్యూ జిల్లాల పరిధిలో 3680 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించి ఉంది. దాదాపు 95 లక్షల జనాభాతో 42 శాంతిభద్రతల విభాగం పోలీసుస్టేషన్లు, 16 ట్రాఫిక్ ఠాణాలు ఇందులో ఉన్నాయి. ఒక పార్లమెంట్ నియోజకవర్గం పూర్తిగా, మూడు నియోజకవర్గాల్లో కొంత భాగం సైబరాబాద్‌లో ఉన్నాయి. ప్రత్యేక సందర్భాలు మినహాయిస్తే... మిగిలిన సమయాల్లో కడ్తాల్ నుంచి మేడ్చల్ వరకు ఉన్న ప్రాంతాల్లోని బాధితులు/ఫిర్యాదు దారులకు గచ్చిబౌలిలోని కమిషనరేట్‌లో మాత్రమే సీపీ అందుబాటులో ఉంటారు. ఈ నేపథ్యంలోనే ఆయనను కలవడానికి వచ్చే అర్జీదారులు ప్రత్యేకంగా రావాల్సిందే.

రెండు రోజులు అవసరం లేకుండా...

సైబరాబాద్‌లోనూ ఒకప్పుడు విజిటింగ్ అవర్స్ సాయంత్రం వేళల్లో ఉండేవి. కమిషనరేట్ వరకు వచ్చే విజిటర్లలో అత్యధికులు మళ్లీ మరో కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. మేడ్చల్ శివారు నుంచి బాధితుడు తనకు ఎదురైన సమస్యను చెప్పుకోవడానికి సీపీ వద్దకు వస్తే ఆయన విషయాన్ని పరిశీలించిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత డీసీపీ, ఏసీపీలకు ఆదేశిస్తూ విజిటర్‌ను అక్కడకు వెళ్లమని సూచిస్తారు. సాయంత్రం వేళల్లో విజిటింగ్ అవర్స్ ఉంటే... ఈ విజిటర్స్ కమిషనర్‌కు కలిసి బయటికి వచ్చే సమయానికే దాదాపు కార్యాలయాల పని గంటలు పూర్తవుతాయి. దీంతో డీసీపీ, ఏసీపీలను కలవడానికి అతను మర్నాడు లేదా మరో రోజు కేటాయించాల్సి వస్తుంది. దీంతో బాధితుడు రెండు రోజులు తన ఫిర్యాదు కోసమే వెచ్చించాల్సిన పరిస్థితులు ఉన్నట్లు గుర్తించిన ఆయన తన వద్దకు వచ్చిన విజిటర్ అదే రోజు సంబంధిత కింది స్థాయి అధికారినీ కలిసేందుకు వీలుగా విజిటింగ్ అవర్స్‌ను మధ్యాహ్నం 12 గంటలకు మార్చారు. దీనివల్ల గరిష్టంగా మధ్యాహ్నం 3 గంటల్లోపు బాధితుడు కమిషనర్‌ను కలుస్తున్నాడు. ఆయన సిఫార్సు చేస్తే అదే రోజు సంబంధిత డీసీపీ, ఏసీపీలను కలిసే అవకాశం ఉంటోంది. ఉదయం కమిషనరేట్ వద్దకు చేరుకునే బాధితులకు టోకెన్లు జారీ చేస్తున్న సిబ్బంది ప్రాధాన్యత క్రమంలో సీపీని కలిసే అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం సైబరాబాద్ కమిషనర్ వద్దకు వచ్చిన బాధితుల్లో 90 శాతం మంది భూ వివాదాల ఫిర్యాదులనే తీసుకువస్తున్నారు.

సీసీఎస్‌కు ఠాణా హోదా...

సైబరాబాద్ పరిధిలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌కు (సీసీఎస్) పోలీస్‌స్టేషన్ హోదా లభించింది. ఈ మేరకు ప్రభుత్వం గత వారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఎకనమికల్ అఫెన్సెస్ వింగ్‌గా (ఈఓడబ్ల్యూ) ఉన్న ఈ విభాగానికి కేసులు నమోదు చేసే అధికారం లేదు. కేవలం ఠాణాల్లో నమోదైన కేసుల దర్యాప్తును పర్యవేక్షించేది. భారీ మోసాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు ఠాణాల్లోని అధికారులకు సాధ్యం కాదు. దీంతో సీసీఎస్‌కు ఠాణా హోదా ఇవ్వాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు ఆ మేరకు ఉత్తర్వులు పొందారు. సైబరాబాద్ సీసీఎస్ రూ.3 కోట్ల కంటే ఎక్కువ మొత్తంతో ముడిపడిన స్కాములపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది. దీనికి సంబంధించి ఠాణాలకు వచ్చిన ఫిర్యాదులూ ఇక్కడికి బదిలీ అవుతాయి. మరోపక్క ఇప్పటి వరకు కేవలం పోలీస్ కమిషనర్‌కు మాత్రమే ఉన్న కొన్ని అధికారాలను అవినాష్ మహంతి వికేంద్రీకరిస్తున్నారు. సిబ్బంది ఇతర రాష్ట్రాలకు వెళ్లడానికి అనుమతి ఇవ్వడం, చిన్న చిన్న ఈవెంట్స్‌కు సంబంధించిన అనుమతుల జారీ తదితరాలను ఇప్పటికే డీసీపీలకు అప్పగించారు. మరికొన్నింటినీ వికేంద్రీకరించేందుకు ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నారు.

ఒత్తిడిని అధిగమించాలి


మాట్లాడుతున్న స్వాతి లక్రా

వెంగళరావునగర్: విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడి ఎదుర్కొనే పోలీసు ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని టీఎస్ఎస్‌పీ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా అన్నారు. యూసుఫ్‌గూడలోని ఫస్ట్ బెటాలియన్‌లో మూడు వారాలుగా కొనసాగుతున్న మిత్ర షేర్ అండ్ షైన్ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వాతి లక్రా మాట్లాడుతూ మిత్ర క్యాంప్‌లో నేర్చుకున్న విషయాలను తోటి అధికారులు, పోలీసు సిబ్బందికి వివరించాలని సూచించారు. నేర్చుకున్న ప్రతి అంశాన్ని తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం మిత్రలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ, అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ కె.పి.సత్యనారాయణ, ఆర్ఐలు ధర్మారావు, శంకర్, జాఫత్, ఆర్ఎస్ఐలు, ఫస్ట్ బెటాలియన్ సిబ్బంది, అమృత వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నడుస్తున్న కారులో మంటలు



పంజగుట్ట: నడుస్తున్న కారులో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో నిత్యం ఎంతో రద్దీగా ఉండే పంజగుట్ట సర్కిల్ వద్ద వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. మల్లేపల్లికి చెందిన సికిందర్ అనే వ్యక్తి బుధవారం రిడ్జ్ కారులో ఎర్రమంజిల్ నుండి పంజగుట్ట వైపునకు వెళుతుండగా పంజగుట్ట సమీపంలోని స్వయంవర్ బట్టల దుకాణం వద్దకు రాగానే కారు ఇంజిన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ కారు దిగి ప్రాణాలు కాపాడుకున్నాడు. స్థానిక వ్యాపారులు మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటికే కారు ఇంజిన్, లోపల ముందు, వెనక సీట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. పోలీసులు మంటలు ఆర్పి కారును స్టేషన్‌కు తరలించారు. ఈ కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఇంటర్‌లో ఆంగ్ల భాషా నైపుణ్యాలపై పరీక్ష

సాక్షి,సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈ ఏడాది నుంచి ఆంగ్లంలో ప్రయోగ పరీక్ష నిర్వహించనుంది. ప్రథమ సంవత్సరం విద్యార్థులందరూ తప్పనిసరిగా ఈ పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. మొత్తం 80 మార్కులు థియరీకి కేటాయించగా ప్రయోగ పరీక్షలకు 20 మార్కులు కేటాయించారు. నాలుగు దశల్లో నిర్వహించే ఈ పరీక్షల్లో కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణులవుతారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మూడు విడుతల్లో ప్రయోగ పరీక్షలు జరిగాయి. చివరి పరీక్ష ఈ నెల 16న నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు జరిగిన మూడు దశల్లో ప్రయోగాలకు హాజరుకాని వారికి నాలుగో విడతలో అవకాశం కల్పించారు. వీరందరికీ ఆంగ్ల ప్రయోగ పరీక్షను తరగతి గదిలోనే భాషా సామర్థ్యాల పరిశీలనతో నిర్వహించనున్నారు. . కమ్యూనికేషన్ ఫంక్షన్ మొదటి దశలో ఏదైనా ఒక అంశంపై ఇద్దరు, అంత కంటే ఎక్కువ మంది విద్యార్థులు సంభాషించుకునే తీరును ఆధ్యాపకులు పరీక్షిస్తారు. రెండో దశలో ఒక అంశంపై నిమిషం పాటు అనర్గళంగా మాట్లాడాలి. మూడో దశలో ఓ అంశంపై విద్యార్థులు బృందంగా చర్చించాలి. ఈనెల 16న నాలుగో దశలో గ్రహించే శక్తి పెంపొందించడంపై అధ్యాపకులు పరీక్షిస్తారు. వీటితో పాటు రికార్డు బుక్ ఉంటేనే వారి ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయిస్తారు.

19న పర్యావరణ విద్య

ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నైతికత– మానవ విలువలు పర్యావరణ విద్య పరీక్ష నిర్వహించనున్నారు. గతంలో అనుత్తీర్ణులైన వారికి ఈనెల 17న నిర్వహిస్తారు. 19న నిర్వహించే పర్యావరణ విద్య పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు సైతం హాజరుకావాల్సిందే.

ప్రతి ఒక్కరూ హాజరుకావాలి

ఇంటర్ స్థాయి నుంచే ఆంగ్లంపై విద్యార్థులు పట్టు సాధించేందుకు ఈ ఏడాది నుంచి విద్యాశాఖ ఆంగ్ల ప్రయోగ పరీక్షను ప్రవేశపెట్టింది. ఈనెల 16న నిర్వహించనున్న ఆంగ్ల ప్రయోగ పరీక్షకు విద్యార్థులందరూ తప్పకుండా హాజరుకావాలి. జనరల్ విద్యార్థులకు 20 మార్కులు, ఒకేషనల్ విద్యార్థులకు 10 మార్కులు ఉంటాయి. ప్రతి విద్యార్థి హాజరయ్యే విధంగా కళాశాల ప్రిన్సిపాల్స్, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలి.

–డి. ఒడ్డెన్న, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి, హైదరాబాద్

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు


నిందితుడు బాలకృష్ణ

చిక్కడపల్లి: భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవితఖైదు విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పు చెప్పింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రజని, జి.బాలకృష్ణ దంపతులు బాగ్‌లింగంపల్లి అచ్చయ్యనగర్‌లో నివాసం ఉండేవాడు. బాలకృష్ణ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. ఆమెను పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో 2013 సెప్టెంబర్ 27న రాత్రి తన భార్య రజనిని కత్తితో పొడిచి హత్య చేశాడు. చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నాంపల్లి మూడో అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి జె.కవిత వాదోపవాదాల అనంతరం బాలకృష్ణకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. బాధితుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అల్లూరి రామిరెడ్డి వాదనలు వినిపించారు.

బంగారంతో ఆయుర్వేద మందులు

తయారు చేస్తానంటూ మోసం

నగలు, నగదుతో పరారీ

వెంగళరావునగర్: బంగారంతో ఆయుర్వేద మందులు తయారు చేస్తానని ఓ నకిలీ వైద్యుడు ఓ మహిళ నుంచి నగలు, నగదు తీసుకుని ఉడాయించిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మోతీనగర్‌కు చెందిన వాసా ఛాయాదేవి గత 20 ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఆమె ఇంటి సమీపంలో ఉంటున్న వ్యక్తి ఆమె వద్దకు వచ్చి వెంగళరావునగర్‌లోని ధన్వంతరి ఆయుర్వేద కేంద్రంలో వైద్యం చేయించుకుంటే రోగం నయం అవుతుందని సలహా ఇచ్చాడు. దీంతో ఆమె గత ఏడాది నవంబర్‌లో ఆయుర్వేద కేంద్రానికి వెళ్లింది. డాక్టర్ ఆనంద్ అనే వ్యక్తి ఆమెను పరీక్షించి బంగారంతో మందులను తయారు చేయాలని, తప్పకుండా నయం అవుతుందని, లేని పక్షంలో మీరు చెల్లించే ఫీజు మొత్తం రెట్టింపు ఇస్తానని నమ్మించాడు. దీంతో ఆమె మూడు తులాల బంగారం, మరో రూ.1.70 లక్షల చెక్కు ఇచ్చింది. కొద్దిరోజుల తర్వాత స్వర్ణ భస్మం, చూర్ణం తయారు చేయాలని మరో రూ.1.30 లక్షల నగదు తీసుకున్నాడు. అనంతరం హిరాయుక్తరాస్ పేరుతో మరో మందు కొనుగోలు చేయాలంటూ రూ.3.50 లక్షల నగదు తీసుకుని మందులు ఇచ్చాడు. అయితే నెలలు గడుస్తున్నా జబ్బు నయం కాకపోవడంతో ఆమె మంగళవారం ధన్వంతరీ ఆయుర్వేద కేంద్రానికి వెళ్లగా, అక్కడ ఆయుర్వేద వైద్యశాల కనిపించలేదు. స్థానికులను విచారించగా ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు తెలిపారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు బుధవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలోనూ డాక్టర్ ఆనంద్ కోకాపేటకు చెందిన సచిన్‌గుప్తా అనే వ్యక్తి నుంచి రూ. 3.80 లక్షలు తీసుకుని ఉడాయించాడు.

భారతీయ మార్కెట్‌లోకి

మొదటి సోడియం అయాన్ బ్యాటరీలు..

- ఆవిష్కరించిన సోడియం ఎనర్జీ సంస్థ..
- 500 రెట్లు అధిక సామర్థ్యాలతో పర్యావరణానికి హాని లేకుండా రీసైక్లింగ్



సాక్షి, సిటీబ్యూరో: భద్రత ప్రమాణాలే ప్రాముఖ్యతగా వినూత్న సాంకేతికతతో తయారు చేసిన దేశంలోనే మొట్ట మొదటి శక్తివంతమైన సోడియం అయాన్ బ్యాటరీలను 'సోడియం ఎనర్జీ సంస్థ' విడుదల చేసింది. బుధవారం నగరంలోని మెర్క్యూరీ హోటల్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో సోడియం ఎనర్జీ సహ–వ్యవస్థాపకులు బాల పచియప్ప బ్యాటరీలను భారతీయ మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న లెడ్ యాసిడ్, లిథియం అయాన్ బ్యాటరీల కంటే సోడియం అయాన్ బ్యాటరీలు అధిక శక్తి సామర్థ్యాలను కలిగి ఉంటాయన్నారు. 2026 నాటికి విద్యుత్ నిల్వల అవసరం 5 రెట్లు పెరుగుందని, అధిక జనాభా ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. భద్రత, నాణ్యత, వేగవంతమైన చార్జింగ్‌తో ఈ బ్యాటరీలు అధునాతన సేవలందిస్తాయని పేర్కొన్నారు. లిథియం కన్నా సోడియం 500 రెట్లు అధిక సామర్థ్యాలతో పర్యావరణానికి హాని లేకుండా రికవరీ, రీసైక్లింగ్‌కు అనుకూలంగా ఉంటాయన్నారు. అనంతరం సోడియం అయాన్ బ్యాటరీలతో నడిచే వాహనాల పనితీరును ప్రత్యక్షంగా ప్రదర్శించారు.

ఎనిమిది దశాబ్దాల హైదరాబాద్

నగర చరిత్ర 'హృదయరాగం'

హృదయరాగం పుస్తకావిష్కరణ సభలో పలువురు వక్తలు

కవాడిగూడ: ఎనిమిది దశాబ్దాలుగా జరిగిన హైదరాబాద్ నగర చరిత్రను తెలుసుకోవాలంటే హృదయరాగం పుస్తకం చదివితీరాల్సిందేనని పలువురు వక్తలు అన్నారు. గద్దర్ ప్రాంగణంలో జరుగుతున్న 36వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో రవ్వా శ్రీహరి వేదికపై బుధవారం బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పగిడిపాల ఆంజనేయులు రచించిన హృదయరాగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ దర్శకులు బి. నర్సింగ్‌రావు, సాక్షి నెట్‌వర్క్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.నర్సింగ్‌రావు మాట్లాడుతూ.... హైదరాబాద్ నగర చరిత్ర తెలుసుకోవాలంటే సీనియర్ జర్నలిస్టు ఆంజనేయులు రాసిన హృదయరాగం పుస్తకాన్ని చదవాలన్నారు. 1987లో తాను తీసిన 'ది. సిటీ డాక్యుమెంటరీని హృదయ రాగం పుస్తకం గుర్తు చేసిందన్నారు. విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ..... వృత్తిపరంగా వర్కింగ్ జర్నలిస్టుకు రోజువారీ ప్రయాణంలో అనేక ఒత్తిడులు ఉంటాయని, వాటిని అధిగమించి సీనియర్ జర్నలిస్టు ఆంజనేయులు పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. మానవహక్కుల నేత జీవన్‌కుమార్ మాట్లాడుతూ... హైదరాబాద్ నగరం అనేక సాంస్కృతి సంప్రదాయాల సమ్మేళనం అన్నారు. పుస్తక రచయిత పగిడిపాల ఆంజనేయులు మాట్లాడుతూ... 'సాక్షి' దినపత్రిక యాజమాన్యం సహకారంతోనే ఈ పుస్తకం రాయడం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో సామాజిక వేత్త రియాజ్, బుక్‌ఫెయిర్ కార్యదర్శి ఆర్ వాసు, ఉపాధ్యక్షులు కోయ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.


హృదయరాగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బి.నర్సింగ్‌రావు, జూలూరి గౌరీశంకర్ తదితరులు

సరస్వతీ నమస్తుభ్యం..

- వైభవంగా వసంత పంచమి వేడుకలు
- సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు
- చిన్నారులకు అక్షరాభ్యాసం
- పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- పెద్ద ఎత్తున హాజరైన చిన్నారులు


పూజల్లో పాల్గొన్న బంజారాహిల్స్‌లోని సాయిరాం స్కూల్ విద్యార్థులు

బంజారాహిల్స్: చదువుల తల్లి సరస్వతీ దేవి పుట్టిన రోజును వసంతి పంచమిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. వసంతి పంచమి సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని శ్రీ సాయిరాం హైస్కూల్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు...

ఫిలింనగర్ దైవసన్నిధానంలోని వసంతి పంచమి సందర్భంగా శ్రీ సరస్వతీ దేవిగా అమ్మవారిని అలంకరించారు. సాయంత్రం సహస్ర నామార్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఫిలింనగర్‌లోని రాజరాజేశ్వరీదేవి

సందడిగా సామూహిక అక్షరాభ్యాసం


శ్రీసాయిసరస్వతి విద్యానికేతన్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

వెంగళరావునగర్: శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సరస్వతీదేవి విగ్రహానికి చిన్నారులతో ప్రత్యేక పూజలు చేయించారు. బాసరలో అమ్మవారి పాదాల దగ్గర పూజించిన కుంకుమ, సరస్వతీ అమ్మవారి యంత్రాలను చిన్నారులకు పంపిణీ చేశారు. స్కూల్ చైర్మన్ శిరీష భవానీశంకర్, ప్రధానోపాధ్యాయురాలు ఉషా మీనాక్షి, టీచర్లు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల బరిలో మాజీ సైనికులు


పార్టీ రిజిస్ట్రేషన్ పత్రాలు చూపుతున్న మాజీ సైనికులు

పంజగుట్ట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ సైనికులు ఏర్పాటు చేసిన వీరో కె వీర్ ఇండియన్ పార్టీ తరపున భారతదేశ వ్యాప్తంగా మొత్తం 543 స్థానాల్లో అభ్యర్థులను నిలుపుతున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజేశ్వర్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నుంచి తెలంగాణలో నిలబడబోయే ఐదుగురు అభ్యర్థుల జాబితా ప్రకటించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజేశ్వర్ నిజామాబాద్ నుంచి, మల్కాజిగిరి నుంచి పి.సత్యనారాయణ స్వామి, చేవెళ్ల నియోజకవర్గం నుంచి పి.పెంటారెడ్డి, నల్లగొండ నుంచి పెదమాను సైదులు, మహబూబ్‌నగర్ నుంచి ఎమ్.ఆర్.కె.రెడ్డిలు అభ్యర్థులుగా బరిలో ఉంటామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 17 స్థానాల్లో పోటీలో ఉంటామని దేశవ్యాప్తంగా 543 స్థానాల్లో కేవలం మాజీ సైనిక ఉద్యోగులే అభ్యర్థులుగా ఉంటారన్నారు. దేశంకోసం ప్రాణాలు ఇచ్చేందుకు వెనకాడని మాజీ సైనికులం తిరిగి ప్రజలకోసం ఏదైనా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ గుజరాత్‌లో ఆవిర్భవించిందని తమ జాతీయ అధ్యక్షులు లాల్‌జీభాయ్ బాదర్ ఆదేశాలమేరకే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు.

గుండె జబ్బులపై అవగాహనకు 'ది బ్రౌన్ హార్ట్'

బంజారాహిల్స్: గుండె జబ్బులతో బాధపడుతున్న భారతీయులలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో 'ది బ్రౌన్ హార్ట్' డాక్యుమెంటరీ చిత్రీకరిస్తున్నట్లు ఇండో అమెరికన్ ఫిల్మ్ మేకర్, ఫిజిషియన్ డాక్టర్ నిర్మల్ జోషి తెలిపారు. బంజారాహిల్స్‌లోని విరించి హాస్పటల్ చైర్మన్ డాక్టర్ ప్రతీక్ భట్నాగర్‌తో కలిసి బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల్ జోషి మాట్లాడుతూ ప్రపంచంలోని అగ్రశ్రేణి గుండె నిపుణులతో మాట్లాడి డాక్యుమెంటరీ చిత్రీకరించే పనిని చేపట్టానన్నారు. ప్రపంచంలోనే భారతదేశం అత్యుత్తమ వైద్యులను కలిగి ఉందన్నారు. వీరు భారతదేశంతో పాటు యూకే, యూఎస్ఏ, ఆస్ట్రేలియా తదితర దేశాలలో ప్రాక్టీస్ చేస్తున్నారని చెప్పారు. ఎక్కడ పనిచేసినా దేశానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెస్తున్నారన్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా భారతీయులకు వచ్చే గుండెపోటులో 50 శాతం 50 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్నవారిలో వస్తుందన్నారు. భారతీయులలో గుండె జబ్బులు ఇతరులతో పోలిస్తే 2 నుంచి 4 రెట్లు అధికంగా ఉన్నాయన్నారు. 19, 25, 30 ఏళ్ల ఉన్న వారు కూడా గుండెపోటుతో ఆకస్మికంగా మరణిస్తున్నారన్నారు. డాక్టర్ భట్నాగర్ 19 ఏళ్ల వయస్సులో ఉన్న వ్యక్తికి కూడా శస్త్ర చికిత్స చేశారని, ఆది ఆగాలన్నారు. అందుకే తాను 'ది బ్రౌన్ హార్ట్' పేరుతో డాక్యుమెంటరీని నిర్మించే పనిలో పడ్డానన్నారు. గుండెపోటుకు గల కారణాలను కథారూపంలో తెలియజేస్తున్నామని తెలిపారు.

'సోల్మేట్' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హీరోయిన్ చాందిని భగ్వనాని, చిత్రబృందం

బంజారాహిల్స్: దండుపాల్యం సినిమాకు రచయితగా, కో డైరెక్టర్‌గా పని చేసిన రమేష్ చెంబేటి దర్శకత్వంలో రూపొందించిన నూతన సినిమా సోల్మేట్ సినిమాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం-10లో బుధవారం జరిగింది. సినిమా హీరో శరత్, హీరోయిన్ చాందిని భగ్వనాని చిత్రబృందంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ... రొమాంటిక్ థ్రిల్లర్ జానర్‌లో ప్రయోగాత్మకంగా సాగే ఈ సినిమా అందరి మన్ననలు అందుకుంటుందని అన్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని పూర్తయిన వెంటనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని అన్నారు.

క్రమశిక్షణతో చదివితే పోటీ పరీక్షల్లో విజయం


పూజల్లో నగర అదనపు కలెక్టర్ కదిరవన్, కార్యదర్శి పద్మజ

చిక్కడపల్లి: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు సమయపాలన పాటిస్తూ.. క్రమశిక్షణతో చదవడం, రాయడం ద్వారా విజయం సాధిస్తారని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, నగర అదనపు కలెక్టర్ పలని కదిరవన్ అన్నారు. చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో బుధవారం కార్యదర్శి పొట్లూరి పద్మజ ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలని కదిరవన్ పోటీ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధంపై పలు సూచనలు చేశారు. కార్యదర్శి పద్మజ, ఉద్యోగులు అవినాష్, బొల్లం మహేందర్, సుకేష్, మదన్‌మోహన్, వేంకటేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్, వరప్రసాద్, సుబ్బలక్ష్మి, సీతామహాలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అగ్రిటెక్ ఎగ్జిబిషన్

అమీర్‌పేట: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అగ్రిటెక్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు హార్టికల్చర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. బుధవారం అమీర్‌పేట గ్రీన్‌పార్క్ మ్యారీ గోల్డ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐఐ సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16,17,18వ తేదీల్లో ఎగ్జిబిషన్ ఉంటుందని వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, ఆధునిక పరిజ్ఞానంపై చర్చలు జరుగుతాయన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతు ఏరకమైన పంటలు పండించాలనే దానిపై నిపుణులు వివరిస్తారన్నారు.

బీసీ విద్యార్థులకు రాయితీ కల్పించాలి

కాచిగూడ: ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసిన 'టీఎస్ ఈసెట్ -2024' నోటిఫికేషన్‌తో దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మాదిరిగా బీసీ విద్యార్థులకు దరఖాస్తు రుసుంలో రాయితీ కల్పించాలని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం యూనివర్సిటీ కల్పించిందని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500, ఇతరులకు రూ.900లుగా దరఖాస్తు ఫీజు ఉందని, వివరించారు.

రోడ్డు విస్తరణ పనుల్లో కదలిక

- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 విస్తరణకు సన్నద్ధం
- రోడ్డు పక్కన తొలగించాల్సిన చెట్ల లెక్కింపు
- ఇప్పటికే మంజూరైన నిధులు


బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లో రోడ్డులో చెట్లను లెక్కిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లో రోడ్డు విస్తరణ పనుల్లో కదలిక మొదలైంది. ఈ పనుల్లో భాగంగా రోడ్డుకు రెండువైపులా తొలగించాల్సిన చెట్ల లెక్కింపు ప్రారంభమైంది. విరించి హాస్పటల్ చౌరస్తా నుంచి కమాన్, అగ్రసేన్ చౌరస్తా, జానారెడ్డి నివాసం, తాజ్‌మహల్ హోటల్, సీవీఆర్ న్యూస్ చౌరస్తా, జర్నలిస్ట్ కాలనీ చౌరస్తా, బాలకృష్ణ నివాసం, జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 45 చౌరస్తా మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ఈ రోడ్డు విస్తరణ పనులు జరగనున్నాయి.

- ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర 247 చెట్లను తొలగించి రీ లొకేట్ చేసే యోచనలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు కొన్ని చోట్ల 60 అడుగులు, మరి కొన్ని చోట్ల 80 అడుగులు మాత్రమే ఉన్నాయి. ఈ రోడ్డులో వాహన రద్దీ దృష్ట్యా 100 అడుగుల మేర విస్తరించాలని ప్రతిపాదించడమే కాకుండా ఇందుకు సంబంధించిన డిజైన్‌ను కూడా పూర్తిచేసి నిధులు కూడా మంజూరు చేశారు.
- సంబంధిత అధికారులు గత మూడు వారాల నుంచి రోడ్డు విస్తరణకు సంబంధించి పనులు మొదలుపెట్టారు. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించాలని యోచిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-12 మీదుగా వాహనాల రాకపోకలు మరింత తేలికకానున్నాయి.
- ఇదిలా ఉండగా ఈ రోడ్డు విస్తరణలో భాగంగా ఎన్ని ఆస్తులు తొలగించాల్సి ఉంటుందో లెక్కలు సిద్ధం చేస్తున్నారు. సుమారు 100 ప్రాపర్టీల నుంచి స్థల సేకరణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. విరించి హాస్పటల్ చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చౌరస్తా వరకు మూడు దశల్లో ఈ పనులు చేపట్టనున్నారు. 100 నుంచి 120 అడుగుల మేర రోడ్డును విస్తరించడం ద్వారా స్థానికంగా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అవకాశం ఉంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోడ్ నంబర్-86 11కేవీ ఫీడర్ టోలీచౌకీ సబ్‌స్టేషన్ పరిధిలోని రోడ్ నంబర్-86, రామచంద్రారెడ్డి ఇల్లు, బెల్లంకొండ సురేష్ ఇంటి లైన్, వై.ఎస్.వివేకానంద రెడ్డి ఇంటి లైన్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 23, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 40, కీర 25, దోసకాయ 19, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 21, చామగడ్డ 55, మొరంగడ్డ 18, కందగడ్డ 58, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కుమారస్వామికి ఉత్తమ సేవా అవార్డు

లిబర్టీ: ప్రజా సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్న బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామికి ఉత్తమ సేవా అవార్డు దక్కింది. బుధవారం కుమారస్వామికి తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందించి శాలువాతో సత్కరించి అభినందదించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

లిబర్టీ: ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ. 12 వేలు చెల్లించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు భారతీయ మజ్దూర్ సంఘ్ ఆటో విభాగడం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ప్రతినిధి బృందం బీర్ల ఐలయ్యను కలిసి ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆయా సమస్యలను ముఖ్యమంత్రి రేంతర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఐలయ్య హామీ ఇచ్చారు.

సాయినాథుడికి పంచదారతో అభిషేకం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని భవానీనగర్‌లో శ్రీవిశ్వసాయి మందిరంలో జరుగుతున్న మాఘ మాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం బాబా వారికి పంచదారతో అభిషేకం చేశారు. మార్చి 10 వరకు జరిగే మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయిబాబా వారికి ప్రదోష కాలంలో సాయంత్రం 4.15 నుంచి 6 గంటల వరకు విశేష అభిషేక, సహస్రనామ పుష్పార్చనలు నిర్వహిస్తున్నారు.

18న జాతీయ కరాటే పోటీలు


కరాటే పోటీల మెడల్స్ ఆవిష్కరిస్తున్న సినీ హీరో సుమన్

పంజగుట్ట: ప్రతి ఆడపిల్లకు సెల్ఫ్ డిఫెన్స్ తప్పక నేర్పించాలని ప్రముఖ సినీ హీరో సుమన్ తల్వార్ అన్నారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించనున్న 4వ జాతీయ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ, థైక్వాండో చాంపియన్ షిప్స్ 2024 మెడల్స్‌ను ఆయన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ... సమాజంలో మహిళలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నారని, చిన్నచిన్న పిల్లల్ని మానభంగం చేస్తున్నారని ఇలాంటి సమయంలో ఎవర్నివారు కాపాడుకునే సామర్థ్యం పెంపొందించాలన్నారు. కొంత మంది తన ఫొటో పెట్టుకుని వివిధ రకాల ప్రచారాలు చేస్తున్నారని, ఒకరైతే తాను ఎంపీగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారని ఎవరూ అలాంటివి నమ్మరాదని తన ఫొటో ఉంటే కాదు తాను వీడియో తీసి ఏదైనా చెపితేనే నమ్మాలని సూచించారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకురాలు లక్ష్మి సామ్రాజ్యం మాట్లాడుతూ... పోటీల్లో మొత్తం 14 రాష్ట్రల నుండి క్రీడాకారులు పాల్గొంటారని, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, కోచ్‌లు అందరూ కలిసి సుమారు 3వేల మందికి పైగా హాజరు కానున్నట్లు తెలిపారు. అందరికీ ఉదయం నుండి రాత్రి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ మన్సూర్ అహ్మద్, డి.ఆర్.వి.రవి, చిన్న శ్రీశైలం యాదవ్, లలిత, లక్ష్మన్, సంధ్య, వినోద్ కుమార్ టి.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను బుధవారం నటి వర్షిణీ సౌందర్‌రాజన్ నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. నగరవాసులను ఆకట్టుకునే విధంగా పలు రకాల నూతన మోడల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమ్మర్ స్పెషల్ డ్రెస్ మెటీరియల్స్, డ్రెసెస్‌లు ప్రత్యేకంగా ఉన్నాయన్నారు. వివాహాది శుభకార్యాలకు, పండుగలకు నూతన డిజైన్స్ ఆకర్షణగా నిలిస్తున్నాయన్నారు. డిజైనర్లు రూపొందించిన నగలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నటి శ్రవంతి చోకరపు, చాదిని బగ్వానిలతో పలువురు మోడల్స్, డిజైనర్లు తదితరులు పాల్గొన్నారు.

'పుల్వామా' అమర జవానులకు నివాళి



బంజారాహిల్స్: పుల్వామా ఘటనలో అశువులుబాసిన అమర జవానులకు సైఫాబాద్ ఎన్‌సీసీ అధికారులు నివాళులు అమర్పించారు. బుధవారం ఎన్‌సీసీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పల్లాటి నరేష్‌లు హాజరై వీరజవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. దేశ రక్షణలో సైనికుల పాత్ర గొప్పదన్నారు. క్యాడెట్లు కూడా దేశ రక్షణలో పాలుపంచుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ దేశ భక్తిని కలిగి ఉండాలన్నారు. దేశ సైనికులు తమ జీవితం మొత్తం దేశం కోసమే ధారపోస్తారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఘంటసాల గానవిభావరి

చిక్కడపల్లి: సుస్వర సుగణ కళాభారతి, రవిమన్యు ఆర్ట్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో నిర్వహించిన ఘంటసాల గానవిభావరి ఆకట్టుకుంది. అమరగాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రవిమన్యు, మధుబాపుశాస్త్రి, శ్రీనివాస్, సుధీర్‌కుమార్, వేలూరి రామకృష్ణరావు, త్రినాథరావుతోపాటు పలువురు గాయనీగాయకులు గీతాలు ఆలపించారు. నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారులకు జ్ఞాపికలను బహూకరించారు. వంశీ రామరాజు, నిర్వాహకులు రవిమన్యు, బీజేపీ నేత మల్లెపూల వెంకటరమణ, పురుషోత్తంగౌడ్, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు దిగుతూ పడి మహిళ మృతి

కాచిగూడ: రైలు దిగుతూ ప్రమాదవశాత్తు ఓ మహిళ కిందపడి గాయాలతో మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలివీ... తమిళనాడు స్టేట్, మధురై జిల్లాకు చెందిన చిన్నస్వామి భార్య ముత్తు సెల్వీ (22) కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం 5లో చెంగల్పట్టు రైలు దిగుతుండగా.. ప్రమాదవశాత్తు కింద పడింది. తీవ్రంగా గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందింది.

కబ్జా నుంచి ప్రభుత్వ కొండను కాపాడండి


వినతిపత్రం అందజేస్తున్న రమేష్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ జర్నలిస్ట్ కాలనీ ఫేజ్-1లోని ప్రభుత్వ కొండను ధ్వంసం చేసి కబ్జా చేస్తున్నారంటూ కాంగ్రెస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు కాటూరి రమేష్ షేక్‌పేట్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కొండను కాపాడాల్సిందిగా బుధవారం ఆయన వినతి పత్రం అందజేశారు. జర్నలిస్ట్ కాలనీ ఫేజ్-1లోని ఏ-3 నుంచి ఏ-9 వరకు ఉన్న ప్లాట్లను ఆనుకొని కొండలు ఉన్నాయని, కొందరు ప్లాట్ల యజమానులు ఆ కొండలను తవ్వి కబ్జా చేస్తున్నారని తన ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు. అక్కడి ప్లాట్ల యజమానులకు చెందిన ధ్రువపత్రాలను పరిశీలించి వాటి విస్తీర్ణం తెలుసుకుని కబ్జాకు గురైన స్థలాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: డివిజన్‌లోని సంజయ్ గాంధీ నగర్ కాలనీలోని ఓల్డ్ పెన్షన్ ఆఫీస్ వద్ద రూ. 23 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ బుధవారం ప్రారంభించారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సత్వరమే పనులను పూర్తి చేసి రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులను కోరారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు గోపీనాథ్‌రెడ్డి, శైలేష్, అశ్విన్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు జి.రామన్‌గౌడ్, అభిషేక్ పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డేలో విద్యార్థుల సందడి


సంబరాల్లో పాల్గొన్న లక్ష్మణ్‌నాయక్ తదితరులు

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఎమ్మెస్సీ బోటనీ విద్యార్థులు పీజీ మొదటి సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలను సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. భవిష్యత్తు ఉన్నత స్థానానికి చేరుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్ నవనీత, ఛాయ, వెంకటరామన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాటన్ హౌస్ ప్రారంభం


ప్రారంభిస్తున్న దేవనాథ రామానుజ జీయర్ స్వామి

వెంకటేశ్వరకాలనీ: నాణ్యమైన వస్త్రాలకు ప్రసిద్ధిగాంచిన కాటన్ హౌస్ తొలి శాఖను నగరంలో బంజారాహిల్స్ రోడ్ నెం. 14లో ఏర్పాటు చేశారు. ఈ శాఖను శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి నిర్వాహకులకు ఆశీర్వచనాలు అందించారు. నాణ్యమైన ఉత్పత్తులు వినియోగదారులకు అందించి మన్ననలు పొందాలని సూచించారు. నిర్వాహకురాలు అరుణ గౌడ్ మాట్లాడుతూ... వస్త్ర రంగంలో దేశంలోనే పేరు గాంచిన కాటన్ హౌస్ తొలి శాఖను బంజారాహిల్స్‌లో ప్రారంభించామని త్వరలో మరిన్ని బ్రాంచీలు ప్రారంభించేందుకు కృషి చేస్తామని అన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌కు చెందిన బి.మహేష్ చార్టెట్ అకౌంటెంట్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 10వ తేదీ రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి రెండో రోజు మధ్యాహ్నం బయటికెళ్లేందుకు వచ్చాడు. తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కులాంతర వివాహితుల ఆత్మీయ సమ్మేళనం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, కేవీపీఎస్, ఎస్‌వీకే సంయుక్తాధ్వర్యంలో బుధవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కులాంతర వివాహితుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ.. గాలి, నేలకు లేని కులం మనుషులకు ఉండటాన్ని ఆయన ప్రశ్నించారు. కులాంతర వివాహాలు చేసుకున్న ప్రేమికులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని ఆయన కోరారు. ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, రాములు, టీపీఎస్‌కే కన్వీనర్ భూపతి వేంకటేశ్వర్లు, బుచ్చిరెడ్డి, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, సుజావతి తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ ఫెయిర్

సనత్‌నగర్: డాన్‌బాస్కో అనుబంధ సంస్థ దిశ, రంగారెడ్డి డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, నేషనల్ కెరీర్ సర్వీసెస్ సంయుక్తంగా ఈ నెల 16న జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు దిశ కో-ఆర్డినేటర్ ఐవన్ వాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు కొనసాగుతాయన్నారు. దాదాపు 10 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పది, ఇంటర్, డిగ్రీ, జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, జీడీఏ, హోటల్ మేనేజ్‌మెంట్, ఐటీఐ, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరవ్వాలన్నారు.

బాబు ముడుపులకు రోహిత్ వేషం!

సీఎం హోదాలో 'సినిమా'తో వైట్.. బ్లాక్‌గా మళ్లింపు

సినిమా నిర్మాణం పేరుతో నిధుల ప్రవాహం

- రూ.5–6 కోట్ల ఖర్చుతో తూతూమంత్రంగా సినిమాలు
- రూ.30–40 కోట్లు ఖర్చయినట్లు తప్పుడు లెక్కలు
- ఇలా ఆ ఐదేళ్లలో ఫ్లాపు హీరోకు 17 సినిమాల ఛాన్స్‌లు
- ఆ తర్వాత ఇప్పటి దాకా ఒక్క సినిమా కూడా లేని వైనం
- ఖర్చులు పోగా మిగిలిన రూ.300 కోట్లు బాబు ఇంటికి
- టాక్ ఆఫ్ ది సినీ ఇండస్ట్రీగా మారిన వ్యవహారం

బహుశా.. ఇలాంటి ఆలోచన ఎవరికీ వచ్చి ఉండదు. కానీ చంద్రబాబు నాయుడు ఇక్కడ!! ఆయన 'స్కిల్' మామూలుదా!! ముడుపులు పుచ్చుకోవడంలో, తీసుకున్న వాటిని తెలివిగా దారి మళ్లించి తన జేబులోకి తెచ్చుకోవడంలో ఆయన 'స్కిల్స్'ను బయటపెట్టే 'సినిమా' కథ తాజాగా బయటపడింది. ఈ కథకు హీరో ఒక్కడే. బాబు సోదరుడి కొడుకు నారా రోహిత్. నిర్మాతలుగా బయటకు వేరేవారు కనిపించినా... సహ నిర్మాతలుగా, ఫైనాన్షియర్లుగా వ్యవహరించింది మాత్రం బాబు హయాంలో వివిధ ప్రాజెక్టుల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు. తీసిందేమో ఫ్లాపు సినిమాలు. భారీగా నష్టం వచ్చిందంటూ ప్రకటనలు. చంద్రబాబుకు మాత్రం లాభాలే లాభాలు!. అదెలాగని ఆశ్చర్యపోతున్నారా? లంచాలు దిగమింగడంలో బాబు మాస్టర్‌మైండ్‌ను కళ్లకు కట్టినట్లు చూపించే టాలీవుడ్ సినిమాల కథ ఇదిగో...



సాక్షి, హైదరాబాద్: అరె! ఒక్కటంటే ఒక్క సినిమా కూడా రూపాయి లాభం తెచ్చిన పాపాన పోలేదు. ఒక్కటంటే ఒక్కటి కూడా కనీసం బ్రేక్ ఈవెన్ (లాభనష్టాలు లేని స్థితి) సాధించింది లేదు. ప్రతి సినిమాకూ పెట్టిన పెట్టుబడిలో కనీసం 80 శాతం తిరిగి రాలేదని నిర్మాతలే చెబుతున్నారు. అలాగని అవేవీ చిన్న సినిమాలు కావు. అన్నీ 30-40 కోట్ల రేంజి బడ్జెట్ సినిమాలేనట? మరి ఇలా నష్టాలొచ్చినా సరే వదలకుండా అదే హీరోను పెట్టి వరసగా ఏడాదిలో ఆరేడు సినిమాలు తీసేశారంటే ఏమనుకోవాలి? బ్లాక్ మనీ దండిగా ఉన్నవాళ్లు కూడా నేరుగా డబ్బును కాల్చేయటం ఎందుకున్న ఉద్దేశంతో ఇలాంటి సినిమాలు తీయరు. కానీ నారా రోహిత్‌తో మాత్రం కొందరు నిర్మాతలు పదేపదే ఫ్లాప్ సినిమాలు తీశారు. ఫ్లాపు సినిమాలిచ్చిన దర్శకులతోనే మళ్లీ మళ్లీ ఫ్లాపు సినిమాలు తీశారు. ఒకసారి దర్శకత్వం వహించి ఫ్లాపు సినిమా ఇచ్చిన వ్యక్తి అదే హీరోతో మరో సినిమాకు నిర్మాతగా కూడా మారాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

బాబు హయాంలో 17 సినిమాలు

- ప్రతినిధి (2014)
- రౌడీ ఫెలో, అసుర, తుంటరి, సావిత్రి (2015)
- రాజా చెయ్యి వేస్తే, జో అచ్యుతానంద, శంకర, అప్పట్లో ఒకడుండేవాడు (2016)
- శమంతకమణి, ఒక్కడు మిగిలాడు, కథలో రాజకుమారి, బాలకృష్ణుడు, మెంటల్ మదిలో (2017)
- నీది నాది ఒకే కథ, ఆటగాళ్లు, వీరభోగ వసంతరాయలు (2018)

ఇదీ... 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక సినీతారగా మారిపోయిన 'నారా రోహిత్' కథ. విచిత్రమేంటంటే రోహిత్‌కు 2014కు ముందు పెద్దగా సినిమాలు లేవు. 2019లో చంద్రబాబు అధికారంలో నుంచి దిగిపోయాక కూడా సినిమాలు లేవు. కానీ 2014-1019 మధ్య మాత్రం ఏకంగా 17 సినిమాలు వచ్చాయి. అంటే... బాబు అధికారానికీ, నారా రోహిత్ సినిమాలకూ ఏదో సంబంధం ఉందనేగా అర్థం. అది ఏ సంబంధమంటే... ముడుపుల సంబంధం. బ్లాక్ మనీ సంబంధం బాబు ప్రభుత్వంలో కాంట్రాక్టులు పొందిన వ్యక్తులు, సంస్థలు ఆయనకు నేరుగా ముడుపులివ్వటానికి ఇబ్బంది పడ్డారు. జీఎస్టీ వచ్చాక కాంట్రాక్టర్లకు మొత్తం బిల్లులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే చెల్లించాల్సి వచ్చింది. దీంతో వారు ఆ డబ్బుల్లో నుంచి ఎవరికి ఎంత చెల్లించినా ఐటీకి లెక్కలు చెప్పాల్సి వచ్చేంది. మరి బాబుకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వడమెలా? దీనికోసం మాస్టర్ మైండ్ చంద్రబాబు ఒక మార్గం కనిపెట్టాడు. తన తమ్ముడు రామ్మూర్తి నాయుడి కొడుకు నారా రోహిత్‌ను హీరోగా పెట్టి సినిమాలు తీయాల్సిందిగా తెలిసిన నిర్మాతలు, దర్శకులకు పురమాయించాడు. దానికి కావాల్సిన డబ్బులు మాత్రం ఈ కాంట్రాక్టర్లు, తన ప్రభుత్వంలో లబ్ధి పొందిన వాళ్లు సహ నిర్మాతల రూపంలోనో, ఫైనాన్సియర్లగానో చెల్లిస్తారు. ఓ 5 కోట్లతో పూర్తయ్యే సినిమాకు ఏకంగా రూ.40 కోట్ల బడ్జెట్ కేటాయించటమే కాక... అంతా ఖర్చుపెట్టినట్లు చూపిస్తారు. వాస్తవంగా రూ.5 కోట్లు ఖర్చయితే.... మిగతా రూ.35 కోట్లు నేరుగా బాబు బంగళాకు చేరిపోతాయి. ఇక ఈ సినిమా ఎలాగూ ఐదారు కోట్ల కన్నా ఎక్కువ వసూలు చేయదు. దీంతో తాము భారీగా నష్టపోయామని నిర్మాతలు ప్రకటిస్తారు.

ఇదీ... రోహిత్ ఫ్లాపుల కథ

నారా రోహిత్ యావరేజ్ నటుడు. 2009 నుంచి 2014 వరకు.. అంటే చంద్రబాబు సీఎం కుర్చీలో లేని ఆ ఐదేళ్లలో అతను నటించిన సినిమాలు నాలుగే,. బాణం (2009), సోలో (2011), సారొచ్చారు (2012), ఒక్కడినే (2013). మొదటి రెండూ యావరేజ్ కాగా, మిగిలిన రెండూ డిజాస్టర్లు. దాంతో రోహిత్‌కి సినిమా అవకాశాలు తగ్గిపోయాయి. అయితే ఏడాది తర్వాత చంద్రబాబు సీఎం కాగానే రోహిత్ ముఖ 'చిత్రం' మారిపోయింది. హిట్ హీరోలకు సైతం సాధ్యం కాని స్థాయిలో వరుస పెట్టి సినీ అవకాశాలొచ్చాయి. 2019లో బాబు దిగిపోయేనాటికి ఏకంగా 17 సినిమాలు. అన్నీ ఫ్లాపులు, డిజాస్టర్లే. నిజానికి వీటిలో చాలా సినిమాలు రిలీజ్ అయిన సంగతి కూడా ప్రేక్షకులకు తెలీదు. మళ్లీ 2019లో చంద్రబాబు దిగిపోయినప్పటి నుంచి ఈ రోజు వరకు ఒక్కటంటే ఒక్క సినిమా కూడా రోహిత్ చేయలేదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇలా, అలా తిప్పి.. కొడుకు చేతికి డబ్బులు

ఒక ప్రాజెక్టు నిర్మించిన కాంట్రాక్టరుకు ప్రభుత్వం రూ.500 కోట్లు బ్యాంకు ద్వారా చెల్లింపులు చేసిందనుకోండి. ఒప్పందం ప్రకారం దీన్లో 50 శాతం అంటే రూ.250 కోట్లు ముడుపులు బాబుకివ్వాలి. నగదు రూపంలో ఇవ్వటం సాధ్యం కాదు కదా? మరి ఎలా? దీంతో కొన్ని సినిమా నిర్మాణ సంస్థలను పుట్టించారు. ఆ సంస్థల పేరిట అనేక బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేశారు. ఒక్కో ఖాతాకు చిన్న చిన్న మొత్తాల్లో ఈ రూ.250 కోట్లు తరలించారు. ఇక ఆయా ఖాతాల నుంచి డబ్బు డ్రా చేయటం కోసం సినిమా నిర్మాణం అనే పేరు పెట్టారు. రూ.2-3 కోట్లలో చుట్టేసిన చిన్న చిన్న సినిమాలకు కూడా రూ.30-40 కోట్లు అయిందని దొంగ లెక్కలు చూపించారు. సినిమాలో రోజు వారీ ఖర్చులు కింద / ప్రొడక్షన్ ఖర్చుల కింద వాటికి దొంగ బిల్లులు పెట్టారు. ప్రతి సినిమాకు రూ.20 కోట్లు- రూ.30 కోట్లు నష్టం వచ్చిందని రికార్డులు తయారు చేశారు. అలా ఎక్కడా టాక్స్ చెల్లించే సమస్య రాకుండా చూసుకున్నారు. ఇలా మొత్తం డబ్బును బ్లాక్‌గా మార్చి, అటుతిప్పి ఇటుతిప్పి ఆఖరుకు చంద్రబాబు కుటుంబ సభ్యుల చేతికి భద్రంగా చేర్చారు. ఇలా గుంటూరు జిల్లాకు చెందిన ఒక కాంట్రాక్టర్ ఒక్కడి దగ్గరే రూ.250 కోట్లు చిన్న చిన్న మొత్తాల్లో ట్రాన్స్‌ఫర్ చేయించారని ఆయనే ఇటీవల వాపోయారు. ఇలా నారా రోహిత్‌ను వాడేసుకుని 17 సినిమాలు హడావుడిగా చుట్టేసి.. చాలా మంది కాంట్రాక్టర్ల నుంచి ముడుపుల డబ్బును నారా లోకేష్‌కు అందించారు. కాంట్రాక్టర్‌లే కాకుండా కొన్ని వ్యాపార సంస్థల నుంచి కూడా ఇదే తరహాలో డబ్బులు దండుకున్నారని తెలిసింది.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- బడా స్టార్స్, క్రేజీ హీరోలకు తప్ప మరే హీరోదైనా ఒక సినిమా డిజాస్టర్ అయింది అంటే రెండో సినిమా అవకాశం కనాకష్టం అలాంటిది వరుసగా ఇన్ని సినిమాల్లో నారా రోహిత్ ఎలా చేయగలిగాడు?
- ఆయన సినిమాల బిజినెస్, కలెక్షన్ల ప్రకారం .. ప్రతి సినిమా రూ.20, 30 కోట్లకు పైగా భారీ నష్టాలు మూటగట్టుకుంది. అయినా కూడా నిర్మాతలు వరుస కట్టి అదే హీరోతో పదే పదే సినిమాలు ఎందుకు తీశారు?
- అతి కొద్ది మంది తప్ప నారా రోహిత్‌తో సినిమాలు తీసిన వారిలో ఎవరూ అంతకు ముందు భారీ చిత్రాలు తీసిన చరిత్ర ఉన్న నిర్మాతలు కాకపోవడం గమనార్హం. అలాంటప్పుడు వారు ఈయనతోనే మళ్లీ భారీ చిత్రాలు ఎందుకు తీశారు?
- నారా రోహిత్ సినిమా నిర్మాతల్లో పలువురికి తెలుగుదేశం పార్టీతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు ఉండడం వెనుక మతలబు ఏమిటి?

దొంగ లెక్కలతో బురిడీ

ఆయా సినిమాల అంచనా వ్యయం, లాభ నష్టాలు, వాస్తవ బడ్జెట్ వంటివన్నీ పరిగణనలోకి తీసుకుంటే.. హీరో రెమ్యునరేషన్‌తో సహా నారా రోహిత్ సినిమా బడ్జెట్ ప్రొడక్షన్ స్టార్ కాంబినేషన్‌ను బట్టి రూ.5-10 కోట్లు లోపు మాత్రమే. అయితే రోహిత్‌తో సినిమాలు తీసిన నిర్మాతలు మాత్రం వీటి బడ్జెట్ రూ.30 నుంచి 40, 45 కోట్ల దాకా కూడా చెబుతూవచ్చారు. అదే విధంగా వాళ్ల బంధు గణంతోనే డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ అవతారాలు ఎత్తించి థియేట్రికల్ రైట్స్‌ను రూ.30 కోట్లు నుంచి రూ.40 కోట్లకు కొనిపించినట్లు చూపారు. అంటే ఆ సినిమాలు తీసేవాడూ, వాటిని కొనేవాడూ ఇద్దరూ ఒకరేనని తెలుస్తోంది. సినిమా ఆడలేదు కాబట్టి.. తమకు ఇంత నష్టం వచ్చిందని ప్రభుత్వానికి ఈ ముఠా దొంగ లెక్కలు చూపించింది. ఇలా రోహిత్ సినిమాల ద్వారా లంచాల రూపంలో వచ్చిన బ్లాక్ మనీ సుమారు రూ.300 నుంచి 400 కోట్ల వరకు దండుకున్నారని అంచనా.

క్లుప్తంగా...

నా విజయంలో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ పాత్ర కీలకం

జేఈఈ మెయిన్స్ టాపర్ రిషి శేఖర్ శుక్లా



సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్– 2024లో 300కు గాను 300 మార్కులతో 100 పర్సంటైల్ సాధించిన రిషి శేఖర్ శుక్లా తన విజయంలో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ కీలకపాత్ర పోషించిందన్నాడు. ఆకాశ్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్ ద్వారా ఆ ఇన్‌స్టిట్యూట్ గురించి తెలుసుకున్నానని, క్లాస్‌రూమ్ వాతావరణం విద్యార్థికి అనుకూలంగా ఉంటుందని చెప్పాడు. రిషి తన ప్రిపరేషన్ గురించి మాట్లాడుతూ 'నా ప్రిపరేషన్‌లో ముఖ్యంగా 4 స్టెప్స్ ఫాలో అయ్యాను. మొదటగా క్లాస్‌లో కాన్సెప్ట్స్‌ను శ్రద్ధగా వినడంపై దృష్టి సారించా. తద్వారా ప్రాబ్లమ్స్‌ను తేలిగ్గా సాధన చేసేవాడిని. ఏమైనా సందేహాలుంటే లెక్చరర్లను అడిగి తెలుసుకునేవాడిని. చివరగా ఎక్కడ తప్పు చేస్తున్నానో తెలుసుకుని సరిదిద్దుకునేవాడిని'అని వివరించాడు. తన ప్రిపరేషన్‌లో ఆకాశ్ లెక్చరర్లు తనకు అందించిన సహకారం వెలకట్టలేనిదని చెప్పారు. అలాగే తన తల్లిదండ్రులు తన విజయంలో కీలకంగా వ్యవహరించారన్నారు. స్థిరంగా కష్ట పడి చదివే గుణమే జేఈఈలో విజయాన్ని అందిస్తుందని రిషి పేర్కొన్నాడు.

ఆయిల్‌పామ్‌పై ఏపీ ప్రభుత్వం, హెచ్‌యూఎల్ చర్చలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ ఉత్పత్తిని పెంపొందించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హిందూస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్)తో చర్చలు జరిపింది. ఈమేరకు హెచ్‌యూఎల్ లీగల్ కార్పొరేట్ వ్యవహారాలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవ్ బాజ్‌పేయి, హెచ్‌యూఎల్ సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్ యోగేశ్ మిశ్రా నేతృత్వంలో కంపెనీ ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం.. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఆహార ఉత్పత్తి శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేరుగా రైతులకు, పరిశ్రమలకు ప్రయోజనం చేకూర్చేలా పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీని ద్వారా దిగుమతులను తగ్గించుకోవచ్చన్నారు. ఏపీలో ఆయిల్‌పామ్‌ను 30 వేల హెక్టార్లలో సాగుకు 15 వేల మంది రైతుల భాగస్వామ్యం అవసరమని హెచ్‌యూఎల్ ప్రతిపాదించింది. నర్సరీల పెంపకం, రాష్ట్రంలో ఆయిల్ పామ్ మిల్ ఏర్పాటు ద్వారా రూ.300 కోట్లకు పైగా పెట్టుబడులు రాబట్టొచ్చని తెలిపింది. ఆయిల్‌పామ్ మిల్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి ఉద్యోగాలు వస్తాయని పేర్కొంది. దేవ్ బాజ్‌పేయి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఏపీపీఎస్సీ.. మరో ఐదు

- వారంలో వెలువడనున్న నోటిఫికేషన్లు
- అటవీశాఖలో 861 పోస్టుల భర్తీకి సిద్ధం
- విద్యుత్, మత్స్య, జైళ్ల శాఖలు, గణాంకాల విభాగంలో ఖాళీల భర్తీ



సాక్షి, అమరావతి: నిరుద్యోగ యువతకు శుభవార్త! ఇప్పటికే గ్రూప్– 1, 2 పోస్టులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చిన ఏపీపీఎస్సీ త్వరలో అటవీ శాఖలో పలు ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వడంతో ఈమేరకు వివిధ కేటగిరీల్లో 861 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల జారీకి చర్యలు చేపట్టింది. ఒకవైపు గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు చేస్తూనే మరోవైపు అటవీశాఖ ఉద్యోగాల భర్తీకి సన్నద్ధమైంది. మరో వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లు వెలువడనున్నట్లు సమాచారం. వీటిలో 37 ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు, 70 ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, 175 ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, 375 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, 10 తానా దార్లు, 12 టెక్నికల్ అసిస్టెంట్లు, మరో 10 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కలిపి 689 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి లభించింది. ఇవి కాకుండా ఎఫ్ఎస్ఓ, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ లాంటి మరో 172 క్యారీ ఫార్వర్డ్ పోస్టులతో కలిపి మొత్తం 861 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌తో పాటు పరీక్షల షెడ్యూల్‌ను కమిషన్ త్వరలో ప్రకటించనుంది. ఇవే కాకుండా విద్యుత్తు శాఖలో అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, మత్స్యశాఖలో ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, జైళ్ల శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టు పోస్టు, ఏపీ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ విభాగంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్లు వెలువడనున్నాయి.

రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుకు సీఎం శంకుస్థాపన



ఖైరతాబాద్ (హైదరాబాద్): సచివాలయం ఎదురుగా భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ విగ్రహ శంకుస్థాపనకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంతరావు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

నగర వార్తలు

హైదరాబాద్ అమ్మాయి.. అమెరికా అబ్బాయి



చంపాపేట: నగరానికి చెందిన ఓ యువతి అమెరికా యువకుడితో సంప్రదాయ బద్ధంగా వివాహం చేసుకుంది. బుధవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ లోని శుభం ఫంక్షన్‌హాల్‌లో ఈ వేడుక జరిగింది. వివరాలు.. బాలాపూర్ మండలం జిల్లెలగూడ కు చెందిన సురేష్ నాయక్, హేమలత దంపతుల కూతురు పూజా నాయక్ ఉన్నత చదువుల కోసం అమెరికాలోని న్యూజెర్సీ కి వెళ్లింది. చదువు పూర్తి కావడంతో అక్కడే ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగంలో చేరింది. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న మైకెల్ కెల్లీతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. దీంతో ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో అమెరికా నుంచి మైకెల్ కుటుంబ సభ్యులు వచ్చి వివాహతంతును నిర్వహించారు.

హెచ్‌సీయూకు 16న నోబెల్ అవార్డు గ్రహీత రాక

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి నోబెల్ అవార్డు గ్రహీత సర్ ప్రొఫెసర్ రిచర్డ్ జే రాబర్ట్స్ ఈనెల 16వ తేదీన రానున్నారు. ఆయన ఇంగ్లాండ్ లోని న్యూ బయో ల్యాబ్స్‌లో విధులను నిర్వహిస్తున్నారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్ విభాగం ఆధ్వర్యంలో బయో అన్వేషణ- 2024లో భాగంగా ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. ఆయన 1993లో వైద్య శాస్త్రంలో నోబెల్‌బహుమతిని అందుకున్నారు.

టీజీవో సభ్యత్వ నమోదు

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో టీజీవో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో టీజీవో హైదరాబాద్ జిల్లా సెక్రటరీ, జలమండలి శాఖ అధ్యక్షుడు మహమ్మద్ ఖాదర్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీఎంలు సరస్వతి, చంద్రజ్యోతి, కేదారేశ్వరి, సుగంధిని, టీజీవో జలమండలి శాఖ ఈసీ మెంబర్లు రమేశ్ బాబు, ఉత్తమ్ సింగ్, భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మ తల్లి వార్షిక రథ మహోత్సవాలు ప్రారంభం





బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి వార్షిక రథ మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 17 వరకు కొనసాగనున్న ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మొదటి రోజు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, పంచగవ్య ప్రాశన, ఆచార్య బ్రహ్మాది ఋత్విగ్వరణము, కంకణ, దీక్షాధారణము, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణము, అఖండ దీపారాధన, చండీ పారాయణాదులు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పెద్దమ్మ వారి ఉత్సవమూర్తి పల్లకిసేవ కన్నులపండువగా జరిగింది.

ఉస్మానియా ఆస్పత్రిని కూల్చొద్దు



మాట్లాడుతున్న జస్మిన్ జైరథ్

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని పరిరక్షించాలని ఉస్మానియా ఆస్పత్రి పరిరక్షణ గ్రూప్ డిమాండ్ చేసింది. బీఆర్ఎస్ పార్టీ కోర్టును తప్పుదోవ పట్టించేలా ఇచ్చిన తప్పుడు అఫిడవిట్‌ను కాంగ్రెస్ ఉపసంహరించుకోవాలని సూచించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభ్యులు జస్మిన్ జైరథ్, సారా మాథ్యూస్, మహ్మద్ ఇక్బాల్ జావిద్, డాక్టర్ ఆరీఫ్ అనీఫ్, అనూరాధా రెడ్డిలు మాట్లాడుతూ... ఎంతో అద్భుత కట్టడమైన ఉస్మానియా ఆస్పత్రిని ఉద్దేశ పూర్వకంగా రెన్యూవేషన్ చెయ్యకుండా దాన్ని ఒక పాడైపోయిన భవనంగా చిత్రీకరించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం యత్నించిందన్నారు. 400 సంవత్సరాల క్రితం కట్టిన చార్మినార్ ఎంతో బాగున్నప్పుడు 150 సంవత్సరాలు అయిన ఉస్మానియా ఆస్పత్రి ఎందుకు కూల్చాలని చూస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. ఆస్పత్రి మొత్తం 24 ఎకరాల్లో విస్తరించి ఉందని, ఈ భవనం కేవలం రెండు ఎకరాల్లో ఉందని కొత్త భవనం కట్టాలంటే ఇంకా 22 ఎకరాల స్థలం ఉండగా ఉన్న భవనాన్ని కూల్చేసి అదే స్థానంలో ఎందుకు నిర్మించాలనుకుంటున్నారో అర్థం కావడంలేదన్నారు. పాత భవనం వెనక రెండువేల పడకల ఆస్పత్రి నిర్మించే స్థలం ఉందని అక్కడ నిర్మించుకోవచ్చునన్నారు.

సందడి చేసిన నేహాశెట్టి

ఎల్‌బీనగర్: డీజే టిల్లు ఫేం సినీ నటీ నేహాశెట్టి బుధవారం బీఎన్‌రెడ్డినగర్‌లో సందడి చేశారు. వినీత్ సిల్వర్ జ్యువలరీ షాపు ప్రారంభోత్సవానికి ఆమె హాజరయ్యారు. భారీ సంఖ్యలో అభిమానులు రావడంతో రోడ్లు రద్దీగా మారాయి. కార్పొరేటర్లు మొద్దులచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న రాంమోహన్‌గౌడ్, షాపు నిర్వాహకులు మూల వినీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేపు రథసప్తమి వేడుకలు

హిమాయత్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 16న మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి, ప్రోగ్రామ్ అసిస్టెంట్ గూడూరు హరినాథ్ తెలిపారు. లిబర్టీలోని బాలాజీ భవన్‌లో బుధవారం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రథ సప్తమి మహోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. నగరంలోని కర్మన్ ఘాట్ జిల్లా పరిషత్ హైస్కూల్, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, ఇంజాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్, వికారాబాద్ జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, మౌలాలి కష్టానగర్‌లోని భారతీయ విద్యానికేతన్ స్కూల్‌లో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మహోత్సవంలో భాగంగా విద్యార్థులకు సూర్య నమస్కారాలు, ఆదిత్య హృదయ పారాయణం, సూర్య భగవానుని పూజ, ప్రసాద వితరణ, సూర్య భగవానుని ప్రాముఖ్యత, సప్తమి విశిష్టత తెలియజేస్తారన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులు

కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

లక్డీకాపూల్ : నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థలో(నిమ్స్) ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం నిమ్స్‌లో నిమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చే క్రమంలో కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అంతే కాకుండా వారికి గ్రాట్యుటీ సదుపాయాన్ని కల్పించాలన్నారు. కార్మిక, రైతు సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చాలు ఉమ్మడిగా తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌లో భాగంగా ఈ నెల16న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు బీజేపీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. పెద్ద నోట్లను రద్దు చేసి పేద ప్రజల ఉసురుతీశారన్నారు. విదేశాల్లో ఉన్న నల్ల డబ్బు తీసుకొచ్చి ఒక్కొక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు, దేశంలో నిరుద్యోగ యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చేసిన వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్, నిమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం. వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఇ. నరసింహులు, సంయుక్త కార్యదర్శి వెంకటేష్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రేపటి రవాణా బంద్‌ను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ నేతలు

హిమాయత్‌నగర్: ఈనెల 16న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు బంద్ కార్యక్రమంలో పాల్గొనాలని జేఏసీ నాయకులు బి.వెంకటేశం (ఏఐటీయూసీ) పిలుపునిచ్చారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో రవాణ బంద్ వాల్ పోస్టర్‌ను ఆటో, క్యాబ్,లారీ, డీసీఎం వాహనాల జేఏసీ నేతలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగాబ బి.వెంకటేశం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని గత 10 సంవత్సరాల నుంచి కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్ (సీఐటీయూ), వి.మారయ్య (బీఆర్‌టీయూ), ప్రవీణ్ (ఐఎఫ్‌టీయూ) తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం ఒక ఆయుధం: ఆర్.కృష్ణయ్య



శ్రీ లేఖలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, సినీ హీరో సుమన్

పంజగుట్ట: సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసే వాటిలో సినిమా తరువాత స్థానం సాహిత్యానిదే అని.. సాహిత్యం ఒక ఆయుధమని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రచయిత ప్రవీణ్‌శ్రీ రచించిన 'శ్రీ లేఖలు' ప్రేమ కథల సంపుటిని ఆయన సినీ నటుడు సుమన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... మనుషుల్లో నిద్రాణమైన సూక్తులను బయటకు తెచ్చి సమాజానికి దిక్సూచిగా రచయితలు పనిచేస్తారని అన్నారు. ఎన్ని సినిమాలు వచ్చి ఎంత అభివృద్ధి చెందినా సాహిత్యం ప్రభావం సమాజంలో పోలేదని తెలిపారు. కవులు ఎప్పటికప్పుడు సృజనాత్మకతను పెంచుకుని సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కవితలు రాయాలన్నారు. సినీ గేయ రచయిత సిరా శ్రీ మాట్లాడుతూ .. ఈ పుస్తకంలో 80కి పైగా కవితలు ఉన్నాయని వసంతపంచమి, ప్రేమికుల దినోత్సవం రోజు తాను ముందుమాట రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషమన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీపీ బద్రీనాథ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి గుజ్జ కృష్ణ, సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు, నీల వెంకటేశం, చిన్న శ్రీశైలం యాదవ్, జర్నలిస్టు సిరాజ్ పాల్గొన్నారు.

వల్లీ టీచర్... వెరీ స్పెషల్


● క్లాసులో పాఠాలు చెప్తున్న వల్లీటీచర్(ఫైల్)

మాతృదేవోభవ... పితృదేవోభవ... ఆచార్యదేవోభవ... అని నేర్చుకున్నాం.
స్పెషల్ ఎడ్యుకేటర్‌లో గురువుతోపాటు తల్లి, తండ్రి కూడా ఉంటారు.
ఆ ప్రత్యేక గురువులకు ఎన్ని వందల వందనాలు సమర్పించినా తక్కువే.
ఈ పిల్లలకు ప్రేమను పంచడానికే అంకితమైన వల్లీసుధీర్‌కి ప్రత్యేక వందనం!

భగవంతుడు కొంతమంది పిల్లలను భూమ్మీదకు ప్రత్యేకంగా పంపిస్తాడు. కల్మషం తెలియని ఆ స్పెషల్ కిడ్స్‌కి పాఠం చెప్పే టీచర్‌లు కూడా అంతే స్వచ్ఛమైన మనసు కలిగిన వారై ఉండాలి. ఆ టీచర్‌లు ప్రతి బిడ్డకూ అమ్మగా మారి తల్లిప్రేమను పంచాలి. స్పెషల్ టీచర్ అనేది ఉద్యోగం కాదు, అకుంఠిత దీక్షతో నిర్వహించే సేవ. నాలుగు దశాబ్దాలకు పైగా అలాంటి సేవకు తనను అంకితం చేసుకున్న మనీషి వల్లీసుధీర్. స్పెషల్ కిడ్స్‌కు సేవ చేయడానికి తన జీవితాన్ని అంకితం చేస్తానని ప్రమాణం చేసుకున్న మహోన్నతమైన వ్యక్తి ఆమె. తాను స్పెషల్ టీచర్‌గా మారిన వైనాన్ని సాక్షితో పంచుకున్నారు వల్లీసుధీర్.

సినిమారీళ్లన్ని మలుపులు!

''నేను స్పెషల్ టీచర్ కావడం వెనుక సినిమా కథలో ఉన్నన్ని మలుపులున్నాయి. మాది తెలుగు కుటుంబమే. కానీ పుట్టింది చెన్నైలో. మా నాన్న కెవీఎస్ శర్మ నటులు. ఎన్టీఆర్‌తో కలిసి చదువుకున్నారు, ఆయనతో కలిసి చెన్నైకి వెళ్లారు, ఆయనతో కలిసి సినిమాలు చేశారు. అమ్మానాన్నలకు నేను ఏకైక సంతానం. నాకు నాలుగేళ్లున్నప్పుడు నాన్న హటాత్తుగా పోయారు. దాంతో నేను, అమ్మ మా అమ్మమ్మగారింటికి విజయవాడకు వచ్చేశాం. టెన్త్ క్లాసు పూర్తయ్యేసరికి తాతగారు కూడా పోయారు. ఇక నేను, అమ్మ హైదరాబాద్‌లోని పిన్ని వాళ్లింటికి వచ్చాం. పూర్తిగా వాళ్ల మీద ఆధారపడిపోకుండా ఏదో ఒక ఉద్యోగం చేయాలనుకున్నాను. స్వీకార్, ఉపకార్ లో పిల్లలకు శిక్షకుల కోసం చూస్తున్నారని తెలిసింది. అలా స్పెషల్ చిల్డ్రన్ కోసం పని చేయాల్సిన రంగంలోకి అడుగుపెట్టాను. మొదటిరోజు నాకు ఇద్దరు కవల పిల్లలనిచ్చి చూసుకోమన్నారు. పిల్లల అవసరాలు తెలుసుకుని సముదాయించగలిగిన వయసు కాదది. ఇందులో ఇమడలేననుకుని, బాబాయ్‌కి చెప్తే 'భయపడి వదిలేయడం కాదు, నీ వంతు ప్రయత్నం చెయ్యి. తర్వాత చూద్దాం' అన్నారు. అలా కొనసాగుతున్న సమయంలో స్వీకార్ వాళ్లు నన్ను శిక్షణ కోసం మణిపాల్‌కి పంపించారు. ఆ శిక్షణ నా మీద అంతటి ప్రభావం చూపిస్తుందని ఏ మాత్రం ఊహించలేదు.

అమ్మకు పరీక్షలు పెట్టానట!

పిల్లలు మానసిక సమస్యలతో పుట్టడానికి దారి తీసే కారణాలను వివరించారు. నొప్పులు మొదలైన తర్వాత ప్రసవం జరగడానికి ఎక్కువ సమయం తీసుకోవడం, ఉమ్మనీరు పోవడం, పుట్టిన వెంటనే బిడ్డ ఏడవకపోవడం... వంటి సమస్యలను వివరిస్తూ ప్రసవం సమయంలో తల్లి మాత్రమే కాదు బిడ్డ కూడా తీవ్రమైన శారీరక, మానసిక ఒత్తిడికి లోనవుతుందని చెప్పారు. ఎక్కువ సమయం ఆక్సిజన్ అందక పోవడంతో ఎదురయ్యే పరిణామాలను వివరించారు. అంతే... నా గురించి అమ్మ ఎప్పుడూ చెప్పే ఒక విషయం గుర్తు వచ్చింది. 'నేను పుట్టినప్పుడు మా అమ్మ రెండు రోజులు నొప్పులు పడిందట. నార్మల్ డెలివరీ కాదని సిజేరియన్ చేశారు. ఉమ్మనీరు తాగడంతోపాటు, ఆక్సిజన్ అందక దేహం నీలిరంగులోకి మారిపోయిందట. పైగా పుట్టగానే ఏడవలేదు'. ఇన్ని కాంప్లికేషన్స్ మధ్య నేను నార్మల్‌గా పుట్టడం ఒక మిరకిల్. అవన్నీ మణిపాల్ శిక్షణ సమయంలో ఒక్కసారిగా రీలు తిరిగినట్లు కళ్ల ముందు మెదిలాయి. నాకు తెలియకుండానే చెంపల మీద కన్నీళ్లు కారిపోయాయి. భగవంతుడికి మనసులోనే దణ్ణం పెట్టుకుని, నార్మల్‌గా పుట్టించినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ... 'నా చివరి ఊపిరి వరకు స్పెషల్ కిడ్స్‌కి సర్వీస్ ఇస్తాను' అని ఒట్టుపెట్టుకున్నాను. అప్పటి నుంచి స్పెషల్ చిల్డ్రన్‌కి సర్వీస్ ఇవ్వడానికి అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవడం మీద మాత్రమే దృష్టి పెట్టాను. గ్రాడ్యుయేషన్, డీఎమ్ఆర్, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, సైకాలజీలో పీజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మరో పీజీతోపాటు లండన్‌లో 'కోర్స్ ఆఫ్ ఇంట్రడక్షన్' కోర్సు చేశాను.

స్వతంత్రులుగా నిలబెట్టాలి!

స్పెషల్ చిల్డ్రన్ గురించి సమగ్రంగా చదివిన తరవాత హైదరాబాద్‌లో 'శ్రద్ధ సెంటర్ ఫర్ స్పెషల్ చిల్డ్రన్' స్థాపించాను. ఈ పిల్లలు ప్రతి పనికీ ఒకరి మీద ఆధారపడకుండా తమ పనులు సొంతంగా చేసుకునేటట్లు తయారు చేయడం ప్రథమ లక్ష్యంగా పెట్టుకున్నాను. పర్సనల్ నీడ్స్... అంటే సొంతంగా తినడం, కాలకృత్యాలకు వెళ్లడం, శుభ్రం చేసుకోవడం వంటి పనులకు ఎవరి మీదా ఆధారపడకూడదు. రెండవది డొమెస్టిక్ స్కిల్స్, అంటే... తల దువ్వుకోవడం, దుస్తులు ధరించడం, చెప్పులు సరిగ్గా వేసుకోవడం వంటివి. ఇక మూడవది కాగ్నిటివ్ స్కిల్స్, అంటే... ప్రమాదాల గురించి తెలియచేయడం, అగ్నిప్రమాదం, జల ప్రమాదాలకు దూరంగా ఉండడం ఎలాగో నేర్పించడం, ప్రమాదాలు ఎదురైతే తప్పించుకోవడంలో శిక్షణనివ్వడంతోపాటు ఒక వస్తువు కొనడం, దుకాణానికి వెళ్లి డబ్బు ఇచ్చి కొనుగోలు చేసిన తరవాత చిల్లర డబ్బు తీసుకుని లెక్క చూసుకోవడం వంటి వాటిలో శిక్షణనివ్వడం అన్నమాట. ఈ మేరకు తర్ఫీదు ఇస్తే ఇక వాళ్ల జీవితంలో ఎవరికీ భారంగా పరిణమించరు. అందుకే ఈ మూడింటినే ప్రధానంగా తీసుకున్నాను. కానీ ముందే చెప్పాను కదా! నా జీవితంలో సినిమాకంటే ఎక్కువ మలుపులున్నాయని. నా ప్రయత్నం ఒకదారిలో పడే సమయానికి అమ్మ ఆరోగ్యం క్షీణించింది. ఇక నేను ఈ సెంటర్ మీద పూర్తి సమయం కేటాయించడం కుదిరేపని కాదని నా ఫ్రెండ్‌కి అప్పగించాను. శ్రద్ధ సెంటర్‌లో పిల్లలకు ఏ ఇబ్బంది లేకుండా చేయగలిగాను. కానీ నాకు రోజులు గడిచేదెలా? అమ్మకు వైద్యం చేయించేదెలా? అప్పుడు 'గీతాంజలి దేవశాల' స్పెషల్ స్కూల్‌లో చేరాను. అందులో 24 సంవత్సరాలు ఉద్యోగం చేశాను. స్వీకార్ ఉపకార్ నుంచి చూసుకుంటే 44 ఏళ్లు పూర్తయ్యాయి.

పిచ్చి టీచర్ అనేవాళ్లు!

సమాజంలో అప్పటికీ ఇప్పటికీ కొంత మార్పు వచ్చిన మాట నిజమే, కానీ రావలసినంత మార్పు రాలేదనే చెప్పాలి. అప్పట్లో మా గుర్తింపు 'పిచ్చి టీచర్', ఇప్పుడు స్పెషల్ ఎడ్యుకేటర్ బాధ్యత ఎంత క్లిష్టమైనదో అర్థం చేసుకుని మమ్మల్ని గౌరవంగా చూస్తున్నారు. ఈ సున్నితత్వం స్పెషల్ చిల్డ్రన్ విషయంలోనూ రావాలి. అప్పటిలాగ దూరం పెట్టడం లేదు కానీ దగ్గరకు రానివ్వడంలో ఒకింత సందిగ్ధంగానే ఉంటున్నారు. తమ పొరుగింట్లో స్పెషల్ కిడ్ ఉంటే ఆ కిడ్‌ని సానుభూతితో చూస్తున్నారు తప్ప, తమ పిల్లలతో ఆడుకోవడానికి అనుమతించలేకపోతున్నారు. విద్యావ్యవస్థ మాత్రం స్పెషల్ కిడ్స్ కోసం ఒక విభాగం ఉండాలనే నియమంతో ఓ ముందడుగు వేసిందనే చెప్పాలి. ఇద్దరు పిల్లల్లో ఒకరు స్పెషల్ కిడ్, ఒకరు నార్మల్ కిడ్ అయితే ఆ తల్లిదండ్రులు పిల్లలతో ఎలా వ్యవహరించాలి, స్పెషల్ కిడ్ తల్లి ఇరుగుపొరుగు వారితో, వారి పిల్లలతో ఎలా మెలగాలి వంటివన్నీ చెప్పడానికి ఒక వేదిక ఉంటే బావున్నని చూస్తున్నాను. ఇన్నాళ్లూ నా సర్వీస్‌కి వేదిక గీతాంజలి దేవశాల. ఇప్పుడు టెక్నాలజీ సాయంతో చెప్పాలా లేక వేరే మాధ్యమాలలో ప్రయత్నించాలా అనేది ఇంకా ఆలోచించలేదు. నాకు నేను పెట్టుకున్న ఒట్టు ప్రకారం చివరి శ్వాస వరకు స్పెషల్ కిడ్స్ కోసం పని చేస్తూనే ఉంటాను '' అన్నారు వల్లీసుధీర్.

– **వాకా మంజులారెడ్డి**, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఎవరికి వాళ్లు ప్రత్యేకమే!



ఇన్నేళ్ల నా అనుభవంలో తెలుసుకున్నదేమిటంటే... స్పెషల్ చిల్డ్రన్‌కి శిక్షణ ఇవ్వడానికి రూపొందించిన కోర్సులన్నీ ఒకరకమైన సాధనాలు మాత్రమే. వాటిని పిల్లవాడికి ఎలా అన్వయింపచేయాలనేది టీచర్ స్వీయ విచక్షణతో తెలుసుకుని ఆచరించాలి. ఒక సూత్రం ఏ ఇద్దరు పిల్లలకూ వర్తించదు. ఎవరికి వాళ్లు ప్రత్యేకమే. మా దగ్గరకు వచ్చిన పిల్లలకు ప్రేమ పంచాలి, బాధ్యతగా శిక్షణనివ్వాలి. అలా నేర్పిస్తూ పాతిక మందిని ఓపెన్ స్కూలింగ్‌లో టెన్త్ క్లాస్ పరీక్షకు సిద్ధం చేశాం. ఆటల్లో శిక్షణనిచ్చి పోటీలకు తీసుకెళ్లాం. మా దగ్గర శిక్షణ పొందిన పిల్లలు స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో ఇంగ్లండ్‌లో క్రీడల పోటీలకు కూడా వెళ్లారు.

– **వల్లీ సుధీర్**, స్పెషల్ టీచర్

బ్యూటిప్స్

అందమైన ఆరోగ్యానికి ఏడు సూత్రాలు

- చర్మం పేలవంగా ఉంటే స్వచ్ఛమైన కొబ్బరి నూనె రాయాలి. రాత్రి పడుకునే ముందు ముఖానికి, మెడకు, చేతులకు కొబ్బరినూనె రాసి వేళ్లతో వలయాకారంగా మసాజ్ చేసుకుంటే చర్మం ఆరోగ్యవంతమవుతుంది. కొబ్బరినూనె సూర్యరశ్మిలోని అల్ట్రావయొలెట్ కిరణాల కారణంగా ఎదురయ్యే సమస్యల నుంచి చర్మాన్ని కాపాడుతుంది.
- ముఖం మీద మచ్చలు, ముడతలు, చర్మం చిరచిరలాడడం వంటి ఇబ్బందులు పోవాలంటే కలబంద గుజ్జు రాసి పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. కలబంద చెట్టు నుంచి ఆకు విరిచి దాని నుంచి గుజ్జు తీసుకుని నేరుగా ముఖానికి రాయడమే. ఇంట్లో చెట్టు లేకపోతే రెడీమేడ్ అలోవెరా జెల్ వాడవచ్చు.
- పాలుగారే చర్మం కోసం రోజూ ముఖానికి మిల్క్ ఫేస్ ప్యాక్ వేయాలి. రెండు స్పూన్‌ల పాలలో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ శనగపిండి కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ప్యాక్ కలుపుకోవడానికి సమయం లేకపోతే పాలలో దూదిని ముంచి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత శుభ్రం చేసినా ఫలితం ఉంటుంది.
- చర్మం పొడిబారకుండా తేమగా ఉండాలంటే తేనె వాడాలి. సబ్బుతో ముఖం కడిగి తుడిచిన తర్వాత టీ స్పూన్ తేనెను అరచేతిలో వేసుకుని వేళ్లతో ముఖానికి పట్టిస్తూ వలయాకారంగా మసాజ్ చేయాలి. ముఖం, మెడకు పట్టించడం పూర్తయిన తర్వాత ఐదు నిమిషాల సేపు ఆరనిచ్చి గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి.
- తరుముకొస్తున్న వార్ధక్య లక్షణాలను నిలువరించడంలో బొప్పాయి చాలా బాగా పని చేస్తుంది. బాగా పండిన బొప్పాయి పండు గుజ్జు టేబుల్ స్పూన్, టీ స్పూన్ తేనె కలిపి ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత శుభ్రం చేయాలి.



ఇప్పటి వరకు మనం చెప్పుకున్నవన్నీ చర్మానికి బయటి నుంచి చేసే చికిత్సలు. దేహం ఆరోగ్యంగా ఉంటే చర్మం కూడా నిగారిస్తుంది. అందుకు రోజుకు పది గ్లాసుల నీటిని తప్పకుండా తాగాలి. ఇక ఆహారం విషయానికి వస్తే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. శారీరక వ్యాయామం తగినంత ఉండాలి. అలాగే ఎనిమిది గంటల మంచినిద్ర కూడా. ఇవన్నీ పాటిస్తే మెదడు చురుగ్గా, దేహం ఉత్సాహంగా పని చేస్తాయి. స్వేదం రూపంలో వ్యర్థాలు వెళ్లిపోవడంతో చర్మ సౌందర్యం ఇనుమడిస్తుంది.

న్యూస్‌మేకర్

గిరిజన గూడెంలో తొలి మహిళా జడ్జి



● కుమార్తెతో శ్రీపతి

తమిళనాడు తిరుపట్టూరు జిల్లా ఎలగిరి హిల్స్‌కు చెందిన 23 ఏళ్ల గిరిజనురాలు వి.శ్రీపతి సివిల్ జడ్జిగా అర్హత పొంది చరిత్ర సృష్టించారు. నిండు చూలాలుగా ఉండగా పరీక్ష రాసి మరీ ఆమె అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఇప్పటి వరకూ తమిళనాడులో గిరిజన మహిళా జడ్జి లేరు. శ్రీపతి పరిచయం.

ఆరు నెలల క్రితం.

తమిళనాడు తిరుపట్టూరు జిల్లాలోని యలగిరి హిల్స్ నుంచి ఒక కారు చెన్నైకి బయలుదేరింది. నాలుగున్నర గంటల ప్రయాణం. లోపల ఉన్నది పచ్చి బాలింత. అంతకు ముందు రోజే ఆమెకు ప్రసవమయ్యి ఆడపిల్ల పుట్టింది. కాని మరుసటి రోజు చెన్నైలో 'తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్'(టి.ఎన్.పి.ఎస్.సి) ఎగ్జామ్ ఉంది. అందులో ఉత్తీర్ణత సాధిస్తే ఆమె 'సివిల్ జడ్జ్' పోస్ట్‌గా అర్హత సాధిస్తుంది. అందుకే ప్రయాణం చేస్తోంది. ఆమె పేరు వి. శ్రీపతి. వయసు 23. ఆమెకు తోడుగా ఉన్నది భర్త వెంకటేశన్, తండ్రి కలియప్పన్. కొండ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకుని తరతరాలుగా బతుకుతున్న 'మలయలి' తెగలో ఆడపిల్లలు చదువుకోవడం చాలా విశేషం. లా చేయడం ఇంకా విశేషం. సివిల్ జడ్జి కావడం అంటే చరిత్రే.

చురుకైన అమ్మాయి

తిరువణ్ణామలైలోని గిరిజన గూడెంలో కలియప్పన్ అనే మలయాళి రైతుకు తొలి కుమార్తెగా జన్మించిన శ్రీపతి పసిపాపగానే చురుగ్గా ఉండేది. తిరువణ్ణామలై గిరిజన గ్రామాల్లో చదువు సరిగ్గా లేదు. వీళ్ల గూడెం నుంచి బస్సెక్కాలంటే 15 కిలోమీటర్లు నడవాలి. అందుకే కుమార్తె చదువు కోసం కలియప్పన్ అక్కడినుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న యలగిరి హిల్స్ (తిరుపట్టూరు జిల్లా)కు మకాం మార్చాడు. ఇక్కడా కొండల్లో వ్యవసాయమే అయినా వీళ్లుండే అత్తనావూర్‌లో ఇంటర్ వరకూ చదివించే మిషనరీ స్కూల్ ఉంది. అక్కడే శ్రీపతి ఇంటర్ వరకూ చదువుకుంది. 'ఇప్పుడు చదివి ఏం చేయాలంటా' అని తోటి తెగవారు తండ్రిని, తల్లిని ప్రశ్నించి ఇబ్బంది పెట్టినా వాళ్లు తమ కుమార్తె చదవాల్సిందేనని ప్రోత్సహించారు. ఇంటర్ అయ్యాక లా చదవాలని నిశ్చయించుకుంది శ్రీపతి.

గిరిజనుల హక్కుల కోసం

'మా గిరిజనులకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు ఉన్నాయో మావాళ్లకు తెలియదు. వారిని చైతన్యవంతం చేయాలి. వారి హక్కులు వారు పొందేలా చేయాలి. అందుకే లా చదవాలని నిశ్చయించుకున్నాను' అంది శ్రీపతి. ఇంటర్‌లో మంచి మార్కులు రావడంతో ఐదేళ్ల లాకోర్సులో చేరింది. చదువు సాగుతుండగానే అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేసే వెంకటేశన్‌తో వివాహం జరిగింది. చదువు పూర్తయ్యాక సివిల్ జడ్జి పోస్ట్ కోసం టి.ఎన్.పి.ఎస్.సి పరీక్ష రాసే సమయానికి నిండు చూలాలు. అయినప్పటికీ బిడ్డకు జన్మనిచ్చి పరీక్ష రాసింది. ఇప్పుడు రిజల్ట్స్ వచ్చి సివిల్ జడ్జిగా పోస్ట్ వచ్చింది. ఈ సంగతిని ప్రస్తావిస్తూ తమిళనాడు సి.ఎం స్టాలిన్, తమిళ సినీ ప్రముఖులు అభినందనలు తెలియచేశారు. 'తమిళ మీడియంలో చదువుకున్నవారికి ఉద్యోగాల్లో అవకాశం కల్పించే విధంగా ద్రవిడ మోడల్‌ను ప్రవేశ పెట్టడం వల్లే శ్రీపతి సివిల్‌జడ్జి కాగలిగిందని... ఇలా మారుమూల ప్రాంతాల వారికి అవకాశం దక్కాలని' స్టాలిన్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఇంటిప్స్



కార్పెట్ మీద బబుల్ గమ్, చూయింగ్ గమ్ లాంటివి పడి అవి ఎంతకూ ఊడి రాకపోతుంటే వ్యాక్యూమ్ క్లీనర్‌తో తొలగించవచ్చు.



ఉడెన్ సోఫా మీద స్టిక్కర్లు వంటివి అతికించినప్పుడు ఆ స్టిక్కర్ తీసేసినా, గమ్ మరకలు అలాగే ఉండిపోతాయి. అలాంటప్పుడు కాటన్ క్లాత్ మీద కొంచెం కొబ్బరినూనె వేసి గమ్ మీద రుద్దితే సులువుగా వదులుతుంది.

ఎంపవర్‌మెంట్

గేమ్ చేంజర్





వీడియో గేమ్స్ అంటే పవర్‌ఫుల్ వెపన్స్, పవర్‌ఫుల్ ఫైట్స్ మాత్రమేనా? 'కాదు' అంటుంది ఉమెన్ ఎంపవర్‌మెంట్‌కు పెద్ద పీట వేసిన 'గో నిషా గో' పదిహేను నుంచి పందొమ్మిది సంవత్సరాల మధ్య వయసు ఉన్న అమ్మాయిలకు రుతుచక్రం, పెళ్లి, చదువు, కెరీర్... మొదలైన వాటి గురించి అవగాహన కలిగిస్తోంది ఫ్రీ మొబైల్ గేమ్ గో నిషా గో. ఈ గేమ్ అంతర్జాతీయ స్థాయిలో 'బెస్ట్ సీరియస్ గేమ్' అవార్డ్ గెలుచుకుంది...

చాలామంది అమ్మాయిలకు బంగారు కలలు ఉంటాయి. అయితే రకరకాల కారణాల వల్ల ఆ కలలు సాకారం చేసుకోలేక పోతారు. 'ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా నా కలను సాకారం చేసుకుంటాను' అనే పట్టుదల ఉంటే కలను నెరవేర్చుకోవడం అసాధ్యమేమీ కాదు.

ఢిల్లీలోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన 'నిషా' కల్పిత పాత్ర. 'గో నిషా గో' గేమ్‌లో ప్రధాన పాత్ర.

'నా ప్రయాణంలో ధైర్యమే నా ఆయుధం' అనుకుంటే తడబడడం ఉండదు. అధైర్యం అసలే ఉండదు. దీనికి ఉదాహరణ నిషా. పందొమ్మిది సంవత్సరాల నిషా ఎన్నో కలలు కంటుంది. ఆ కలల దారిలో నిషాకు ఎదురైన అనుభవాలకు 'గో నిషా గో' అద్దం పడుతుంది. మొబైల్ గేమ్ 'గో నిషా గో' యువ యూజర్‌లకు మార్గ నిర్దేశం చేస్తుంది. బాల్య వివాహాలను నిరాకరించడం నుంచి ఆర్థిక స్వాతంత్య్రం వరకు కీలక అంశాలపై అవగాహన కలిగించే గేమ్ ఇది.

డిజిటల్ గేమ్ ప్లాట్‌ఫామ్ 'గేమ్ ఆఫ్ చాయిస్ నాట్ చాన్స్' నుంచి వచ్చిన తొలి గేమ్ 'గో నిషా గో'. 'క్రియేటివ్ నాన్–ప్రాఫిట్ సంస్థ గర్ల్ ఎఫెక్ట్ భాగస్వామ్యంతో ఢిల్లీ, రాజస్థాన్, బిహార్‌లలోని రెండు వందల మందికి పైగా అమ్మాయిలతో మాట్లాడాం. కౌమారదశలో వారు ఎదుర్కొన్న సమస్యలపై ఎన్నో ప్రశ్నలు అడిగాం. రకరకాల సవాళ్లు ఎదురైనప్పుడు సలహాల కోసం ఎవరి దగ్గరకు వెళతారు... ఇలాంటివి ఎన్నో అడిగాం' అంటుంది 'గేమ్ ఆఫ్ చాయిస్–నాట్ చాన్స్' కంట్రీ డైరెక్టర్ కవితా అయ్యగారి. రుతుస్రావం నుంచి సంతానోత్పత్తి వరకు ఎన్నో అంశాలపై అమ్మాయిలకు విశ్వసనీయమైన సమాచారం అందుబాటులో లేదనే విషయం కవిత బృందానికి అర్థమైంది. తాము ఎదుర్కొనే సమస్యల గురించి మాట్లాడటానికి అమ్మాయిలు సంకోచించడం, సామాజిక కట్టుబాట్ల పేరుతో తల్లిదండ్రుల ఒత్తిడి... మొదలైన విషయాలను బృందం గ్రహించింది.

ఏ సలహా దొరకక, ఏ దారి కనిపించక అయోమయంలో ఉన్న అమ్మాయిలకు 'నిషా' గేమ్ ఒక దారి చూపుతుంది. నైతికస్థైర్యాన్ని ఇస్తుంది. ఈ గేమ్ మెన్‌స్ట్రుయెల్ హెల్త్ హెల్ప్‌లైన్‌తో సహా రకరకాల ఆరోగ్య అంశాలకు సంబంధించిన ఉత్పాదనలు, సేవలు, మహిళల సమస్యలపై పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు సంబంధించి వీడియో లింక్‌లను అందిస్తుంది. 'గో నిషా గో' గూగుల్ ప్లేస్టోర్‌లో ఉచితంగా అందుబాటులో ఉంది.

అవగాహన పెంచుతోంది...

'గో నిషా గో' గేమ్ ఆడని వారితో పోల్చితే ఆడేవారిలో వివిధ విషయాలపై అవగాహన మెరుగు అవుతున్నట్లు అధ్యయన ఫలితాలు తెలియజేస్తున్నాయి. విషయ అవగాహనతో పాటు ఆత్మస్థైర్యం కూడా ఈ ఆట పెంచింది. ఈ గేమ్ ప్రభావంతో ఆగిపోయిన చదువును తిరిగి కొనసాగించిన వారు. 'నాకు పై చదువులు చదువుకోవాలని ఉంది. ఇప్పుడే పెళ్లి వద్దు' అని తల్లిదండ్రులతో ధైర్యంగా చెప్పిన వారు. ఆర్థిక స్వాతంత్య్రంపై దృష్టి పెట్టినవారు ఎంతో మంది ఉన్నారు. హోవార్డ్ డెలాఫీల్డ్ ఇంటర్నేషనల్(హెచ్‌డిఐ) గేమ్ ఆఫ్ చాయిస్–నాట్ చాన్స్' సోషల్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్ కింద 'గో నిషా గో'కు శ్రీకారం చుట్టింది. 'హెచ్‌డీఐ' అనేది సామాజిక, పర్యావరణ, ఆరోగ్య సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను అన్వేషించే మహిళల నేతృత్వంలోని బృందం.



'మా అమ్మ తన కలలు, లక్ష్యాల పట్ల చాలా స్పష్టతతో ఉన్న వ్యక్తి. అమెరికాలో చదువుకోవాలనే కోరిక ఆమెకు ఉండేది. తన చదువు కోసం పెళ్లిని వాయిదా వేయాలని, గ్రాడ్యుయేషన్ పూర్తయిన తరువాతే పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులతో ధైర్యంగా చెప్పింది. తన కలల గురించి గట్టిగా నిలబడకపోతే ఆమె జీవితం మరోలా ఉండేది' అంటుంది 'హెచ్‌డిఐ' కో–ఫౌండర్ సుసాన్ హోవార్డ్.

కిచెన్‌టిప్స్



గులాబ్ జామున్‌లు గట్టిగా అయితే పంచదార పాకంతో సహా వాటిని ప్రెషర్ కుక్కర్ లో పెట్టి సన్నటి మంటమీద ఐదు నిమిషాలు ఉడికిస్తే మృదువుగా మారతాయి.



పనీర్ వంటకం చేసేటప్పుడు నీళ్లకు బదులుగా పాలు వాడితే గ్రేవీ మెత్తగా ఉంటుంది.



టేబుల్ స్పూన్ ఫ్రూట్ జామ్‌ను ఒక గ్లాసు చల్లటి పాలలో వేసి మిక్సీలో బ్లెండ్ చేస్తే క్షణాల్లో రుచికరమైన ఫ్రూట్ షేక్ రెడీ అయిపోతుంది.

క్వార్టర్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్

భారత డేవిస్‌కప్ ప్లేయర్ రామ్‌కుమార్ రామనాథన్ అగ్రశ్రేణి ఆటతీరుతో టాప్‌సీడ్ ఆటగాడికి షాకిచ్చాడు. బెంగళూరు ఓపెన్ ఏటీపీ-100 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో వైల్డ్ కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగిన రామ్‌కుమార్ అద్భుతమైన విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత ప్లేయర్ 1-6, 6-4, 6-4తో టాప్ సీడ్ ల్యూకా నర్డి (ఇటలీ)ని ఓడించాడు. తొలి సెట్‌లో నర్డి ధాటికి రామ్‌కుమార్ తేలిపోయాడు. సెట్ ఆరంభంలోనే అతని సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఇటలీ స్టార్ ప్లేయర్ అలవోకగా తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. అయితే తర్వాతి సెట్లలో భారత ఆటగాడు దూకుడు కనబరిచాడు. రెండో సెట్‌లో 3-2తో ఆధిక్యంలో ఉన్న దశలో కీలకమైన బ్రేక్ పాయింట్ సాధించిన రామ్‌కుమార్ అదే జోరుతో సెట్ గెలిచి 1-1తో సమం చేశాడు. మూడో సెట్‌లో రామ్ సంధించిన ఏస్‌లకు టాప్‌సీడ్ ఆటగాడు బదులివ్వలేకపోయాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసిన భారత ఆటగాడు ఈ సెట్‌లోనూ దూకుడు పెంచి మ్యాచ్ గెలిచాడు. నర్డి 4 ఏస్‌లు సంధిస్తే... రామ్‌కుమార్ 9 ఏస్‌లు సంధించాడు.



మరో సమరానికి సన్నద్ధం

- నేటినుంచి భారత్, ఇంగ్లండ్ మూడో టెస్టు
- ఆధిక్యంపై ఇరు జట్ల దృష్టి
- ఉ.గం.9.30నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్షప్రసారం

తొమ్మిది రోజులు...భారత్, ఇంగ్లండ్ రెండో, మూడో టెస్టు మ్యాచ్‌ల మధ్య విరామం! చూస్తుంటే ఒక సిరీస్ 1-1తో ముగిసిపోయింది. ఇప్పుడు కొత్తగా మూడు టెస్టుల సిరీస్ మొదలవుతున్నట్లుగా అనిపిస్తోంది. ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్ ఆడుతున్న నేపథ్యంలో కొత్త ఉత్సాహంతో, కొత్త వ్యూహాలతో బరిలోకి దిగేందుకు ఇది పనికొచ్చింది. ఇప్పుడు సిరీస్‌లో ఆధిక్యం ప్రదర్శించేందుకు మరో పోరుకు రంగం సిద్ధమైంది. విరామం తర్వాత పైచేయి ఎవరిదనేది ఆసక్తికరం.

రాజ్‌కోట్: టెస్టు సిరీస్‌లో 1-1తో సమంగా ఉన్న స్థితిలో మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లేందుకు భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. నేటినుంచి జరిగే మూడో టెస్టులో ఇరు జట్లు హోరాహోరీగా తలపడేందుకు సిద్ధమయ్యాయి. ఉత్కంఠభరితంగా సాగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ విజయం సాధించగా...రెండో టెస్టులో భారత్‌కు భారీ విజయం దక్కింది. అయితే గత పర్యటనతో పోలిస్తే ఇంగ్లండ్ కాస్త మెరుగైన ప్రదర్శన కనబర్చగా...భారత్ కోణంలో చూస్తే అనూహ్యంగా గట్టి పోటీ ఎదురైంది. బుధవారం జరిగిన కార్యక్రమంలో రాజ్‌కోట్ మైదానాన్ని 'నిరంజన్ షా స్టేడియం'గా బీసీసీఐ పేరు పెట్టింది.

సర్ఫరాజ్ అరంగేట్రం!

రెండో టెస్టుతో పోలిస్తే భారత తుది జట్టులో మార్పులు ఖాయమయ్యాయి. గాయంతో వైజాగ్ టెస్టుకు దూరమైన రవీంద్ర జడేజా తిరిగి జట్టులోకి వస్తున్నాడు. తన సొంత మైదానంలో అతడు చెలరేగిపోతే ఇంగ్లండ్‌కు కష్టాలు తప్పవు. అయ్యర్‌పై వేటు పడటంతో అతని స్థానంలో బ్యాటర్‌గా సర్ఫరాజ్ ఖాన్‌కు తొలి అవకాశం దక్కవచ్చు. వికెట్ కీపర్‌గా ఆంధ్ర ఆటగాడు కేఎస్ భరత్‌ను తప్పించి ధ్రువ్ జురేల్‌ను ఎంపిక చేయవచ్చని కూడా తెలుస్తోంది. అయితే జురేల్‌ను ఆడిస్తారా లేక భరత్‌కు చివరి చాన్స్ ఇస్తారా చూడాలి. మిడిలార్డర్‌లో అనుభవలేమి కనిపిస్తుండటంతో బ్యాటింగ్ భారం ప్రధానంగా టాప్-3పైనే ఉంది. గత మ్యాచ్‌లో జైస్వాల్ తానేంటో నిరూపించుకోగా, గిల్ కూడా కీలక సెంచరీ సాధించాడు. రోహిత్ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఇప్పుడైనా ఆడాల్సి ఉంది. బౌలింగ్‌లో అశ్విన్, కుల్దీప్‌లను ఇంగ్లండ్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. బుమ్రా స్థాయి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముకేశ్ స్థానంలో సిరాజ్ వస్తాడు.

ఇద్దరు పేసర్లతో...

తొలి రెండు టెస్టుల్లో ఒకే ఒక పేసర్‌కే పరిమితమైన ఇంగ్లండ్ ఈ సారి వ్యూహం మార్చింది. రెండో పేసర్‌గా అండర్సన్‌తో పాటు వుడ్ తుది జట్టులోకి వచ్చాడు. స్పిన్నర్లలో హార్ట్‌లీ ఇప్పటికే సత్తా చాటగా, రేహాన్ పర్వాలేదనిపించాడు. వుడ్ రాకతో ఆఫ్‌స్పిన్నర్ బషీర్‌పై వేటు పడింది. అయితే రూట్ ఆఫ్ స్పిన్ జట్టుకు అదనపు బలంగా మారింది కాబట్టి సమస్య ఉండకపోవచ్చు. ఓడినా, గెలిచినా ఆ జట్టు బ్యాటింగ్ శైలిలో మార్పు ఉండకపోవచ్చు. ఓపెనర్లు క్రాలీ, డకెట్‌లతో పాటు పాటు పోప్ దూకుడు కొనసాగిస్తున్నాడు. ఇంకా ప్రభావవంతమైన ఇన్నింగ్స్ ఆడని రూట్, బెయిర్‌స్టో రాణించాల్సి ఉంది. స్టోక్స్ బ్యాటింగ్‌లో ఎలా చెలరేగుతాడో చూడాలి. అతని నాయకత్వ ప్రతిభకు కూడా ఈ మ్యాచ్ పరీక్ష కానుంది.

పిచ్, వాతావరణం

ఎప్పటిలాగే ఈ పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. పరుగుల వరదకు అవకాశం ఉంది. అయితే జడేజా చెప్పినదాన్ని బట్టి చూస్తే మ్యాచ్ సాగిన కొద్దీ పగుళ్లు ఏర్పడి స్పిన్‌ను అనుకూలిస్తుంది. కాబట్టి టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ తీసుకోవడం సరైన నిర్ణయం అవుతుంది. మంచి వాతావరణం, వర్షసూచన లేదు.

జట్ల వివరాలు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, రజత్, సర్ఫరాజ్, జడేజా, భరత్/ జురేల్, అశ్విన్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్. **ఇంగ్లండ్:** స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, రేహాన్, హార్ట్‌లీ, వుడ్, అండర్సన్.





2024 టి20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు రోహిత్ శర్మనే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. బోర్డు కార్యదర్శి జై షా ఈ విషయాన్ని నిర్ధారించారు.

100 - 500 - 700

ఈ టెస్టులో పలు ఆటగాళ్లకు వ్యక్తిగతంగా ఇది చిరస్మరణీయ మ్యాచ్ కానుంది. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కెరీర్‌లో ఇది 100వ టెస్టు మ్యాచ్. ఈ ఘనత సాధించిన 16వ ఇంగ్లండ్ ఆటగాడిగా స్టోక్స్ నిలుస్తాడు. మరో వికెట్ తీస్తే భారత స్పిన్నర్ అశ్విన్ 500 వికెట్ల ఘనతను అందుకుంటాడు. ఈ మైలురాయిని చేరిన 9వ ఆటగాడిగా నిలుస్తాడు. మరో 5 వికెట్లు తీస్తే అండర్సన్ 700 వికెట్ల ఘనతను అందుకుంటాడు.

చైనాకు భారత మహిళల షాక్

3-2తో సింధు బృందం విజయం

- హాంకాంగ్‌పై పురుషుల జట్టు గెలుపు
- ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



సింధు

షా ఆలమ్ (మలేసియా): బ్యాడ్మింటన్‌లో మేటి జట్టయిన చైనాకు భారత్ చేతిలో ఎదురుదెబ్బ తగిలింది.. ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో చక్కటి ప్రదర్శనతో భారత మహిళల జట్టు 3-2తో చైనా బృందాన్ని కంగు తినిపించింది. అన్నింటికి మించి భారత స్టార్ షట్లర్ పూసర్ల వెంకట సింధు చాన్నాళ్ల తర్వాత విజయంతో ఈ సీజన్‌ను ప్రారంభించింది. గాయాలు వెన్నంటే వైఫల్యాలతో గత సీజన్ ఆసాంతం నిరాశపర్చిన ఆమె ఈ ఏడాది గట్టి ప్రత్యర్థిపై ఘనమైన విజయంతో సత్తా చాటుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో సింధు 21-17, 21-15తో హన్ యుపై గెలిచి జట్టును 1-0తో ఆధిక్యంలో నిలిపింది. రెండు ఒలింపిక్ పతకాల విజేత అయిన సింధు కేవలం 40 నిమిషాల్లోనే తనకన్నా మెరుగైన ర్యాంకర్ ఆట కట్టించింది. రెండో గేమ్‌లో సింధు ఒక దశలో 10-13తో వెనుకబడినా...తర్వాతి 13 పాయింట్లలో 11 గెలుచుకొని విజేతగా నిలవడం విశేషం. అనంతరం జరిగిన డబుల్స్ పోటీల్లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీ 19-21, 16-21తో లియు షెంగ్ షు-తన్ నింగ్ జంట చేతిలో ఓడటంతో స్కోరు 1-1తో సమమైంది. ఆ వెంటనే జరిగిన రెండో సింగిల్స్‌లో అష్మిత చాలిహ 13-21, 15-21తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ వాంగ్ జి యి చేతిలో ఓడిపోవడంతో భారత్ 1-2తో వెనుకబడింది. ఈ దశలో మరో తెలుగమ్మాయి పుల్లెల గాయత్రి... ట్రెసా జాలీతో కలిసి డబుల్స్ బరిలో దిగి మ్యాచ్ గెలుపొందడంతో భారత శిబిరం ఊపిరి పీల్చుకుంది. గాయత్రి-ట్రెసా ద్వయం 10-21, 21-18, 21-17తో లి యి జింగ్-లు జు మిన్ జంటపై నెగ్గడంతో భారత్ 2-2తో చైనాను నిలువరించింది. దీంతో అందరి దృష్టి నిర్ణాయక పోరుపైనే పడింది. ఇందులో అంతగా అనుభవం లేని 472 ర్యాంకర్ అన్మోల్ ఖర్బ్ 22-20, 14-21, 21-18తో ప్రపంచ 149వ ర్యాంకర్ వు లు యుపై అసాధారణ విజయం సాధించి భారత్‌ను గెలిపించింది. తొలిసారి ఈ టోర్నీలో బరిలోకి జాతీయ చాంపియన్ అన్మోల్ తీవ్ర ఒత్తిడిని అధిగమించి విజయాన్ని అందుకోవడం విశేషం.



అన్మోల్

ప్రణయ్ ఓడినా...

పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ 4-1తో హాంకాంగ్‌పై జయభేరి మోగించింది. తొలి సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్ 18-21, 14-21తో ఎన్గ్ క లాంగ్ అంగస్ చేతిలో ఓడినా... తుది విజయం మనదే అయింది. ప్రపంచ నంబర్‌వన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి 21-16, 21-11తో లుయి చున్ వాయ్-యింగ్ సింగ్ చొయ్ ద్వయంపై అలవోక విజయం సాధించింది. రెండో డబుల్స్‌లో ఎం.ఆర్.అర్జున్-ధ్రువ్ కపిల జంట 21-12, 21-7తో చౌ హిన్ లాంగ్-హంగ్ కుయె చున్ జోడీపై నెగ్గింది. 3-1తో విజయం ఖాయమవగా... ఆఖరి సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 21-14, 21-18తో జాసన్ గునవాన్‌పై గెలుపొందడంతో ఆధిక్యం 4-1కు పెరిగింది. మహిళల గ్రూప్ 'డబ్ల్యూ'లో రెండే జట్లు ఉండటంతో భారత్, చైనా ఈ మ్యాచ్‌కు ముందే నాకౌట్‌కు అర్హత సాధించాయి. పురుషుల విభాగంలో మాత్రం గురువారం జరిగే పోరులో చైనాతో భారత్ తలపడుతుంది.

బెంగాల్ వారియర్స్ అవుట్

కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్ 'ప్లే ఆఫ్స్' రేసులో నిలవాలంటే మిగిలివున్న రెండు మ్యాచ్‌ల్ని కచ్చితంగా గెలవాల్సిన స్థితిలో బెంగాల్ వారియర్స్ 26-29తో పుణేరి పల్టన్ చేతిలో ఓడిపోయింది. దీంతో హరియాణా స్టీలర్స్‌కు నాలుగో సెమీస్ బెర్తు దాదాపు ఖాయమైంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పుణేరి రెయిడర్లు ఆకాశ్ షిండే 10, పంకజ్ మోహితే 6 పాయింట్లు సాధించగా, బెంగాల్ జట్టులో నితిన్ కుమార్ (5), మణిందర్ (4) రాణించారు. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 45-43తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. ఢిల్లీ తరఫున అశు మలిక్ (18) అదరగొట్టాడు. తలైవాస్ జట్టులో నరేందర్ కూడా 18 పాయింట్లు సాధించాడు.

భారత్ పోరాడినా...

రూర్కెలా: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 0-1 తేడాతో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. నెదర్లాండ్స్ తరఫున 27వ నిమిషంలో అల్బర్స్ ఫెలిస్ ఏకైక గోల్ నమోదు చేసింది. మ్యాచ్‌లో ఓడినా అత్యంత బలమైన వరల్డ్ నంబర్‌వన్ జట్టును చక్కటి డిఫెన్స్‌తో చాలా వరకు నిలువరించడంలో భారత మహిళలు సఫలమయ్యారు.

క్యారీ 8 క్యాచ్‌లు!



అడిలైడ్: ఆస్ట్రేలియా వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ దేశవాళీ వన్డే మ్యాచ్‌లో అత్యధిక క్యాచ్‌లు పట్టిన వికెట్ కీపర్‌గా ప్రపంచ రికార్డును సమం చేశాడు. క్వీన్స్‌లాండ్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో సౌత్ ఆస్ట్రేలియా కీపర్ క్యారీ 8 క్యాచ్‌లు అందుకోవడం విశేషం. గతంలో డెరెక్ టేలర్, జేమ్స్ పైప్ ఈ ఘనత సాధించారు.

న్యూజిలాండ్ 211 ఆలౌట్

హామిల్టన్: రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ డేన్ పీట్ (5/89) తిప్పేయడంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే ఆలౌటైంది. దీంతో సఫారీకి 31 పరుగుల ఆధిక్యం లభించింది. విలియమ్సన్ (43; 7 ఫోర్లు), లాథమ్ (40; 1 ఫోర్, 1 సిక్స్) మినహా ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. అంతకుముందు 220/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండోరోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 242 పరుగులకే ఆలౌటైంది. విలియం ఓ రూర్కీ 4 వికెట్లు తీశాడు.

శ్రీలంక క్లీన్‌స్వీప్

పల్లెకెలె: అఫ్గానిస్తాన్‌లో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం జరిగిన ఆఖరి వన్డేలో లంక 7 వికెట్ల తేడాతో అఫ్గాన్‌పై ఘన విజయం సాధించింది. అఫ్గాన్ 48.2 ఓవర్లలో 266 పరుగుల వద్ద ఆలౌటైంది. రహ్మత్ షా (65; 7 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్జాయ్ (54; 4 ఫోర్లు) రాణించారు. శ్రీలంక 35.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 267 పరుగులు చేసి గెలిచింది. పతుమ్ నిసాంక (101 బంతుల్లో 118; 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగా...అవిష్క ఫెర్నాండో (91; 10 ఫోర్లు, 5సిక్స్‌లు) శతకం చేజార్చుకున్నాడు.

నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా నబీ...

ఐసీసీ వన్డే ఆల్‌రౌండర్స్ కొత్త ర్యాంకింగ్స్‌లో అఫ్గాన్ ఆటగాడు మొహమ్మద్ నబీ నంబర్‌వన్ స్థానాన్ని అందుకున్నాడు. అతి పెద్ద వయసులో (39 ఏళ్ల ఒక నెల) ఈ ఘనత సాధించిన ఆటగాడిగా నబీ నిలిచాడు. 1739 రోజులు (మే 7, 2019నుంచి) నంబర్‌వన్ ఆల్‌రౌండర్ ర్యాంక్‌లో కొనసాగిన షకీబ్ అల్ హసన్ ఎట్టకేలకు రెండో స్థానానికి పడిపోయాడు.

సినిమా


రొమాంటిక్ బచ్చన్



● రవితేజ, భాగ్యశ్రీ బోర్సె

ప్రేమికుల దినోత్సవం రోజున రొమాంటిక్ మూడ్‌లోకి వెళ్లిపోయారు మిస్టర్ బచ్చన్. 'మిరపకాయ్' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా 'మిస్టర్ బచ్చన్' నుంచి ఓ రొమాంటిక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. పనోరమా స్టూడియోస్, టీ-సిరీస్ సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాకు చెందిన ఓ కీలక షెడ్యూల్ చిత్రీకరణ కారైకుడిలో ముగిసింది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, కెమెరా: అయనంక బోస్.

సింగమ్ వర్సెస్ సైతాన్



● అర్జున్ కపూర్

బాలీవుడ్ సింగమ్ ఫ్రాంచైజీలో రూపొందుతున్న తాజా చిత్రం 'సింగమ్ ఎగైన్'. అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్, దీపికా పదుకోన్, కరీనా కపూర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. 'సింగమ్' ఫ్రాంచైజీ దర్శకుడు రోహిత్ శెట్టి 'సింగమ్ ఎగైన్' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. కాగా ఈ సినిమాలో అర్జున్ కపూర్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు పేర్కొని, ఆ పాత్రను సైతాన్‌గా అభివర్ణిస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేశారు రోహిత్ శెట్టి. 'ఈ తుఫానుకు సిద్ధంగా ఉండండి' అంటూ అర్జున్ పాత్రను ఉద్దేశించి, సోషల్ మీడియాలో షేర్ చేశారు అజయ్ దేవగన్. రోహిత్ శెట్టి, అజయ్ దేవగన్, జ్యోతీ దేశ్‌పాండే నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. మరోవైపు 'సింగమ్ ఫ్రాంచైజీ'లో భాగంగా 2011లో 'సింగమ్', 2014లో 'సింగమ్ రిటర్న్స్' ఇప్పుడు 'సింగమ్ ఎగైన్' సినిమాల్లో అజయ్ దేవగన్ హీరోగా నటిస్తున్నారు.

స్పైడర్ మేన్‌ను దాటిన డెడ్ పూల్!



● 'డెడ్ పూల్ అండ్ వోల్వరైన్' పోస్టర్

హాలీవుడ్ సూపర్ హీరోస్ ఫిల్మ్స్‌లో 'డెడ్ పూల్' ఫ్రాంచైజీ ఒకటి. 2016లో వచ్చిన 'డెడ్ పూల్', 2018లో వచ్చిన 'డెడ్ పూల్ 2' సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టాయి. ప్రేక్షకులను అమితంగా అలరించాయి. తాజాగా 'డెడ్ పూల్' సిరీస్‌లోని మూడో భాగం 'డెడ్ పూల్ అండ్ వోల్వరైన్' విడుదలకు సిద్ధమవుతోంది. ర్యాన్ రేనాల్డ్స్, హ్యూ జాక్‌మెన్ ప్రధాన పాత్రల్లో, ఎమ్మా కొరిన్, మోరెనా బక్కరిన్, రాబ్ డెలానీ కీలక పాత్రల్లో నటించారు. షాన్ లెవీ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. జూలై 26న 'డెడ్ పూల్ అండ్ వోల్వరైన్' చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇటీవల ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ విడుదలైన 24 గంటల్లో 365 మిలియన్ వ్యూస్‌ను సాధించింది. 24 గంటల్లో ఇన్ని వ్యూస్ రావడంతో ఇదే ప్రపంచ రికార్డు అని మేకర్స్ పేర్కొన్నారని హాలీవుడ్ అంటోంది. గతంలో ఈ రికార్డు 2021లో విడుదలైన 'స్పైడర్‌మేన్: నో వే హోమ్' ట్రైలర్ పేరిట ఉండేది. 24 గంటల్లో 'స్పైడర్ మేన్: నో వే హోమ్' ట్రైలర్ 355.5 మిలియన్ వ్యూస్ సాధించింది. ఇప్పుడు 'డెడ్ పూల్ అండ్ వోల్వరైన్' ట్రైలర్ రాకతో 'స్పైడర్‌మేన్: నో వే హోమ్' సెకండ్ ప్లేస్‌లోకి వెళ్లింది.



● వాణీ కపూర్

లండన్ కాలింగ్

లండన్‌కు వెళ్లేందుకు రెడీ అవుతున్నారట హీరోయిన్ వాణీ కపూర్. విహార యాత్ర కోసం కాదు. షూటింగ్ కోసం సూట్‌కేస్ సర్దుకోనున్నారు వాణీ కపూర్. దాదాపు రెండేళ్ల తర్వాత ఆమె హిందీ చిత్రం అంగీకరించారు. పరేష్ రావల్, వాణీ కపూర్, అపర్‌శక్తి ఖురానా ప్రధాన పాత్రధారులుగా ఫ్యామిలీ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనుందని సమాచారం. నవ్యజోత్ గులాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ కథ రీత్యా వాణీ కపూర్, అపర్‌శక్తి సోదరీ సోదరుడుగా నటించనున్నారట. ప్రస్తుతం మానవ సంబంధాలు ఏ విధంగా మారుతున్నాయి? ఈ మార్పులు వారి కుటుంబాలపై ఎలాంటి ప్రభావాలను చూపిస్తున్నాయి? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని టాక్. ఈ సినిమా చిత్రీకరణను ముందుగా వేసవిలో లండన్‌లో ప్లాన్ చేస్తున్నారట. ఎక్కువ శాతం షూటింగ్ అక్కడే జరుగుతుందట. వీలైనంత త్వరగా షూటింగ్ పూర్తి చేసి, ఈ ఏడాది చివర్లో విడుదల చేయాలన్నది చిత్ర యూనిట్ ప్లాన్ అని భోగట్టా.

ఇట్లా నవ్వే...



● సిద్ధు జొన్నల గడ్డ, అనుపమ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' (2022) చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' రూపొందింది. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ జంటగా మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన ఈ సినిమా మార్చి 29న విడుదల కానుంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'టిల్లు స్క్వేర్' ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఇట్లా నవ్వే మా బతుకులు నవ్వులపాలు చేస్తారు తర్వాత', 'సర్.. ఒక ఆడపిల్ల తండ్రిగా అడుగుతున్నాను.. మీ అబ్బాయిని ఇలాగేనా పెంచేది', 'సర్.. నేనూ ఒక మగపిల్లాడి తండ్రిగా చెబుతున్నాను.. మేమేం పెంచలేదు.. వాడే పెరిగిండు','ఎవరి పరిస్థితిని కూడా అర్థం చేసుకునే పరిస్థితిలో నేను లేనిప్పుడు' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''తొలి భాగం కన్నా రెండో భాగంలో వినోదం రెట్టింపు ఉంటుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: సాయి ప్రకాశ్ ఉమ్మడిసింగు, సంగీతం: రామ్ మిరియాల, నేపథ్య సంగీతం: ఎస్. తమన్.

వినోదాల బంగారు గుడ్డు




● 'బంగారు గుడ్డు' పోస్టర్

సంపూర్ణేష్ బాబు, సురభి శుక్లా జంటగా గోపీనాథ్ నారాయణ మూర్తి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బంగారు గుడ్డు'. కేఎం ఇలంజెళియన్, ఎం. కోటేశ్వర రాజు తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం, ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. గోపీనాథ్ నారాయణమూర్తి మాట్లాడుతూ– ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రం 'బంగారు గుడ్డు'. మంచి భావోద్వేగాలూ ఉంటాయి. ఈ మూవీలోని ఓ ప్రత్యేక పాటతో హీరోయిన్ కిరణ్ రాథోడ్ రీ ఎంట్రీ ఇస్తున్నారు'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: షమీర్ టాండన్, కెమెరా: అఖిల్ శశిధరన్, నేపథ్య సంగీతం: ఆర్ఎస్ రాజ్‌ప్రతాప్.

రీల్స్


హరోం హర...



● సుధీర్ బాబు

సుధీర్ బాబు హీరోగా నటించిన చిత్రం 'హరోం హర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మాళవికా శర్మ హీరోయిన్. సుమంత్ జి. నాయుడు నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమాకి చేతన్ భరద్వాజ్ సంగీతదర్శకుడు. ఈ చిత్రం నుంచి 'హరోం హర...' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకు కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, చేతన్ భరద్వాజ్ పాడారు. ''చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో ఈ కథ జరుగుతుంది. ఈ సినిమా కోసం సుధీర్ బాబు కుప్పం యాసలో డైలాగులు చెప్పారు'' అన్నారు మేకర్స్.

తండ్రీ కొడుకుల ప్రయాణం



● సముద్ర ఖని, ధనరాజ్

హాస్య నటుడు ధనరాజ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రామం రాఘవం'. ఈ చిత్రంలో సముద్ర ఖని, ధనరాజ్ తండ్రీ కొడుకులుగా నటిస్తున్నారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో తెలుగు, తమిళ భాషల్లో పృథ్వీ పోలవరపు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం డిజిటల్ గ్లింప్స్‌ను హీరో రామ్ తన 'ఎక్స్' ఖాతాలో విడుదల చేసి, సినిమా విజయం సాధించాలన్నారు. దర్శకుడు హరీష్ శంకర్ మీడియా గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. తండ్రీ కొడుకుల భావోద్వేగాల ప్రయాణంతో రూపొందిన ఈ చిత్రానికి సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గా ప్రసాద్.

ప్రేమ అందమైనది



● తాన్వీ, శ్రీ కమల్

'నువ్వే కావాలి', 'మన్మథుడు', 'మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాల దర్శకుడు కె.విజయ భాస్కర్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' ఉపశీర్షిక. ఈ చిత్రంలో శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష హీరో హీరోయిన్లు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''టాకీ పార్టు పూర్తయింది. త్వరలోనే పాటల చిత్రీకరణకు విదేశాలకు వెళ్లనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్ఆర్ ధ్రువన్, కెమెరా: సతీష్.

స్వార్థం ఉండదు!



● పృథ్వీ, సుమయా

పృథ్వీ అంబర్, సుమయా రెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వంలో సుమయా రెడ్డి నిర్మించిన ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ప్రేమ అనేది ఓ అనిర్వచనీయమైన నిర్వచనం', 'అబ్బాయిల ప్రేమలో స్వార్థం ఉండదు.. అమ్మాయిల స్వార్థంలోనే ప్రేమ ఉంటుంది' అనే డైలాగ్స్ ఈ సినిమా టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: రథన్, కెమెరా: రాజ్ తోట.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	268	71,823
నిఫ్టీ ▲	97	21,840

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,715	▲ 58
డోజోన్స్	38,259	▽ 13
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,568	▲ 56
డాక్స్	16,945	▲ 65
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,866	▲ 36
నికాయ్	37,703	▽ 261

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,590	▽ 804
బంగారం (99.5 స్వచ్ఛత)	61,344	▽ 800
వెండి (కిలో)	69,150	▽ 1,892

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.70	83.72
£	బ్రిటన్ పౌండ్	103.54	106.10
€	యూరో	87.95	90.29
¥	జపాన్ ఎన్ (100)	54.66	55.89
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.79	54.70
S$	సింగపూర్ డాలర్	59.19	63.87
SAR	సౌదీ రియాల్	21.23	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	21.71	23.50
¥	చైనా యువాన్	10.42	12.49

16 నుంచి అగ్రిటెక్ ప్రదర్శన



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అగ్రిటెక్ సౌత్ 2024 ప్రదర్శన ఫిబ్రవరి 16 నుంచి జరగనుంది. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహిస్తోంది. అగ్రి విజన్ 2024 పేరుతో రెండు రోజుల పాటు సదస్సు సైతం ఏర్పాటు చేశారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, అనుబంధ రంగాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 100కు పైగా కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించనున్నాయి.

ఎంఅండ్‌ఎం లాభం జూమ్

క్యూ3లో రూ. 2,658 కోట్లు

ముంబై: ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎంఅండ్‌ఎం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 34 శాతం జంప్‌చేసి రూ. 2,658 కోట్లను తాకింది. వివిధ విభాగాలలో అమ్మకాలు పుంజుకోవడం లాభాల్లో వృద్ధికి సహకరించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,984 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 15 శాతం వృద్ధితో రూ. 35,299 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 30,621 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ కాలంలో ఆటో, వ్యవసాయ పరికరాల విభాగాలు మార్కెట్ వాటాను పెంచుకున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో అనిష్ షా పేర్కొన్నారు. ఆటో విభాగం లాభాలు రెట్టింపైనట్లు తెలియజేశారు. కాగా, స్టాండెలోన్ నికర లాభం 11 శాతం అధికమై రూ. 2,454 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 16 శాతం ఎగసి రూ. 25,624 కోట్లను తాకింది. వాహన అమ్మకాలు 20 శాతం వృద్ధితో 2,11,443 యూనిట్లకు చేరగా.. 4 శాతం తక్కువగా 1,00,522 ట్రాక్టర్లు విక్రయమయ్యాయి. గత క్యూ3లో 1,04,850 ట్రాక్టర్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఎస్‌యూవీ విభాగంలో కంపెనీ 21 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నట్లు ఆటో, ఫామ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ జెజురికర్ తెలియజేశారు.



ఫలితాల నేపథ్యంలో ఎం అండ్ ఎం షేరు 0.7% బలపడి రూ. 1,658 వద్ద ముగిసింది.

ఆస్ట్రేలియాలో మలబార్ గోల్డ్ తొలి షోరూం ప్రారంభం

హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో తొలి షోరూంను ఏర్పాటు చేసింది. మాజీ ఆస్ట్రేలియా క్రికెటర్ బ్రెట్ లీ కొత్త షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. తద్వారా ఆస్ట్రేలియాలో షోరూంను ఆవిష్కరించిన తొలి భారత జ్యువెలరీ బ్రాండ్‌గా చరిత్ర సృష్టించింది. 'భారత్, ఆస్ట్రేలియాల మధ్య బలమైన ఆర్థిక, ద్వైపాక్షిక వాణిజ్య బంధానికి ఇది తార్కాణం. ఆసీస్ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన పెట్టుబడులు, స్థానికంగా ఉద్యోగ కల్పన లక్ష్యంగా మా వృద్ధి ప్రణాళిక రూపొందించాము' అని సంస్థ చైర్మన్ ఎం.పీ.అహ్మద్ తెలిపారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రపంచవ్యాప్తంగా 13 దేశాల్లో 340 షోరూంల్లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తుంది.



టోకు ధరలు తగ్గాయ్

జనవరిలో 0.27% ● మూడు నెలల కనిష్టం ● ఆహార ధరల ఊరట



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2024 జనవరిలో 0.27 శాతంగా నమోదయ్యింది. అంటే 2023 జనవరితో పోల్చితే ఈ బాస్కెట్‌లో మొత్తం ఉత్పత్తుల ధర 2024 జనవరిలో 0.27 శాతం పెరిగిందన్నమాట. గడచిన మూడు నెలల్లో ఇదే అతి తక్కువ టోకు ద్రవ్యోల్బణం. ఆహార ధరల తగ్గుదల దీనికి కారణం. నిజానికి 2023 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ టోకు ధరల సూచీ క్షీణతలో కొనసాగింది. దీనినే ప్రతి ద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. నవంబర్‌లో మొదటిసారి ప్లస్‌లోకి వచ్చింది. సంబంధిత నెల్లో 0.39 శాతంగా నమోదయ్యింది. డిసెంబర్‌లో సూచీ 0.73 శాతానికి పెరిగింది. తిరిగి తాజా సమీక్షా నెల్లో 0.27 శాతానికి తగ్గింది.

తయారీ, ఇంధనం-విద్యుత్ క్షీణతలోనే...

- ఫుడ్ ఆర్టికల్స్‌లో ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం 9.38 శాతం ఉంటే, జనవరిలో ఈ రేటు 6.85 శాతానికి తగ్గింది. ఇందులో ఒక్క కూరగాయల ధరలు 26.3 శాతం నుంచి 19.71 శాతానికి తగ్గాయి. ఆలూ ధరలు పెరక్కపోగా తగ్గాయి. పండ్లు, గుడ్లు, పాలు, చేప, పాలు ధరలు కూడా తగ్గాయి.
- ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో 2.41 క్షీణతలో ఉంటే, జనవరిలో ఈ క్షీణ రేటు 0.51 శాతంగా నమోదయ్యింది.
- తయారీ ఉత్పత్తుల ధరలు కూడా క్షీణతలో ఉన్నాయి. డిసెంబర్‌లో ఈ రేటు మైనస్ 0.71 శాతంగా ఉంటే, తాజా సమీక్ష నెల్లో మైనస్ 1.13 శాతంగా నమోదయ్యింది.

ఎన్‌ఎండీసీ లాభం 62% అప్

రూ. 5.75 మధ్యంతర డివిడెండు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రభుత్వ రంగ మైనింగ్ దిగ్గజం ఎన్‌ఎండీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సుమారు రూ. 1,470 కోట్ల లాభం ప్రకటించింది. గత క్యూ3లో నమోదైన రూ. 904 కోట్లతో పోలిస్తే ఇది 62 శాతం అధికం. ఇక సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 3,925 కోట్ల నుంచి రూ. 5,746 కోట్లకు పెరిగింది. వ్యయాలు రూ. 2,693 కోట్ల నుంచి రూ. 3,517 కోట్లకు పెరిగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను షేరు ఒక్కింటికి రూ. 5.75 చొప్పున కంపెనీ మధ్యంతర డివిడెండు ప్రకటించింది. ఫిబ్రవరి 27 దీనికి రికార్డు డేట్‌గా ఉంటుంది.




జీవీకే పవర్ నష్టాలు రూ. 77 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రా (జీపీఐఎల్) రూ. 77.39 కోట్ల నికర నష్టం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) ప్రకటించింది. గత క్యూ3లో కంపెనీ రూ. 3,402 కోట్ల నికర లాభం నమోదు చేసింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 343 కోట్ల నుంచి రూ. 155 కోట్లకు తగ్గింది. వ్యయాలు రూ. 356 కోట్ల నుంచి రూ. 226 కోట్లకు తగ్గాయి.

నష్టాల్లోంచి.. లాభాల్లోకి!

- ఆదుకొన్న ఆఖరి గంట కొనుగోళ్లు
- మెరుగైన ఆర్థిక గణాంకాల దన్ను
- రాణించిన ఇంధన, మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు

ముంబై: ఆఖరి గంట కొనుగోళ్లతో ఆరంభ నష్టాలు భర్తీ చేసుకున్న స్టాక్ సూచీలు బుధవారం లాభాలతో గట్టెక్కాయి. ఇంధన, మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో రంగాల షేర్లు రాణించి సూచీలను నష్టాల్లోంచి లాభాల్లోకి నడిపాయి. మెరుగైన దేశీయ స్థూల ఆర్థిక గణాంకాల నమోదు ఇన్వెస్టర్లను కొనుగోళ్లకు ప్రోత్సహించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో ఉదయం సూచీలు భారీ నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే 745 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ చివరికి 268 పాయింట్లు లాభపడి 71,823 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 70,809 వద్ద కనిష్టాన్ని, 71,939 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 310 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 97 పాయింట్ల లాభంతో 21,840 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 21,530 - 21,871 శ్రేణిలో కదలాడింది. కాగా ఫార్మా, ఐటీ, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈలో స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1.16%, 1.26 % చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 3,930 కోట్ల షేర్లను విక్రయించగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,898 కోట్ల షేర్లు కొన్నారు. అమెరికా ద్రవ్యోల్బణం అంచనాలకు మించి పెరగడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- అమెరికా ద్రవ్యోల్బణం అంచనాలకు మించి నమోదవడంతో 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు' వాయిదా ఆందోళనలు, ఇది ఐటీ రంగ క్లయింట్ల వ్యయాల కేటాయింపులపై ప్రతికూల ప్రభావాన్ని చూపొచ్చనే అంచనాలతో ఐటీ షేర్లు నష్టాలు చవిచూశాయి. టెక్ మహీంద్రా 3.50%, ఎంఫసిస్ 2.50% కోఫోర్జ్ 2%, టీసీఎస్ 1%, ఇన్ఫోసిస్ 1%, ఎల్‌టీఐఎం 0.50% చొప్పున నష్టపోయాయి.
- ప్రభుత్వ రంగ ఎస్‌బీఐ షేరు 4% లాభపడి రూ.743 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 5% ఎగసి రూ.748 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. వృద్ధిపై విశ్వాసం, మార్జిన్ల నిర్వహణ, ఆస్తుల ఆదాయాల మెరుగుపై యాజమాన్యపు సానుకూల అవుట్‌లుక్ వ్యాఖ్యలతో క్యూ3 ఆర్థిక ఫలితాల ప్రకటన నాటి నుంచి 15 ట్రేడింగ్ సెషన్లలో ఈ షేరు 24% ర్యాలీ చేసింది.
- ఫెమా నిబంధనల ఉల్లంఘన ఆరోపణలతో తన అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఈడీ ప్రాథమిక విచారణ ప్రారంభించినట్లు వార్తలు వెలుగులోకి రావడం పేటీఎం షేరు వరుసగా రెండో రోజూ లోయర్ సర్క్యూట్ తాకింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే 10% పతనమై రూ.342 వద్ద లాకైంది.

ఒకటి ఓకే.. రెండు నిరాశ!

మూడు కంపెనీల లిస్టింగ్ తీరిది..

ముంబై: ఇటీవల పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకున్న మూడు కంపెనీలు బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. వీటిలో రాశి పెరిఫెరల్స్ లిస్టింగ్ మెప్పించగా.., క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు నిరాశపరిచాయి.

- రాశి పెరిఫెరల్స్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.311)తో పోలిస్తే 8% ప్రీమియంతో రూ. 335 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 10% ర్యాలీ చేసి రూ.343 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. లాభాల స్వీకరణతో చివరికి 3% లాభంతో రూ.321 వద్ద నిలిచింది.
- జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.414)తో పోలిస్తే 4% డిస్కౌంట్‌తో రూ.396 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 12% క్షీణించి రూ.365 కనిష్టాన్ని తాకింది. ఆఖరికి 11% నష్టంతో రూ.368 వద్ద ముగిసింది.
- క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.468)తో పోలిస్తే 7% డిస్కౌంట్‌తో రూ.435 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 10% పతనమై రూ.421 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 7.25% నష్టంతో రూ.434 వద్ద ముగిసింది.



పాబ్లోతో క్రిస్మ్ జట్టు..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయ లగ్జరీ హోమ్ ఫర్నీషింగ్స్ దిగ్గజం పాబ్లోతో దేశీ ఇంటీరియర్ డిజైన్ స్టూడియో క్రిస్మ్ జట్టు కట్టింది. దీని ప్రకారం పాబ్లోకి భారత్‌లో తమ సంస్థ మాస్టర్ ఫ్రాంచైజీగా ఉంటుందని సంస్థ డైరెక్టర్లు కిరణ్ కుమార్, శైలజ వెల్లడించారు. లగ్జరీ విల్లాలు, విశాలవంతమైన గృహాలు, స్టూడియో అపార్ట్‌మెంట్స్ వంటి సెగ్మెంట్స్‌పై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు కిరణ్ పేర్కొన్నారు. రెండు అంతస్థుల్లో 20,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన తమ క్రిస్మ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో మాడ్యులర్ కిచెన్లు, డిజైనర్ వార్డ్‌రోబ్‌లు, బెడ్స్, సోఫాలు, లైటింగ్ సొల్యూషన్స్ మొదలైనవి ఉన్నట్లు వివరించారు. అధునాతన హోమ్ డిజైన్‌లను అందించేందుకు ఇప్పటికే కెస్సీబోమర్, బ్లమ్, ఫైలే లాంటి అంతర్జాతీయ బ్రాండ్స్‌తో కూడా తమకు ఒప్పందాలు ఉన్నాయని పేర్కొన్నారు.



భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: జనరల్ స్టడీస్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర 21 ఉన్నత స్థాయి సర్వీసుల్లో పోస్టుల భర్తీకి సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 1056
» విద్యార్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్యలో ఉత్తీర్ణత ఉండాలి. అర్హత కోర్సు ఫైనల్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: 21-32 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:2024, మార్చి 5
» ప్రిలిమినరీ పరీక్ష తేది: 2024, మే 26
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in, upsconline.nic.in

నీట్(యూజీ)-2024

దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్)-యూజీ(నీట్ యూజీ-2024) పరీక్షకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు.

» అర్హత: ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీతో సైన్స్‌లో ఇంటర్మీడియట్ /ప్రీ-డిగ్రీ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 17 ఏళ్లు నిండి ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 09.03.2024.
» పరీక్ష తేది: 05.05.2024.
» వెబ్‌సైట్:https://exams.nta.ac.in/NEET

ఏపీ సెట్-2024

ఆంధ్రా యూనివర్సిటీ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష(ఏపీ సెట్)-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఉత్తీర్ణత ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల లెక్చరర్లుగా కొలువు పొందేందుకు అర్హత లభిస్తుంది.

» సబ్జెక్టులు: జనరల్ పేపర్ ఆన్ టీచింగ్‌అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్-1), ఆంత్రోపాలజీ, హిస్టరీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్-అట్మాస్ఫియరిక్-ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్స్, ఇన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, హిందీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, లా, లైఫ్ సైన్సెస్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మేనేజ్‌మెంట్, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సంస్కృతం,సోషియాలజీ, సోషల్ వర్క్, తెలుగు, ఉర్దూ, విజువల్ ఆర్ట్స్.
» అర్హత: కనీసం 55శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: గరిష్ఠ వయోపరిమితి లేదు.
» పరీక్ష విధానం: పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు.
» పరీక్ష వ్యవధి: మూడు గంటలు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 14.02.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 06.03.2024.
» పరీక్ష తేది: 28.04.2024.
» వెబ్‌సైట్: apset.net.in.

జీఏటీ-బీ, బీఈటీ-2024

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయో టెక్నాలజీ(జీఏటీ-బీ)2024,జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం నిర్వహించే బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ)-2024 ప్రకటన వెలువడింది. ఎన్‌టీఏ నిర్వహించే ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ద్వారా వివిధ ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు.

కోర్సుల వివరాలు

» జీఏటీ-బీ కోర్సులు: ఎంఎస్సీ(బయోటెక్నాలజీ, అగ్రి బయోటెక్నాలజీ, సంబంధిత విభాగాలు), ఎంటెక్(బయో టెక్నాలజీ, సంబంధిత విభాగాలు), ఎంవీఎస్సీ(యానిమల్ బయోటెక్నాలజీ).
» అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎంబీబీఎస్, బీడీఎస్, బీవీఎస్సీ, బీఎఫ్ఎస్సీ, బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్, బీపీటీ, బీటెక్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» బీఈటీ కోర్సులు: ఈ పరీక్షలో ప్రతిభ ఆధారంగా పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందవచ్చు.
» అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీబీఎస్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంవీఎస్సీ, ఎంఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు, దివ్యాంగులు,మహిళలు 31ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తుకు చివరితేది: 06.03.2024.
» పరీక్ష తేది: 20.04.2024
» వెబ్‌సైట్: https://dbt.ntaonline.in or www.nta.ac.in

అవుతారా.. స్పెషలిస్ట్ ఆఫీసర్!

బ్యాంక్ ఉద్యోగాల ఆశావహులకు శుభవార్త! బీటెక్, ఎంబీఏ తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకుని.. బ్యాంకింగ్ రంగంలో కొలువు కోరుకుంటున్న అభ్యర్థులకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్వాగతం పలుకుతోంది. 1,025 స్పెషలిస్ట్ ఆఫీసర్(ఎస్‌వో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది!! ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. బ్యాంకింగ్ రంగంలో ఉన్నత స్థాయి అవకాశాలను అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. పీఎన్‌బీ ఎస్‌వో పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

» పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఎస్‌వో కొలువులు
» నాలుగు విభాగాల్లో 1,025 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక

పంజాబ్ నేషనల్ బ్యాంక్.. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ముఖ్యమైంది. ఐబీపీఎస్ ద్వారా క్లర్క్స్, పీఓ పోస్ట్‌ల భర్తీ చేపట్టే పీఎన్‌బీ.. స్పెషలిస్ట్ పోస్టులకు మాత్రం సొంతంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తోంది. తాజాగా నాలుగు విభాగాల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

మొత్తం 1,025 పోస్ట్‌లు

పీఎన్‌బీ తాజా నోటిఫికేషన్ ద్వారా నాలుగు విభాగాల్లో మొత్తం 1,025 పోస్ట్‌ల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో ఆఫీసర్-క్రెడిట్ 1000 పోస్ట్‌లు, మేనేజర్-ఫారెక్స్ 15 పోస్ట్‌లు, మేనేజర్-సైబర్ సెక్యూరిటీ 5 పోస్ట్‌లు, సీనియర్ మేనేజర్-సైబర్ సెక్యూరిటీ-5 పోస్ట్‌లు ఉన్నాయి.

అర్హతలు

- పోస్ట్‌లను అనుసరించి బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, సీఏ/సీఎంఏ/సీఎఫ్ఏ ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.
- వయసు: క్రెడిట్ ఆఫీసర్‌కు 21-28 ఏళ్లు; ఫారెక్స్ మేనేజర్, సైబర్ సెక్యూరిటీ మేనేజర్‌కు 25-35 ఏళ్లు; సీనియర్ మేనేజర్ సైబర్ సెక్యూరిటీ పోస్ట్‌కు 27-38 ఏళ్లు ఉండాలి. నిబంధనలను అనుసరించి రిజర్వ్‌డ్ కేటగిరీ వర్గాలకు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక విధానం

స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి రెండంచెల ఎంపిక విధానాన్ని అనుసరిస్తారు. తొలుత రాత పరీక్ష ఉంటుంది. అందులో ప్రతిభ ఆధారంగా మలిదశలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

రాత పరీక్ష.. ఇలా

తొలి దశలో రాత పరీక్షను రెండు విభాగాల్లో (పార్ట్-1, పార్ట్-2) 100 మార్కులకు చొప్పున నిర్వహిస్తారు. పార్ట్-1లో రీజనింగ్ 25 ప్రశ్నలు-25 మార్కులు; ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-25 మార్కులు; క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు -50 మార్కులకు పరీక్ష ఉంటుంది. అదేవిధంగా పార్ట్-2లో ప్రొఫెషనల్ నాలెడ్జ్ పేరుతో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 50 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇలా మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతుంది. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కును తగ్గిస్తారు. పరీక్షకు లభించే సమయం రెండు గంటలు.

పర్సనల్ ఇంటర్వ్యూ

తొలిదశ రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. పార్ట్-2లోని ప్రొఫెషనల్ సబ్జెక్ట్ విభాగంలో పొందిన మార్కులను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో చోటు సాధించిన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. ఇంటర్వ్యూలో బ్యాంకింగ్ నాలెడ్జ్,అభ్యర్థులు ఎంచుకున్న విభాగానికి సంబంధించిన పరిజ్ఞానం, పని అనుభవం తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

తుది ఎంపిక

తుది నియామకాలు ఖరారు చేసే క్రమంలో.. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇంటర్వ్యూలో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు పొందాలి.

వేతనాలు

- జేఎంజీఎస్-1కు రూ.36,000-రూ.63,840తో ప్రారంభ వేతన శ్రేణి ఉంటుంది.
- ఎంఎంజీఎస్-2కు రూ.48,170-రూ.69, 810 శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.
- ఎంఎంజీఎస్-3కు రూ.63,840-రూ.78,230 శ్రేణిలో ప్రారంభ వేతనం ఉంటుంది.

విధులివే

- ఆఫీసర్ క్రెడిట్: బ్యాంక్ క్రెడిట్ విభాగాలు, కార్పొరేట్ బ్రాంచ్‌లు, ట్రేడ్ ఫైనాన్స్ సెంటర్స్, ఫైనాన్స్ విభాగం, కార్పొరేట్ క్రెడిట్ విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- మేనేజర్-ఫారెక్స్: బ్యాంకుకు సంబంధించి ఏడీ బ్రాంచ్‌లు; బ్యాక్ ఆఫీస్‌లు/ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాల్లో ఫారెన్ ఎక్స్ఛేంజ్‌కు సంబంధించిన లావాదేవీలకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- మేనేజర్, సీనియర్ మేనేజర్-సైబర్ సెక్యూరిటీ: బ్యాంకుకు సంబంధించిన ఆన్‌లైన్ కార్యకలాపాలకు ఎలాంటి అడ్డంకులు రాకుండా.. సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్స్ సమర్థవంతంగా పనిచేసేలా నిరంతర పర్యవేక్షణ, నిర్వహణ వంటి బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.

జీఎం స్థాయికి

స్పెషలిస్ట్ ఆఫీసర్‌గా కొలువులో చేరిన వారు భవిష్యత్తులో జనరల్ మేనేజర్‌వరకూ పదోన్నతులు పొందే అవకాశముంది. సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్ పోస్ట్‌లకు.. పని తీరు, ప్రతిభ, సర్వీసు ఆధారంగా పదోన్నతి లభిస్తుంది.



ముఖ్య సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఫిబ్రవరి 25.
- ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్.
- వెబ్‌సైట్: https://www.pnbindia.in/Recruitments.aspx

రాత పరీక్షలో రాణించేలా

రీజనింగ్

రీజనింగ్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు పకడ్బందీగా వ్యవహరించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

అర్థమెటిక్‌పై పట్టుతో ఈ విభాగంలో రాణించొచ్చు. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా సాధన చేస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందొచ్చు. అదే విధంగా.. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా సాధన చేయాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగం కోసం అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి.. బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను చదవాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.



జోగుళాంబదేవి నిజరూప దర్శనం

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబదేవి బుధవారం భక్తులకు నిజరూప దర్శనం ఇచ్చారు. అమ్మవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు నిజరూప దర్శనభాగ్యం కల్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు తీసుకొచ్చిన 1,008 కలశాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. ఏడాదికి ఒకసారి మాత్రమే అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుందని, 35 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈఓ పురేంధర్‌కుమార్ తెలిపారు. జోగుళాంబ సేవాసమితి ఆధ్వర్యంలో అష్టభుజి జోగుళాంబ సమేత గంటలేశ్వర ఆలయం నుంచి కలశాలతో ఊరేగింపు నిర్వహించారు.

‘కణా’కష్టం!

పురుషుల్లో పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతోందంటున్న అధ్యయనాలు

- గత 50 ఏళ్లలో సగానికిపైగా పడిపోయిన శుక్రకణాల సంఖ్య
- 100 మిలియన్ల నుంచి దాదాపు 50 మిలియన్లకు తగ్గుదల
- సంతానలేమికి ఇదే ప్రధాన కారణం
- ప్రపంచంలో 4.85 కోట్ల జంటల్లో సమస్య
- భవిష్యత్తులో పరిస్థితి మరింత తీవ్రం కానుందంటున్న అధ్యయనాలు
- జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం ప్రధాన కారణాలు!
- ‘హ్యూమన్ రిప్రొడక్షన్ అప్‌డేట్–2023’నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా పురుషుల్లో పునరుత్పత్తి సామర్థ్యం క్షీణిస్తోందా? 4.85 కోట్ల జంటలు సంతానలేమితో బాధ పడటానికి ఇదే కారణమా? ఐదారు వందల సంవత్సరాల తర్వాత పరిస్థితి మరింత తీవ్రం కానుందా? అంటే... అంతర్జాతీయ అధ్యయనాలు అవుననే అంటున్నాయి. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు తదితర కారణాల వల్లే ఈ పరిస్థితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పురుషుల్లో శుక్రకణాలు తగ్గడమే సంతానోత్పత్తి తగ్గడానికి ప్రధాన కారణమని చెబుతున్నాయి. సమాజంలో సాధారణంగా స్త్రీల పునరుత్పత్తి సామర్థ్యంపైనే ప్రధానంగా చర్చ జరుగుతుంటుందని, పురుషులకు సంబంధించి పెద్దగా చర్చ జరగడం లేదని పలు నివేదికలు చెబుతున్నాయి. పితృస్వామ్య వ్యవస్థ కారణంగానే ఇలా జరుగుతోందని అంటున్నాయి. ఆఫ్రికా, ఆసియా వంటి దేశాల్లోనైతే సంతానలేమికి స్త్రీనే కారణంగా పేర్కొంటూ నిందిస్తారు. కాగా కొన్ని ప్రాంతాల్లో బహుభార్యత్వం ఇప్పటికీ కొనసాగుతుండటానికి గల కారణాలలో సంతానలేమిని అధిగమించాలన్నది ఒకటని అంటున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా సంతానలేమిపై ‘హ్యూమన్ రిప్రొడక్షన్ అప్‌డేట్–2023’నివేదిక వెలువడింది. 20, 21 శతాబ్దాలలో ఏం జరిగిందనేది దీని సారాంశం. 1973 నుంచి 2020 వరకు 50 ఏళ్ల కాలంలో పరిస్థితిని నివేదిక వివరించింది. 1970లో 20–30 వయస్సు గల ఒక యువకుడికి వంద మిలియన్ల శుక్రకణాలు ఉన్నాయనుకుంటే.. 2020 వచ్చే నాటికి అదే వయస్సుగల వారు కొందరిలో 50 శాతం వరకు తగ్గిపోయాయి. అంటే 50 మిలియన్లకు శుక్రకణాలు తగ్గిపోయాయన్న మాట. అలాగే 1972లో ఒక వ్యక్తికి శుక్రకణాలు 101 మిలియన్లు ఉంటే... 2018లో అదే వయస్సు గల వారిలో శుక్రకణాల సంఖ్య 49 మిలియన్లకు పడిపోయాయి. ఇలా గడిచిన ఐదు దశాబ్దాలలో మానవ శుక్రకణాల సాంద్రత 100 మిలియన్ల నుంచి 49 మిలియన్లకు పడిపోయింది. అంటే సుమారుగా 51 శాతం తగ్గిందన్న మాట. అంటే పునరుత్పత్తి సామర్థ్యం ఆ మేరకు తగ్గిపోయిందన్నమాట. ప్రతి ఆరు జంటల్లో ఒకరు సంతానలేమి సమస్యతో బాధ పడుతుండటం గమనార్హం.

51 శాతం తగ్గిన శుక్రకణాలు

సంతానలేమితో బాధపడేవారిలో 80 శాతం మందికి ప్రధానంగా శుక్రకణాలు తక్కువగా ఉంటాయి. ఒక్కోసారి జీరో కూడా ఉండొచ్చు. జీరో శుక్రకణాలు ఉండేవారు జనాభాలో 7 నుంచి 10 శాతం మంది ఉంటారని అంచనా. ఇక ఇండియాలో 2.75 కోట్ల మంది సంతాన లేమితో బాధపడుతున్నారు. 48 శాతం మందిలో స్త్రీలు కారణం కాగా, 20.4 శాతం ఇద్దరిలో సమస్యల వల్ల, 31.6 శాతం మందిలో పురుషుల కారణంగా సంతాన సమస్య ఏర్పడింది. ఇక ప్రపంచవ్యాప్తంగా సంతానలేమితో బాధపడే జంటలు 4.85 కోట్లు ఉన్నట్లు అంచనా. సంతానలేమితో బాధపడేవారిలో శుక్రకణాల సంఖ్య 15 మిలియన్ల నుంచి 20 మిలియన్ల కంటే తక్కువగా ఉంటుంది. పురుషులలో హార్మోన్ల లోపం, మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థలో పుట్టుకతో వచ్చే లోపాలు, పురుష ప్రత్యుత్పత్తి అవయవాల్లో ఇన్‌ఫెక్షన్లు, మారుతున్న జీవన విధానం, మానసిక, శారీరక, వృత్తిపరమైన ఒత్తిడులు, ఆలస్యంగా జరుగుతున్న వివాహాలు, ఆహార కల్తీలు, ధూమ మద్యపానానికి అలవాటు పడడం, మాదకద్రవ్యాలకు బానిసలవటం, వాతావరణ కాలుష్యం, మొబైల్స్ విపరీత వినియోగం లాంటివి సంతానలేమికి కారణాలుగా చెబుతున్నారు.

భారత్‌లో 2.75 కోట్ల మంది..



వైద్య చికిత్సలతో సమస్యను అధిగమించొచ్చు

సంతానోత్పత్తి సవ్యంగా జరగాలంటే ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి. శుద్ధిచేసిన ఆహారాన్ని తీసుకోకూడదు. ధూమ, మద్యపానానికి దూరంగా ఉండాలి. నిత్యం వ్యాయామం చేయడం, ధ్యానం లాంటివి అలవరుచుకోవాలి. ఏడెనిమిది గంటల నిద్ర ఉండాలి. అయితే శుక్రకణాల సంఖ్యను పెంచాలన్నా, పునరుత్పత్తి సామర్థ్యం పెంచాలన్నా అనేక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. సరైన చికిత్స చేయించుకుంటే సంతానోత్పత్తి సమస్యలను అధిగమించవచ్చు. ఎజోస్పెర్మియా (జీరో స్పెర్మ్ కౌంట్) లోపాన్ని సరిదిద్దేందుకు ఆధునిక చికిత్స పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. రెండు రకాలైన (నాన్ అబ్‌స్ట్రక్టివ్ ఎజోస్పెర్మియా, అబ్‌స్ట్రక్టివ్ ఎజోస్పెర్మియా) ఎజోస్పెర్మియా లోపాలను వైద్యపరంగా సరిదిద్దేందుకు అవకాశం ఉంది. ఇక వ్యారికోసీ సమస్య కారణంగా శుక్రకణాలు తగ్గిన పురుషులకు మైక్రోసర్జికల్ వ్యారోకోసిలెక్టమీ చేయడం ద్వారా వాటిని పెంపొందించవచ్చు.



– డాక్టర్ రాఘవేంద్ర కోస్గి, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ అండ్ ఆండ్రాలజిస్ట్, అపోలో ఆస్పత్రి, హైదరాబాద్

భక్తజన బాసర





వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రం బుధవారం భక్తజన సంద్రంగా మారింది. పిల్లలకు అక్షరాభ్యాస పూజలు చేయించేందుకు రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఘనంగా మండమెలిగే




మండమెలిగే పూజా కార్యక్రమంలో భాగంగా సమ్మక్క ప్రధాన ద్వారం వద్ద మామిడి తోరణం కడుతున్న పూజారులు

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ జాతర పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం మేడారం, కన్నెపల్లిలో మండమెలిగే కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవార్ల ఆలయాలను శుద్ధి చేసి డోలు వాయిద్యాలతో పూజారులు అమ్మవార్ల గుడి చేరుకున్నారు. మేడారం సమ్మక్క గుడిలో శక్తి పీఠాన్ని పవిత్రమైన పుట్ట మట్టితో అలికారు. సమ్మక్క ప్రధాన పూజారి మునీందర్ ఇంటి నుంచి పసుపు, కుంకుమలు తీసుకొని గుడికి చేరుకున్నారు. సమ్మక్క ప్రధాన ద్వారం.. తూర్పు ప్రవేశ మార్గంలో మామిడి తోరణానికి సొరకాయ, కోడిపిల్ల కట్టి నిలిపారు. సమ్మక్క పూజారులు మునీందర్, మల్లెల ముత్తయ్య, కొక్కెర కృష్ణయ్య, దశరథం, వడ్డె నాగేశ్వరరావులు చలిగంజి, కోడి, శాక (కల్లు), ధూపంతో మూడుసార్లు తోరణం కింద రోడ్డు అడ్డంగా అరగింపు చేశారు. పడమర ప్రవేశ మార్గంలో కూడా ఇదే తీరుగా పూజలు నిర్వహించారు. కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయ మార్గంలో మామిడి తోరణాలు కట్టి, పూజారులు కూడా వారి చేతులకు కంకణాలు కట్టుకున్నారు. ఈ కార్యక్రమాలతో మేడారం మహాజాతర మొదలైందని పూజారులు తెలిపారు. మేడారానికి భక్తులు పోటెత్తారు. మండమెలిగే ఉండడంతో అమ్మవార్లకు పెద్ద ఎత్తున మొక్కులు సమర్పించుకున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌ఐఈఎల్‌ఐటీ సెంటర్లు

- సికింద్రాబాద్, తిరుపతిలో ఏర్పాటుకు కేంద్రం ఆమోదం
- ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ కోర్సుల్లో శిక్షణ



సాక్షి, హైదరాబాద్: ఐటీ ఎగుమతులు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు సంబంధించి దేశం మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన మానవ వనరుల అభివృద్ధి దిశగా తెలుగు రాష్ట్రాల్లో రెండు కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో ఇన్ఫర్మేషన్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ టెక్నాలజీ సంబంధిత రంగాలలో శిక్షణ ఇచ్చే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఈఎల్‌ఐటీ) సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. సికింద్రాబాద్, తిరుపతిల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ ప్రకటించింది. చెన్నై ఎన్‌ఐఈఎల్‌ఐటీ ఆధ్వర్యంలో వెంటనే ఈ కేంద్రాల కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు కేంద్ర ఐటీ, టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ తెలిపింది. వచ్చే మూడేళ్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇవి పూర్తిస్థాయిలో సిద్ధమవుతాయి. ఒక్కో కేంద్రం ద్వారా రాబోయే మూడేళ్లలో కనీసం ఐదువేల మందికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించారు.

టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు

తెలుగు రాష్ట్రాల్లోని యువత, ఇంజనీరింగ్ విద్యార్థులకు, సంబంధిత రంగాలలో ముందుకు వెళ్లాలని చూస్తున్న నిరుద్యోగులకు ఈ కేంద్రాలు ఒక చక్కటి అవకాశమని అధికారులు చెబుతున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి టెక్నాలజీ కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని అంటున్నారు. ఇక ఆయా రంగాలలో పరిశోధనలకు వేదికలుగా కూడా ఈ కేంద్రాలు ఉపయోగపడనున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలలో నూతన ఆవిష్కరణలకు, వ్యాపారాల ఏర్పాటు పెంపొందించడానికి కూడా ఈ కేంద్రాలు దోహదపడనున్నాయి. సికింద్రాబాద్, తిరుపతిల్లో ఎన్‌ఐఈఎల్‌ఐటీ కేంద్రాల ఏర్పాటుకు ఆమోదముద్ర పడటంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

మార్చి 31న జెన్‌కో ఏఈ, కెమిస్ట్ పోస్టులకు రాతపరీక్ష

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో 339 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), 60 కెమిస్ట్ పోస్టుల భర్తీకి ఓఎంఆర్ షీట్ పరీక్షకు బదులు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించాలని నిర్ణయించినట్లు సంస్థ సీఎండీ ఎస్‌ఏఎం రిజ్వీ తెలిపారు. మార్చి 31న హెచ్‌ఎండీఏ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్‌లో సీబీటీ పరీక్ష ఉంటుందన్నారు. వివరాల కోసం సంస్థ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అభ్యర్థులకు సూచించారు. జెన్‌కోలో ఏఈ, కెమిస్ట్ పోస్టులకు గతంలో నిర్వహించాల్సిన రాతపరీక్షలను వాయిదా వేసిన విషయం తెలిసిందే.

నేడు బంజారా ఉద్యోగులకు సెలవు

సాక్షి, హైదరాబాద్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం రోజున బంజారా సామాజికవర్గానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం సాధారణ సెలవుదినంగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వేల ఏళ్ల తేడాలు.. ఒకే చోట చిత్రాలు

యాదారం గుట్టల్లో ఆదిమానవుల రాతి బొమ్మలు



సాక్షి, హైదరాబాద్: వేల సంవత్సరాల పరిణామక్రమంలో వివిధ కాలాలకు చెందిన ఆదిమానవులు రకరకాల చిత్రాలను గీసి సమకాలీన జీవవైవిధ్యాన్ని పదిలపరిచారు. కొన్ని బొమ్మలు క్రీ.పూ. 8,500 సంవత్సరాల క్రితం నాటి సూక్ష్మ రాతియుగంలో చిత్రిస్తే, కొన్ని క్రీ.పూ.4 వేల సంవత్సరాల క్రితం కొత్త రాతి యుగంలో, మరికొన్ని క్రీ.పూ. వేయి సంవత్సరాల క్రితం ఇనుప యుగంలో గీసినవి కావటం విశేషం. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలోని యాదారం గుట్టల్లో ఇవి ఒకే చోట కొలువై ఉన్నాయి. 2017లో కొందరు పరిశోధకులు వీటిని గుర్తించగా, తాజాగా మరో బృందం పునఃపరిశీలించి మరికొన్ని కొత్త వివరాలను వెలుగులోకి తెచ్చింది. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ శివనాగిరెడ్డి, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు మహ్మద్ నసీరుద్దీన్, అహోబిలం కరుణాకర్, అఖిలభారత ప్రాచీన ఆలయ పునరుద్ధరణ ట్రస్ట్ చైర్మన్ ఆర్‌కే జైన్, స్థానిక యువకుడు వేణుమాధవ్ తదితరులు బుధవారం ఉదయం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి గుట్టపై 60 అడుగుల ఎత్తులో రెండు నిలువు బండలపై వివిధ కాలాల్లో చిత్రించిన బొమ్మలున్నాయి. మూపురం ఉన్న, మూపురం లేని ఎద్దు బొమ్మలు, ఎముకలు కనిపించేలా చిత్రించిన ఎక్స్‌రే ఎద్దు బొమ్మ, ముగ్గురు మనుషుల బొమ్మలు, నెమలి, ముగ్గులను పోలిన రేఖా చిత్రాలు, ఒక దానిపై ఒకటి నిలబడి తేనె పట్టును అందుకునే ప్రయత్నం చేస్తున్న కోతుల బొమ్మలు, ఎద్దును లాగుతున్న మనిషి, ఆవుదూడ.. ఇలా పలు చిత్రాలు వీటిల్లో ఉన్నాయి. ఈ ప్రాంతం సూక్ష్మ రాతి యుగం నుంచి తొలి చారిత్రక యుగం వరకు ఆదిమానవుల ఆవాసంగా భాసిల్లినట్టు వీటి ద్వారా తెలుస్తోందని వారు పేర్కొన్నారు. రాతి గొడ్డళ్లను నూరిన గుంటలు, ఇనుప యుగం సమాధిని కూడా గుర్తించారు. అలనాటి చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

డ్రైవర్‌కు గిఫ్టుగా హోండా సిటీ కారు?

- ‘సేవలకు’ప్రతిఫలంగా ఇచ్చిన శివబాలకృష్ణ
- శివబాలకృష్ణకు లంచాల సొమ్ము చేర్చడంలో కీలకంగా డ్రైవర్ గోపి, అటెండర్ హబీబ్
- ఈ ఇద్దరినీ అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: అక్రమార్జన కేసులో ఏసీబీకి చిక్కిన హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అవినీతి బాగోతాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా శివబాలకృష్ణ తన డ్రైవర్ గోపికి హోండాసిటీ కారును గిఫ్ట్‌గా ఇచ్చినట్టు వెల్లడైంది. కుటుంబ సభ్యులు, సన్నిహితులను బినామీలుగా మార్చుకున్న శివబాలకృష్ణ.. తన వద్ద డ్రైవర్‌గా, అటెండర్లుగా పనిచేసిన వారిని కూడా వినియోగించుకున్నట్టు తెలుస్తోంది. శివబాలకృష్ణకు వచ్చే లంచాలను తీసుకురావడంలో ఆయన వద్ద అటెండర్‌గా పని చేసిన హబీబ్, డ్రైవర్ గోపి కీలకంగా వ్యవహరించేవారని ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఇద్దరిని ఏసీబీ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకుని ప్రశ్నించినట్టు తెలిసింది. శివబాలకృష్ణకు లంచాలు తెచ్చిపెట్టడంలో సహకరించినందుకు ఈ ఇద్దరిపేర్లపైనా శివబాలకృష్ణ కొన్ని ఆస్తులు పెట్టినట్లు ఉన్న ఆధారాలను ముందుంచి ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. డ్రైవర్ గోపి, అటెండర్ హబీబ్‌ల పేరిట ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయన్న దానిపై సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది.

వద్దంటూనే.. వారినే మళ్లీ నియమించారు

- కేబినెట్ సిఫార్సులను తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదు
- దాసోజు తరఫు న్యాయవాది వాదనలు.. ‘గవర్నర్ కోటా’వివాదంలో వాదనలు వాయిదా

సాక్షి, హైదరాబాద్: ‘దాసోజు శ్రవణ్ రాజకీయ నాయకుడన్న కారణంగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా తిరస్కరిస్తే.. మరి ఆ తర్వాత నియమితులైన వారు రాజకీయాలకు సంబంధం లేకుండా ఉండాలి. అయితే, ఇప్పుడు నియమితులైన వారు కూడా రాజకీయ నాయకులే కదా. అందులో ఒకరు ఏకంగా రాజకీయ పార్టీనే నడిపిస్తున్నారు’అని దాసోజు శ్రవణ్ తరఫున సీనియర్ న్యాయవాది ఆదిత్యా సొంధీ హైకోర్టులో వాదనలు వినిపించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఆర్‌ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను సిఫార్సు చేస్తూ గత ప్రభుత్వం గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వ సిఫార్సును తిరస్కరిస్తూ 2023, సెప్టెంబర్ 19న గవర్నర్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) ప్రకారం గవర్నర్‌కు ఉన్న విస్తృత అధికారాల మేరకు తిరస్కరిస్తున్నట్లు ప్రకటించడాన్ని సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఆదిత్యా సొంధీ వాదనలు వినిపిస్తూ.. ‘గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థి అర్హతలకు.. పిటిషనర్ నామినేషన్ తిరస్కరణ కారణాలకు పొంతన లేదు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రిమండలి సిఫార్సులను తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదు. దీనిపై సుప్రీంకోర్టు, పలు హైకోర్టులు గతంలో తీర్పులిచ్చాయి. గవర్నర్‌కు అభ్యంతరం ఉంటే పునఃపరిశీలన కోసం మాత్రమే వెనక్కు పంపగలరు తప్ప సిఫార్సులను తిరస్కరించే అధికారం లేదు. తిరస్కరణ కారణంగా హక్కును కోల్పోయినందున రాజ్యాంగం ప్రకారం గవర్నర్ చర్యపై కోర్టును ఆశ్రయించే అర్హత పిటిషనర్‌కు ఉంటుంది. రాజకీయాలతో సంబంధం లేకుండా గవర్నర్ల నియామకమే జరగడం లేదు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీలు ఆ పార్టీకి చెందిన వారినే గవర్నర్లుగా నియమిస్తున్నారు. శ్రవణ్, సత్యనారాయణ పేర్లను నెలల తరబడి పరిశీలించిన గవర్నర్.. కోదండరామ్, అమీర్ అలీ ఖాన్‌ల పేర్లను మాత్రం ప్రభుత్వం సిఫార్సు చేసిన వెంటనే ఆమోదించారు’అని వాదనలు వినిపించారు. తదుపరి వాదనలను ధర్మాసనం నేటికి వాయిదా వేసింది.



రాత్రిళ్లు మెరిసే మొక్కలు.. అమ్మకానికొచ్చాయ్!

రాత్రి అయిందంటే.. అడవిని చిమ్మ చీకటి కమ్ముకుంటుంది. మొక్కలు, చెట్లు, జంతువులన్నీ చీకట్లో ఉండిపోతాయి. కానీ అక్కడక్కడా మిణుగురు పురుగులు (ఫైర్‌ఫ్లై) వెలుగులు చల్లుతూ తిరుగుతుంటాయి. కొన్ని రకాల పుట్టగొడుగులు (బయో ల్యూమినిసెంట్ మష్రూమ్స్) చిన్నగా కాంతిని వెదజల్లుతుంటాయి. ఇది చూసిన శాస్త్రవేత్తలు వినూత్నంగా ఆలోచించి.. చీకట్లో కాంతిని వెదజల్లే మొక్కలను సృష్టించారు. పుట్టగొడుగుల్లో కాంతిని వెదజల్లే సామర్థ్యానికి కారణమైన జన్యువులను సేకరించి.. ‘పెటునియా’పూల మొక్కల్లో ప్రవేశపెట్టారు. వీటికి ‘ఫైర్‌ఫ్లై పెటునియా’అని పేరుపెట్టారు. తెలుపు రంగులో ఉండే ఈ మొక్కల పూలు.. రాత్రిపూట ఆకుపచ్చని కాంతులు వెదజల్లుతూ ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడీ పూల మొక్కలను అమ్మకానికి కూడా పెట్టారు. ఒక్కో మొక్క ధర సుమారు రూ.2,500 మాత్రమే (30 డాలర్లు).

➤ ఈ ‘ఫైర్‌ఫ్లై పెటునియా’మొక్కలను అభివృద్ధి చేసినది అమెరికాలోని ఇడహో రాష్ట్రానికి చెందిన లైట్ బయో సంస్థ. 50వేల మొక్కలను అమ్మకానికి సిద్ధం చేసింది. ప్రస్తుతానికి ఇవి అమెరికాలో మాత్రమే విక్రయిస్తున్నట్టు ప్రకటించింది. ఇవి జన్యుమార్పిడి మొక్కలు కావడంతో.. అనుమతులను బట్టి ఇతర దేశాల్లోనూ అమ్మేందుకు ప్రయత్నిస్తామని పేర్కొంది.

–సాక్షి సెంట్రల్ డెస్క్

జడ్జి కుమారుడిపై ఫిర్యాదు తీసుకోరా?

పోలీస్ స్టేషన్.. ఏమైనా పర్యాటక కేంద్రమా?

- ఫిర్యాదు చేసేందుకు కాకుండా ప్రజలు సందర్శనకు వస్తారా?
- జ్యుడీషియల్ అధికారి కుమారుడిపై ఫిర్యాదు చేస్తే స్వీకరించరా?
- కోర్టుకు హాజరై వివరణ ఇవ్వండి..
- కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌ఓపై సీజే ధర్మాసనం తీవ్ర ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ‘పోలీస్‌స్టేషన్.. ఏమన్నా పర్యాటక కేంద్రం అనుకుంటున్నారా? ప్రజలు ఫిర్యాదు చేసేందుకు కాకుండా సందర్శనకు వస్తుంటారా? జ్యుడీషియల్ అధికారి కుమారుడిపై ఫిర్యాదు చేస్తే తీసుకోరా? దేశంలో ఎవరిపై ఫిర్యాదు చేసినా తీసుకోవాల్సిన బాధ్యత మీకుందని తెలియదా? ఓ మహిళ పోలీస్ స్టేషన్‌కు వచ్చి వేధింపుల ఆరోపణలు చేసి.. ఆ విషయంలో కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి కుమారుడిపై ఫిర్యాదు చేస్తే ఎఫ్‌ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదో శుక్రవారం నేరుగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వండి. ఏ కారణాలతోనైనా న్యాయస్థానం ముందు హాజరుకాకుంటే బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తాం’ అని కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌ఓ ఓదెల వెంకట్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

సెషన్స్ జడ్జి కుమారుడిపై ఎఫ్‌ఐఆర్‌కు ఆదేశాలు

కరీంనగర్ జిల్లాకు చెందిన రమ్య కోర్టులో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమితురాలయ్యారు. అయితే సెషన్స్‌జడ్జి కుమారుడు తనను వేధిస్తున్నాడంటూ ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తన విద్యార్హత, ఉద్యోగావకాశాలకు సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందంటూ ఆమెను సర్వీసు నుంచి తొలగించారు. ఇదే విషయంపై ఆమె రెండు రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. సీజే ధర్మాసనం ముందుకు ఈ అంశం రావడంతో సదరు సెషన్స్ జడ్జి కుమారుడిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేలా ఎస్‌హెచ్‌ఓకు ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వ న్యాయవాది రూపేందర్‌కు హైకోర్టు స్పష్టం చేసింది.

జిల్లా జడ్జి కుమారుడు.. చట్టానికి అతీతుడా?

ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. తాము ఆదేశించినా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కోర్టు ఆదేశాలను ఎస్‌హెచ్‌ఓకు సరిగా తెలియజేయలేదా? లేక ఆ మహిళ పీఎస్‌కు వచ్చినా ఫిర్యాదు తీసుకోలేదనే కారణంతో ఎస్‌హెచ్‌ఓను సమర్థించే ప్రయత్నం చేస్తున్నారా అని జీపీపై అసహనం వ్యక్తం చేసింది. ‘కోర్టు ఆదేశాలున్నా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంలో కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌ఓ నిర్లక్ష్యం ప్రదర్శించారు. పీఎస్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహిళను వేచి ఉండాల్సిందిగా కోరడం రాజ్యాంగ ధర్మాసనం ఆదేశాలను ఉల్లంఘించడమే. ఇది సమాజంలో అత్యంత దారుణమైన పరిస్థితి. నిందితుడు జిల్లా జడ్జి కుమారుడన్న కారణంగా ఎస్‌హెచ్‌ఓ నిందితుడిని రక్షించడానికి ప్రయత్నిస్తున్నారు. అతను చట్టానికి అతీతుడా? చట్టం ప్రకారం పరిపాలించే సమాజంలో ఇలాంటి వాటికి తావు లేదు. ఈ ఘటన మా మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురిచేసింది’ అని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

ఏఏజీని పిలిపించిన ధర్మాసనం..: విచారణ సందర్భంగా అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ)ని ధర్మాసనం కోర్టు హాల్‌కు పిలిపించింది. ‘కొందరు జీపీలపై ఆధారపడవద్దు. ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని రాజ్యాంగ ధర్మాసనం ఆదేశించినా.. ఎస్‌హెచ్‌ఓ ఉల్లంఘించారు. అంతేకాదు ఫిర్యాదుదారుని ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పీఎస్‌లో నిరీక్షించేలా చేశారు. ఎఫ్‌ఐఆర్ నమోదు చేయమని సూచించే ధైర్యం కూడా మీ న్యాయాధికారులకు లేదు. ఇది నిజంగా దిగ్భ్రాంతికర విషయం’ అని వ్యాఖ్యానించింది. ఎస్‌హెచ్‌ఓను తమ ముందు హాజరు కావాలని ఆదేశిస్తూ.. విచారణ వాయిదా వేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.